thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 329 కరీంనగర్ బుధవారం, 4 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రైతులకు భారీ షాక్.. పెరగనున్న యూరియా ధరలు!

న్యూఢిల్లీ : ఇటీవల యూరియా దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మరో షాక్ తగలనుంది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే దేశంలో ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు కొన్ని రకాల ఎరువుల ఎగుమతులను ఈ నెల 1 నుంచే చైనా నిలిపివేసింది. ఈ నిర్ణయం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మనం ఉపయోగించే టెక్నికల్ మోనోఅమ్మోనియం ఫాస్ఫేట్ (టీఎమ్ఏపీ), అడ్బ్లూతో పాటు యూరియా, డీఏపీ వంటి ఎరువులను దాదాపు 95 శాతం చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు చైనా ఆంక్షలతో వీటి ధరలు మరో 10-15 శాతం పెరిగే అవకాశం ఉంది.

# కేసీఆర్ అరెస్టుకు రంగం సిద్ధమైందా?

## కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లేనా...?

## కేసీఆర్ వ్యూహమేంటి?



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అరెస్టు అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. అయితే కేసీఆర్ చట్టానికి దొరక్కుండా పారిపోయే వ్యక్తి కాదు మరియు సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఇప్పుడు ఆయనకు లేదు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం, విచారణ పూర్తి కాకుండా నిందితులను అరెస్టు చేయడం అంత సులభం కాదు. ఇది కేవలం చట్టపరమైన అంశం మాత్రమే కాదు, ఒక బలమైన Political Question (రాజకీయ ప్రశ్న) గా కనిపిస్తోంది. రాజకీయాల్లో "Process is the punishment" అనే సూత్రం తరచుగా కనిపిస్తుంది, అంటే విచారణ ప్రక్రియ ద్వారానే ప్రత్యర్థులను వేధించడం. గతంలో రేవంత్ రెడ్డి ఎదుర్కొన్న పరిస్థితుల దృష్ట్యా, ఇప్పుడు కేసీఆర్‌ను ఇరుకున పెట్టే అవకాశం వస్తే ఆయన వదులుకోరని భావిస్తున్నారు.

అయితే, రేవంత్ రెడ్డి స్వతంత్రంగా నిర్ణయం తీసుకోలేరు; దీనికి కాంగ్రెస్ High Command (హైకమాండ్) అనుమతి మరియు రాజకీయ లాభనష్టాల బేరీజు అత్యంత ఆవశ్యకం.

ఫోన్ ట్యాపింగ్ వంటి కేసుల్లో నేరాన్ని నిరూపించడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఇలాంటి వ్యవహారాల్లో సాధారణంగా Oral Orders (మౌఖిక ఆదేశాలు) మాత్రమే ఉంటాయి తప్ప, ఆన్ పేపర్ ఎటువంటి ఆధారాలు దొరకవు. గతంలో 'ఓటుకు నోటు' కేసులో ఆడియో, వీడియో Evidence (సాక్ష్యం) ఉన్నప్పటికీ ఏమీ కాలేదని, కాబట్టి కేసీఆర్ వంటి అనుభవజ్ఞుడిపై Criminal Culpability (నేరపూరిత బాధ్యత) నిరూపించడం దర్యాప్తు సంస్థలకు ఒక పెద్ద Challenge (సవాలు) అని చెప్పవచ్చు. నాలుగున్నర గంటల విచారణ అనేది కేవలం ప్రజల్లో ఒక Perception (అభిప్రాయం) కల్పించడానికి చేసే ప్రయత్నమని మూలాలు చెబుతున్నాయి. గతంలో జగన్ మోహన్ రెడ్డి 16 నెలలు జైలులో ఉన్నా, ప్రజలు ఆయనను ఆదరించారు. దీన్ని బట్టి చూస్తే, అరెస్టులు ఓటర్ల తీర్పును ఎల్లప్పుడూ ప్రభావితం చేయవు. అంతిమంగా ఈ పోరాటంలో Legal (చట్టపరమైన) గెలుపు కంటే Public Support (ప్రజా మద్దతు) సంపాదించడమే నాయకుల అసలు Target (లక్ష్యం) గా కనిపిస్తోంది.




## ట్రాక్టర్ బోల్తా పడి నలుగురి మృతి

జగిత్యాల: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. వ్యవసాయ కూలీలు పసుపుకోతకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మల్లాపూర్ మండలం ముగిలిపేట వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## ఎంఐఎం మాజీ ఎమ్మెల్యే పాషా ఖాద్రీ కన్నుమూత



హైదరాబాద్: ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు.

పాషా ఖాద్రీ 1986 నుంచి 1991 వరకు జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా పనిచేశారు. 2004 నుంచి 2014 వరకు చార్మినార్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, 2018 నుంచి 2023 వరకు యాకుత్‌పురా నియోజకవర్గం ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు.




# రైతులకు శుభవార్త!

## మూడో వారంలో రైతు భరోసా నిధులు విడుదల

హైదరాబాద్ : తెలంగాణలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన పార్టీలకు మున్సిపల్ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. సీఎం రేవంత్ జిల్లాల పర్యటనలకు సిద్ధం అవుతున్నారు. అటు బీఆర్ఎస్, బీజేపీ సైతం ఈ ఎన్నికల్లో బలం చాటేందుకు సిద్ధమైంది. కాగా, ఇదే సమయం లో రైతు భరోసా నిధుల విడుదల ఆలస్యం అవుతోంది. రైతులు నిరీక్షిస్తున్నారు. కాగా.. తాజాగా రైతు భరోసా నిధుల విడుదల పైన ప్రభుత్వం నుంచి కీలక సమాచారం అందుతోంది. రైతులు వేచి చూస్తున్న రైతు భరోసా నిధుల విడుదల పైన స్పష్టత వచ్చింది. సంక్రాంతి సమయంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తొలుత భావించారు. అయితే, అమలు కాలేదు. ఇదే సమయంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయింది. ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. ప్రభుత్వం ఇప్పుడు రైతు భరోసా నిధులు విడుదల పైన తుది కసరత్తు చేస్తున్నారు. రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం దాదాపు ఫిక్స్ చేసారు. విడత ల వారీగా నిధుల చెల్లింపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కాగా, తాజా కసరత్తు వేళ రైతు భరోసా అమలు.. అర్హత పైనా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పథకం అందుకుంటున్న లబ్దిదారుల్లో తాజా అర్హతల మేర కోత విధించారు. ఈ నెల మూడో వారం నుంచి రైతుల ఖాతాల్లో నిధులను జమ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

**రైతు భరోసా విడుదల మార్గదర్శకాలు...** పంట సాగు చేస్తున్న భూములకు మాత్రమే ఈ పథకం వర్తింపచేయాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. అందులో భాగంగా శాటిలైట్ సర్వే ఆధారంగా పంట భూములను గుర్తిస్తోంది. దీనికి సంబంధించిన తుది నివేదిక ప్రభుత్వానికి అందాల్సి ఉంది. దీంతో.. రైతు భరోసా నిధులు సంక్రాంతికి విడుదల చేసే అవకాశాలు లేవని తెలుస్తోంది. దీనికి సంబంధించి తాజాగా రాష్ట్ర రైతు కమిషన్ సైతం వ్యవసాయ శాఖ అధికారులతో చర్చలు చేసింది. జనవరి నెలాఖరులోనే విడుదల దిశగా కసరత్తు జరిగింది. అయితే, మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ కారణంగా నిర్ణయం వాయిదా పడినట్లు చెబుతున్నారు.

ఈ నెల 11న పోలింగ్ పూర్తి కానుంది. దీంతో.. ఈ నెల మూడో వారంలో తాజాగా ఖరారు చేసిన అర్హుల ఖాతాల్లో భరోసా నిధులు జమ చేయనున్నారు. పంట భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారు.

# త్వరలో యుద్ధం?

## టెన్షన్‌లో ప్రపంచ దేశాలు!




అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు యుద్ధానికి దారితీసేలా కనిపిస్తున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు సమీపిస్తుండటంతో పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి.

**ముదురుతున్న యుద్ధ మేఘాలు....** అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. "యూఎస్ఎస్ అబ్రహం లింకన్" విమాన వాహక నౌక నేతృత్వంలోని ఓ భారీ సైనిక దళం ఇప్పటికే పశ్చిమాసియాకు చేరుకుంది. అణు ఆయుధాలు లేని న్యాయమైన ఒప్పందం కోసం ఇరాన్ వెంటనే చర్చల టేబుల్ ముందుకు రావాలని.. సమయం మించిపోతోందని ట్రంప్ స్పష్టం చేశారు. ఒకవేళ ఇరాన్ మొండికేస్తే, జూన్ నెలలో జరిగిన దాడుల కంటే ఈసారి దాడి చాలా "భీకరంగా" ఉంటుందని హెచ్చరించారు.

**ఇరాన్ ధీటైన సమాధానం...** అమెరికా బెదిరింపులకు తాము లొంగే ప్రసక్తి లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చి చెప్పారు. "మా సైన్యం పూర్తి అప్రమత్తంగా ఉంది. మా వేళ్లు ట్రిగ్గర్‌పై ఉన్నాయి. ఎలాంటి దాడి జరిగినా తక్షణమే, ఊహించని రీతిలో స్పందిస్తాం" అని అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. సైనిక ఒత్తిడి లేదా బెదిరింపుల నీడలో ఎలాంటి చర్చలు జరగవని, పరస్పర గౌరవం ఉన్నప్పుడే దౌత్యం సాధ్యమని ఇరాన్ స్పష్టం చేసింది. ఉద్రిక్తతలకు ప్రధాన కారణాలు ఈ తాజా వివాదం వెనుక మూడు ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. 2015 నాటి అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత, ఇరాన్ తన యురేనియం శుద్ధిని పెంచిందని అమెరికా ఆరోపిస్తోంది. దీనిని అడ్డుకోవడమే ట్రంప్ ప్రధాన లక్ష్యం. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల్లో వేలాది మంది మరణించారు. నిరసనకారులను చంపడం ఆపకపోతే సైనిక చర్య చేపడతామని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ నిరంతరం నిఘా ఉంచింది. అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ కూడా దాడులకు సిద్ధంగా ఉండటంతో పరిస్థితి మరింత జటిలమైంది. ప్రపంచ దేశాల ఆందోళన ఈ యుద్ధం గనుక మొదలైతే దాని ప్రభావం ప్రపంచం మొత్తం మీద పడుతుంది. పశ్చిమాసియా నుంచి చమురు సరఫరా నిలిచిపోతే.. భారత్ వంటి దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లు ఒడిదుడుకుల్లో ఉన్నాయి. యుద్ధం సంభవిస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇరాన్, పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వేలాది మంది భారతీయుల భద్రతపై ఆందోళన నెలకొంది. ఇప్పటికే అమెరికా తన పౌరులను ఇరాన్ విడిచి రావాలని ఆదేశించింది.




హైదరాబాద్: ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్‌లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు.

నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.




ముంబయి: చాలా రోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఎన్నాళ్లగానో వేచి చూస్తున్న అమెరికాతో ట్రేడ్ డీల్‌పై స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ రంకెలేసింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి చివరి వరకు బుల్లెట్‌లా బుల్ రన్ కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 2 వేల పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,700 ఎగువకు చేరింది. అన్ని రంగాల స్టాక్స్ లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.12 లక్షల కోట్లు పెరిగి రూ.467.35 లక్షల కోట్లకు చేరింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికా దిగుమతులపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం సుంకాలు 18 శాతానికి దిగి రానున్నాయి. ఈ ప్రకటన స్టాక్ మార్కెట్ సూచీలకు కొత్త బూస్ట్ ఇచ్చింది. బుల్ పరుగు ఇలా: ట్రంప్ ప్రకటన నేపథ్యంలో సెన్సెక్స్ ఆరంభంలోనే దాదాపు 3600 పాయింట్ల లాభంతో 85,323.20 వద్ద (క్రితం ముగింపు 81,666.46) ప్రారంభమైంది. ఓ దశలో 4 వేలకు పాయింట్ల లాభంతో 85,871.73 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2072.67 పాయింట్ల లాభంతో 83,739.13 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 26,341.20 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 639.15 పాయింట్ల లాభంతో 25,727.55 వద్ద స్థిరపడింది. కోలుకున్న రూపాయి: దేశీయ కరెన్సీ రూపాయి కూడా కోలుకుంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా.. ట్రేడ్ డీల్ నేపథ్యంలో ఒక్కరోజులోనే 1.36 శాతం బలపడి 90.26కి చేరింది. రూపాయి విలువ ఈ స్థాయిలో బలపడడం ఇదే తొలిసారి. ఆ రెండూ మినహా: సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్ (9.12 శాతం), బజాజ్ ఫైనాన్స్ (6.68 శాతం), ఇండిగో (5.51 శాతం), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (283.25), సన్‌ఫార్మా (4.54) చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4921 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టత



దిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.




## పురపోరులో సామాజిక మాధ్యమాలకు ప్రాధాన్యం
## స్మార్ట్ ప్రచారంతో దూసుకెళ్తున్న అభ్యర్థులు

మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, వారి కార్యకర్తలకు మొబైల్ ఫోన్ ప్రచారాస్త్రంగా మారింది. కాంగ్రెస్ మినహా బీఆర్ఎస్, బీజేపీలు అభ్యర్థుల ఖరారు ప్రక్రియను పూర్తి చేయడంతో ఎన్నికల ప్రచారం జోరందుకున్నది. అభ్యర్థులు సంప్రదాయ పద్ధతులకే పరిమితం కాకుండా డిజిటల్ ప్రచారానికి పెద్దపీట వేస్తున్నారు.

సోషల్ మీడియాను ప్రధాన ఆయుధంగా మార్చుకుని స్మార్ట్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టారు. వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వేదికలపై ప్రచార వీడియోలు, పోస్టర్లు, వాయిస్ మేసేజ్‌లతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

తమను గెలిపిస్తే చేపట్టే అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా వీడియోలు రూపొందించి, సోషల్ మీడియా ద్వారా ఓటర్లకు చేర వేస్తున్నారు. ఇందుకోసం సాంకేతిక అవగాహన ఉన్న యువకులతో ప్రత్యేక ప్రచార బృందాలను ఏర్పాటు చేసుకున్నారు.

**తక్కువ ఖర్చు.. ఎక్కువ ప్రచారం..** డిజిటల్ ప్రచారంతో ఖర్చు తక్కువ కావడంతో పాటు, ఎక్కువ మంది ఓటర్లను చేరు కునే అవకాశం లభిస్తుండడంతో అభ్యర్థులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వనపర్తి జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో అక్షరాస్యులు ఎక్కువగా ఉండటం, దాదాపు కుటుంబంలో ప్రతీ ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్ ఉండటం ఎన్నికల ప్రచారానికి అనుకూలంగా మారింది.

కంప్యూటర్, మొబైల్ సాయంతో రూపొందించిన సందేశాలను ఒకేసారి వేలాది మందికి పంపించే అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. అందుకోసం అభ్యర్థులు వార్డుల వారీగా ఓటర్ల వివరాలు, ఫోన్ నెంబర్లను సేకరించుకున్నారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి, ప్రతీ రోజు ప్రచార సందేశాలు, వీడియోలను షేర్ చేస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు లైవ్ వీడియోలు, వాయిస్ కాల్‌లతో ప్రచారం కొనసాగిస్తున్నారు.

## మేడారం జాతర విజయవంతం: సీతక్క



హైదరాబాద్, ఫిబ్రవరి 03: ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు.




వరంగల్: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన అన్నా లెజినోవాకు.. ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న స్వాగతం పలికారు. తొలుత ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్నపన మండపంలో ముఖ్యఅర్చకులు వెంకటనాగరాజ శర్మ, వేదపండితులు ప్రదీప్ కుమార్ శర్మ మహదాశీర్వచనం పలికి.. అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.




జగిత్యాల: మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ టికెట్ల కేటాయింపుపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపాలిటీలో టికెట్ల కేటాయింపుపై ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి ఎక్కువ టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. ఆయన వర్గానికి 30, తన వర్గానికి 20 టికెట్లు ఇచ్చారన్నారు. ఈ చర్యతో తన మెడ కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నేతలు పెద్ద సంఖ్యలో జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకుంటున్నారు.

## నిరుద్యోగులను నమ్మించి నయవంచన.. రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు




హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడు తోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు.

**కేటీఆర్ ట్వీట్..** మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని వ్యాఖ్యలు చేశారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

అశ్వారావుపేట(భద్రాద్రి కొత్తగూడెం): ఇక్కడ నోటుకు ఓటు అమ్మబడవు అంటూ అశ్వారావుపేటలో అప్పారావు అనే ఓ వ్యక్తి తన ఇంటి ముందు గేటుకు ఫ్లెక్సీ కట్టారు. అశ్వారావుపేటలో మునిసిపాలిటీ ఎన్నికలు జరుగుతున్నాయి. అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. వార్డు, నిలబడిన అభ్యర్థులనుబట్టి ఓటుకు ఇంత ఇస్తారంట అంటూ పట్టణంలో రకరకాల ప్రచారం జరుగుతుంది. పట్టణానికి చెందిన ఎలక్ట్రికల్ వ్యాపారి అప్పారావు తమ ఇంట్లో ఓట్లు నోటుకు అమ్మబడవు అంటూ ఫ్లెక్సీ పెట్టడం చర్చనీయాంశంగా మారింది. అందరూ ఈ విధంగా డబ్బులు వద్దంటే బాగుండునేమో అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.




చురకలు



# మాడభూషి జీవితం... నేటి తరానికి ఆదర్శం

## - ఫిబ్రవరి 4...మాడభూషి అనంత శయనం అయ్యంగార్ జయంతి




మాడభూషి అనంత శయనం అయ్యం గార్ ప్రముఖ న్యాయవాది గా, సామాజిక కార్యకర్తగా, స్వాతం త్ర్య సమర యోధుడుగా, అత్యుత్త మ పార్లమెంటు సభ్యుడిగా, వక్తగా, విశిష్ట పండితుడిగా, లోకసభ స్పీకర్ గా, పాత కరగానికి చెందిన జాతీయ నాయకులలో విశిష్ట స్థానం దక్కించు కున్నారు. అయ్యంగార్ 1891 ఫిబ్రవరి 4 న ఆంధ్రప్రదేశ్ లోని ఆధ్యాత్మిక పట్ట ణం తిరుపతి సమీపంలో తిరుచనూరులో జన్మించారు. తిరుపతి లోని దేవస్థానం ఉన్నత పాఠశాలలో ప్రారంభ విద్యను పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం మద్రాసుకు వెళ్లారు. మద్రాసులోని పచయ్యప్ప కళాశాల నుండి బిఏ పట్టా పొందిన తరువాత, 1913 లో మద్రాస్ లా కాలేజ్ నుండి న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు.1912 లో గణిత విషయ ఉ పాధ్యాయు డిగా నియమితులై, 1915లో న్యాయ వాద వృత్తిలోకి ప్రవేశించారు. స్వల్ప వ్యవధిలో, ఒక ప్రొఫెషనల్ న్యాయవాదిగా, అసాధారణ సామర్థ్యంతో ఖ్యాతిని పొందారు. జీవనోపాధిని సంపాదించే సాధనం గా మాత్రమే న్యాయవాద వృత్తిని చూడక, భారత ప్రజల అవసరాల కు అనుగుణంగా దేశ న్యాయ వ్యవస్థను మెరుగు పరచడంలో ఆసక్తి చూపారు. అయ్యంగార్ చాలా చిన్న వయస్సు లోనే స్వాతంత్ర్య ఉద్యమం లోకి ప్రవేశించారు. తన సొంత రాష్ట్రం లోనే, బ్రిటిష్ వలస వాదానికి వ్యతి రేకంగా జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రముఖ వ్యక్తులలో ఒకరిగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంలో ఉండి, పోరాడటమే లక్ష్యంగా, 1934 లో కేంద్ర శాసన సభ ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించు కున్నప్పుడు, అయ్యం గార్ అధిక మెజారిటీతో సభకు ఎన్నికయ్యారు. వాస్తవాలు మరియు గణాంకాలతో ఆయన సహజమైన చర్చా నైపుణ్యాల ద్వారా, అయ్యంగార్ త్వరలోనే అసెంబ్లీలో తన వాదనా పటిమతో తనదైన ముద్ర వేశారు. మొదట వ్యక్తిగత సత్యాగ్రహ ప్రచారంలో తరువాత 1942 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నం దుకు 1940, 1944 మధ్య అయ్యం గార్ దాదాపు మూడు సంవత్స రాలు జైలు శిక్ష అనుభవించారు. రాజకీయ స్వేచ్ఛ కోసం ఉద్యమం లో చురుకుగా పాల్గొనడమే కాకుండా, సమాజం లోని అణగా రిన వర్గాల, సామాజిక విముక్తి దిశగా, నిర్దేశించిన వివిధ కార్య కలాపాలలో అయ్యంగార్ పాల్గొ న్నారు. అంటరాని సామర్థ్యం వంటి సామాజిక చెడులతో పోరాడటానికి గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాల నుండి ప్రేరణ పొందిన అయ్యంగార్, హరిజనులకు ఆలయ ప్రవేశం, అంటరాని తనం నిర్మూలన కోసం ఉద్యమాలలో ముందంజలో ఉన్నా రు. తరువాత, హరిజన్ సేవక్ సంఘ అధ్యక్షుడిగా తమ సామ ర్థ్యంలో, హరిజనుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఆయన మొట్టమొదటి సారిగా చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్ కు ఎన్నిక అయ్యారు. తరువాత, చిత్తూరు కో - ఆపరేటివ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ డైరెక్టర్గా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఎంపిక అయి నారు. 1946-47 మధ్య కాలంలో పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ కార్య దర్శిగా కూడా పని చేశారు. రాజ్యాం గ అసెంబ్లీ సభ్యునిగా పని చేశారు. జి.వి.మవలంకర్ను రాజ్యాంగ అసెంబ్లీ (శాసనసభ) స్పీకర్గా ఎన్నుకున్న నేపథ్యంలో, అయ్యం గార్ను దాని డిప్యూటీ స్పీకర్గా ఎంపిక చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ స్టీరింగ్ కమిటీలో కూడా పని చేశారు. 1950-52 మధ్య కాలంలో అయ్యంగార్ తాత్కాలిక పార్ల మెంటు డిప్యూటీ స్పీకర్గా కొన సాగారు. 1950 లో తాత్కాలిక పార్లమెంట్ మొదటి అంచనా కమిటీకి ఛైర్మన్గా ఎంపికయ్యారు. సమావేశాలను నైపుణ్యంగా నిర్వహించారు. అయ్యంగార్ గొప్ప, సమర్థ వంతమైన పార్ల మెంటు సభ్యుడని నిరూపించు కున్నారు. పార్లమెంటరీ నిబంధన లను నిలబెట్టడానికి కట్టుబడి ఉన్నారు. 1957 లో రెండవ లోక్సభ ఏర్పడి నప్పుడు, అయ్యంగార్ ఐదేళ్ల పాటు ఆయనను స్పీకర్గా ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. వాయిదా తీర్మా నాలు, బిల్లులు, తీర్మానాలు, స్టాండింగ్ కమిటీలు, కాలింగ్ అటెన్షన్ నోటీసులు మొదలైన వాటిపై అయ్యంగార్ పద్ధతి అనుసరణీయంగా మారింది.

1960 లో టోక్యోలో జరిగిన 49 వ ఇంటర్ పార్లమెంటరీ సమావేశానికి భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి నాయకుడిగా పనిచేసిన ఆయన, భారతదేశం లోని శాసన సభల ప్రిసైడింగ్ అధికారుల సమా వేశ నిర్వహణలో ఆసక్తి చూపారు. 1962 సార్వత్రిక ఎన్ని కలలో అయ్యంగార్ మూడవ సారి లోక్సభకు ఎన్నికైనా, బీహార్ గవర్నర్గా పనిచేయడానికి వీలుగా ఆయన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాదాపు మూడు దశాబ్దాల విశిష్ట పార్లమెంటరీ జీవితంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయ జీవితాన్ని విడిచిపెట్టిన తరువాత, హరిజన్ సేవక్ సంఘ్, రామ్ విలాస్ సభ, చిత్తూరు డ్రామా టిక్ అసోసియేషన్, కాస్మోపాలిటన్ క్లబ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ ఫెడరల్ గవర్నమెంట్ తదితర సామాజిక - సాంస్కృతిక, విద్యా సంస్థలతో సంబంధం కొనసాగించారు. పార్లమెంటరీ జీవితం తరువాత, తన జీవితాంతం అయ్యంగార్ ఫిలాసఫీ, సంస్కృత సాహిత్యం, భారతీయ సంస్కృతి అధ్యయనం ప్రచారం పట్ల ఆయన ఎంతో ఆసక్తి చూపారు. కొంతకాలం సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యుడిగా, రిషికుల్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్గా పని చేశారు. భారత పార్లమెంటుపై ఒక పుస్తకాన్ని కూడా రాశారు. మతాలు ప్రధానంగా మనిషికి, మనిషికి మధ్య ఉన్న తేడాలను తొలగించడానికి, మనిషిలో సోదర భావనను పెంపొందించ డానికి తద్వారా అతన్ని ఉద్ధరించడానికి సహాయపడతాయని నమ్మారు. అయ్యంగార్ ప్రకారం, ఉన్నత కులం లేదా తక్కువ కులం వంటివి ఏవీ లేవు, కానీ ఉన్నత చైతన్యం, తక్కువ చైతన్యం మాత్రమే ఉ న్నాయి, ఈ రెండింటికి పుట్టుకతో సంబంధం లేదు. పుట్టుక ప్రాతిపదికన ఆరాధన హక్కును తిరస్కరించడం దైవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని నమ్మారు. ఈ నమ్మకమే హిందూ దేవాలయాల లోకి ప్రవేశించాలన్న దళితుల వాదనకు మద్దతు ఇవ్వడానికి ఆయనను ప్రేరేపించింది. బీహార్ గవర్నర్గా పూర్తి కాలం పనిచేసిన తరువాత, శేష జీవితం గడపడానికి తన స్వగ్రామమైన తిరుపతికి తిరిగి వచ్చి, అయ్యం గార్ 1978 మార్చి 19 న తన 87 వ ఏట చివరి శ్వాస తీసుకునే వరకు సేవలు అందించారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# అవయవ మార్పిడిలో భారత వైద్య విప్లవం: రాజ్ వీర్ సింగ్ యాదవ్ పరిశోధన ప్రస్థానం

## ఫిబ్రవరి 4...మూడు రాష్ట్రపతుల గౌరవ శస్త్ర వైద్యుడు - రాజ్ వీర్ సింగ్ యాదవ్ వర్ధంతి

ఆధునిక భారత వైద్య చరిత్రలో అవయవ మార్పిడి శాస్త్రం ఒక విప్లవాత్మక మలుపు తిరిగిన ఘట్టంగా నిలిచింది. ముఖ్యంగా మూత్రపిండాల వ్యాధులతో బాధపడే లక్షలాది రోగులకు కొత్త జీవనావకాశాలను కల్పించిన కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స రంగంలో భారత దేశానికి అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిన మహోన్నత వైద్య శాస్త్రవేత్తల్లో డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ అగ్రగణ్యుడు. ఆయన చేసిన కృషి కేవలం ఒక శస్త్రచికిత్స విజయానికి పరిమితం కాకుండా, భారత వైద్య విజ్ఞానాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన చారిత్రక అధ్యాయంగా నిలుస్తుంది. ఆర్. వి. ఎస్. యాదవ్ 1937 జూలై 27న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని బదౌన్ జిల్లా నౌలిహరనాథ్పూర్ గ్రామంలో జన్మించారు. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ, విద్య పట్ల అపారమైన ఆసక్తి, మానవ సేవ పట్ల గాఢమైన నిబద్ధత ఆయన జీవిత దిశను నిర్ణయించాయి. లక్నో విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ప్రతిష్ఠాత్మక కింగ్ జార్జ్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించిన ఆయన 1961లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, 1964లో ఎంఎస్ (సర్జరీ) పట్టాను పొందారు. శస్త్ర చికిత్సలో ప్రావీణ్యం సాధించాలన్న ఆకాంక్షతో అంతర్జాతీయ స్థాయిలో మరింత శిక్షణ పొందిన ఆయన 1974లో ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ నుంచి ఎఫ్ఐసిఎస్ (జనరల్ సర్జరీ), 1977లో అమెరికన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ నుంచి ఎఫ్ఎసిఎస్ (సాధారణ శస్త్రచికిత్స) వంటి ప్రతిష్ఠాత్మక గౌరవాలను అందుకున్నారు. వైద్య వృత్తిలో ప్రారంభ దశ నుంచే యాదవ్ సంప్రదాయ శస్త్రచికిత్సలకు మాత్రమే పరిమితం కాకుండా, అప్పటివరకు భారతదేశంలో అరుదుగా చర్చకు వచ్చిన అవయవ మార్పిడి శాస్త్రంపై దృష్టి సారించారు. మూత్రపిండాల వైఫల్యం కారణంగా ప్రతీ ఏడాది వేలాది మంది రోగులు ప్రాణాలు కోల్పోతున్న వాస్తవం ఆయనను తీవ్రంగా కలిచివేసింది. డయాలిసిస్ వంటి చికిత్సలు తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందిస్తుండగా, శాశ్వత పరిష్కారంగా కిడ్నీ మార్పిడి అవసరమని ఆయన స్పష్టంగా గ్రహించారు. అయితే అప్పటి భారత వైద్య వ్యవస్థలో సాంకేతిక పరిమితులు, శిక్షణా లోపాలు, నైతిక సందేహాలు ఈ రంగ అభివృద్ధికి ప్రధాన అడ్డంకులుగా నిలిచాయి. ఈ పరిస్థితుల మధ్యనే 1973లో చండీగఢ్లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్)లో డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ భారతదేశంలో మొట్టమొదటి విజయవంతమైన మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సను నిర్వహించారు. ఇది భారత వైద్య చరిత్రలో ఒక మైలురాయి. అప్పటివరకు విదేశీ వైద్య సంస్థలకే పరిమితమైన ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను దేశీయ స్థాయిలో సాధించడం ద్వారా ఆయన లక్షలాది భారతీయులకు ఆశాజ్యోతిని వెలిగించారు. ఈ విజయం భారతదేశంలో అవయవ మార్పిడి కార్యక్రమాలకు పునాది వేసింది. కిడ్నీ మార్పిడిలో సాధించిన విజయంతో యాదవ్ అక్కడితో ఆగలేదు. మూత్రపిండాల సంబంధిత జన్యు లోపాలతో గర్భస్థ శిశువులు ఎదుర్కొనే సమస్యలపై ఆయన దృష్టి మరింత కేంద్రీకృతమైంది. గర్భంలోనే కిడ్నీలు సరిగా అభివృద్ధి చెందకపోవడం, జన్మించిన వెంటనే తీవ్రమైన మూత్రపిండ వైఫల్యానికి దారితీసే పరిస్థితులు అనేక కుటుంబాలను విషాదంలో ముంచుతున్నాయి. ఈ సమస్యలకు పుట్టిన తర్వాత చేసే చికిత్సలు పరిమిత ఫలితాలే ఇస్తున్నాయని గ్రహించిన యాదవ్, గర్భస్థ దశలోనే శస్త్రచికిత్స ద్వారా జోక్యం చేసుకునే అవకాశాలను పరిశీలించడం ప్రారంభించారు. ఇదే సందర్భంలో ఆయన చేసిన పరిశోధనలు మూత్ర పిండ మార్పిడీ లేదా ఫీటల్ కిడ్నీ ట్రాన్స్ప్లాంటేషన్ అనే విప్లవాత్మక భావనకు దారి తీశాయి. గర్భస్థ శిశువుపై శస్త్రచికిత్స చేయడం అనేది అత్యంత సున్నితమైన ప్రక్రియ. ఇది కేవలం శస్త్ర నైపుణ్యమే కాకుండా భ్రూణ విజ్ఞానం, ఇమ్యూనాలజీ, జన్యు వైద్య శాస్త్రం, ప్రసూతి వైద్యం వంటి అనేక విభాగాల



సమన్వయాన్ని కోరుతుంది. యాదవ్ ఈ అన్ని రంగాలను సమగ్రంగా అధ్యయనం చేసి, శాస్త్రీయంగా సాధ్యమైన మార్గాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. మూత్ర పిండ మార్పిడీ శస్త్రచికిత్స లక్ష్యం గర్భంలోనే శిశువు మూత్రపిండాల పనితీరును ప్రారంభించడం లేదా కనీసం ప్రాణాపాయ స్థితిని నివారించడం. పుట్టిన వెంటనే డయాలిసిస్ వంటి కఠిన చికిత్సలకు లోనవ్వాల్సిన పరిస్థితిని తగ్గించడం, శిశువు సాధారణ శారీరక అభివృద్ధికి అవకాశం కల్పించడం ఈ విధానంతో సాధ్యమవుతుందని ఆయన పరిశోధనలు సూచించాయి. ఈ ఆలోచన అప్పటి వైద్య ప్రపంచంలో విస్తృత చర్చకు దారితీసింది. యాదవ్ చేసిన కృషిలో మరో ముఖ్యమైన అంశం వైద్య నైతికత. గర్భస్థ శిశువుపై శస్త్రచికిత్స చేయడం తల్లి ఆరోగ్యం, శిశు వు భవిష్యత్తు వంటి అంశాలతో ముడిపడి ఉన్న సున్నితమైన విషయం. అందువల్ల చికిత్స ప్రయోజనాలు, ప్రమాదాలు, విజయావకాశాలను శాస్త్రీయంగా అంచనా వేసిన తర్వాత మాత్రమే ఈ విధానాలను అనుసరించాలని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. ఈ బాధ్యతాయుత దృక్పథమే ఆయనను కేవలం శస్త్రచికిత్స నిపుణుడిగా కాకుండా మానవతా విలువలతో కూడిన వైద్య శాస్త్రవేత్తగా నిలిపింది. డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ చేసిన సేవలకు గుర్తింపుగా 1982లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఆయనకు పద్మశ్రీ అవార్డును ప్రదానం చేశారు. ఆయన భారతదేశంలో మొదటి మూత్రపిండ మార్పిడి శస్త్రవైద్యుడిగా ఈ గౌరవాన్ని అందుకోవడం మరో చారిత్రక ఘట్టం. ఇది ఆయన వ్యక్తిగత విజయం మాత్రమే కాకుండా భారత వైద్య శాస్త్రానికి దక్కిన గౌరవంగా భావించబడింది. వైద్య రంగంలో ఆయన ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. వరుసగా ముగ్గురు భారత రాష్ట్రపతులు -- డాక్టర్ నీలం సంజీవ రెడ్డి, జ్ఞానీ జైల్ సింగ్, ఆర్. వెంకట రామన్ -- లకు గౌరవ శస్త్ర వైద్యుడిగా సేవలందించడం ఆయనపై దేశం ఉంచిన విశ్వాసానికి నిదర్శనం. ఈ బాధ్యతల్లో ఆయన అత్యున్నత వృత్తి నైపుణ్యాన్ని, నైతిక విలువలను పాటిస్తూ ఆదర్శంగా నిలిచారు. 2006 ఫిబ్రవరి 4న ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. మొత్తానికి డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ జీవితం భారత వైద్య విజ్ఞానంలో ఒక ప్రేరణాత్మక అధ్యాయం. మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సను భారతదేశంలో సాధ్యంగా మార్చిన విజ్ఞానిగా, ఫీటల్ కిడ్నీ మార్పిడీ వంటి అత్యాధునిక ఆలోచనలకు బాటలు వేసిన శాస్త్రవేత్తగా ఆయన చేసిన కృషి తరతరాల వైద్యులకు మార్గదర్శకంగా నిలుస్తుంది. మానవ జీవితాన్ని కాపాడాలన్న సంకల్పం, శాస్త్రీయ దృష్టి, నైతిక బాధ్యత -- ఈ మూడు సమన్వయంతో ముందుకు సాగిన ఆయన ప్రయాణం భారత వైద్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ప్రింట్ కాని పుస్తకంపై రచ్చ.. రాహుల్ పరువు తీసిన కేంద్రం!



కాంగ్రెస్ అగ్రనేత, లోక్సభలో విపక్ష నాయకుడుగా కూడా ఉన్న రాహుల్గాంధీ తన తీరును మార్చుకోలేక పోతున్నారన్న వాదన వినిపిస్తోంది. గత కొన్నాళ్లుగా ఆయన గ్రాఫ్ పతనం అవుతోందే తప్ప.. ఎక్కడా పుంజుకోవడం కూడా లేదు. అయిన ప్పటికీ.. తన పంథాలో ఎక్కడా మార్పు దిశగా రాహుల్గాంధీ అడుగులు వేయలేక పోతున్నారు. తాజాగా పార్లమెటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. సోమవారం లోక్సభలో రాహుల్గాంధీ ప్రస్తావించిన కీలక విషయం.. ఆయనకే ఎదురు తిరిగింది. అంతేకాదు.. -పార్లమెంటు రూల్స్ ఏంటో తెలుసుకోండి సర్- అంటూ.. స్పీకర్ ఓం బిర్లా ఆయనను సునిశితంగా మందలించారు. భారత్-చైనా సరిహద్దులైన లద్ధాఖ్, డొక్లాంలలో 2020-22 మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయా విశేషాలను వెల్లడిస్తూ.. మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ నరవణే ఓ పుస్తకంలో పేర్కొన్నారు. అయితే.. ఈ పుస్తకం ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఎవరూ ప్రింటు కూడా చేయలేదు. ఈ విషయాన్ని తాజాగా రాహుల్గాంధీ లోక్సభలో ప్రశ్నించారు. చైనా విషయంలో భారత్ ఎక్కడో వీక్గా వ్యవహరిస్తోందని, దీనిపై అంతర్జాతీయ ప్రభావం ఉందని కూడా నోరు చేసుకున్నారు. వాస్తవానికి భారత్ నూతన విదేశాంగ విధానం అనుసరిస్తోంది. ఈ క్రమంలో కవ్వింపుల విషయంలో ఆచి తూచి అడుగులు వేస్తూ.. ప్రపంచ దేశాల ముందు.. ప్రత్యర్థి దేశాల పరువు తీస్తోంది. ఎంతో అవసరం అయితే తప్ప.. దాడులు చేయడం లేదు.ూశ్రీంశీ =ఝుం - లోక్ సభలో రచ్చ రేపిన మాజీ ఆర్మీ చీఫ్ పుస్తకం ఈ నేపథ్యంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ అగ్రనేతలు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి అమిత్ షాలు నిప్పులు చెరిగారు. పార్లమెంటులో పత్రికలు, పుస్తకాల ప్రస్తావన తీసుకురావడమే తప్పని వ్యాఖ్యానించారు. పోనీ.. ఒక వేళ తీసుకువచ్చినా.. సదరు పుస్తకం ప్రింట్ అయిందా? అని నిలదీశారు. కానీ, అది ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని అధికారు లు తెలిపారు. దీంతో రాహుల్ను వారిద్దరూ ఏకపక్షంగా ఏకేశారు. దీంతో సభలో సుమారు 40 నిమిషాలకుపైగా ఇరు పక్షాల మధ్య అరుపులు, కేకలు చోటు చేసుకున్నాయి. రాహుల్ వ్యవహార శైలిని బీజేపీ ఎంపీలు కూడా తప్పుబట్టారు. ూశ్రీంశీ =ఝుం - జెన్ జెడ్ ని ఫోర్ ఫ్రంట్ లో పెట్టిన జనసేనాని ఈ సమయంలో జోక్యం చేసుకున్న స్పీకర్ ఓం బిర్లా.. పార్లమెంటు రూల్స్ బుక్లో ఉన్న పాయింట్లను చదవి రాహుల్కు వినిపించారు. రూల్స్ తెలుసుకోవాలని.. ఆయనను సునిశితంగా మందలించారు. పార్లమెంటులో ప్రస్తావించే ఏ అంశం అయినా.. పత్రికలు, వీడియోలు, పుస్తకాలకు సంబంధించి ఉండరాదని.. ఆయన పేర్కొన్నారు. అయితే.. రాహుల్ తన వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. ఆయనకు మైక్ కట్ చేశారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. దీంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు. రాహుల్ వాదన ఏంటంటే.. నరవణే చేసిన వ్యాఖ్యలను(ప్రచురితం కాని పుస్తకంలో) ఓ మ్యాగజైన్ ప్రచురించిందని. కానీ, అది కూడా వెలుగు చూడలేదన్నది బీజేపీ మాట.

# 'ఆర్టిఫిషియల్ లెగ్స్' ను టేబుల్పై పెట్టి.. రాజ్యసభలో బీజేపీ ఎంపీ రచ్చ!

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాజ్యసభలో సోమవారం.. ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్రపతి ప్రసంగా నికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. అయితే.. ఈసమయంలో బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు, కేరళ రాష్ట్రా నికి చెందిన సదానందన్ మాస్టర్ అనూహ్య రీతిలో స్పందించారు. ఆయన దివ్యాంగుడు. గతంలో కేరళలో జరిగిన రాజకీ య ఘర్షణల్లో ఆయన రెండు కాళ్లూ కోల్పోయారు. ఈ పరిణామాలు తాజాగా రాజ్యసభలో చర్చకు వచ్చాయి. సీపీఎం నేత, రాజ్యస భ సభ్యుడు బిట్రాస్పై ఆయన తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. ఇది ఒకరకంగా రాజ్యసభలో రచ్చకు దారి తీసింది. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సమయంలో కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు బిట్రాస్ రాష్ట్రపతి ప్రసంగంలో పస లేదని.. పేదలు, కష్ట జీవులు, రైతులు, మహిళల గురించి ఎలాంటి ప్రకటన చేయ లేదని విమర్శించారు. ఈ సమయంలో స్పందించిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు.. దివ్యాంగుడు కూడా అయిన సదానంద మాస్టర్ .. తన రెండు కృత్రిమ కాళ్లను తీసి.. రాజ్యసభ చైర్మన్కు కనిపించేలా.. తన టేబుల్ ముందు భాగంపై పెట్టారు. దీంతో



రాజ్యసభలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఇలా చేయడం రాజ్యసభ నియమాలకు విరుద్ధం. బూట్లు.. చెప్పుల మాట ఎలా ఉన్నా..అసలు వ్యక్తిగత ఫోన్లు, కర్చీఫ్లు వంటి వాటిని కూడా టేబుళ్లపై పెట్టకూడదు. దీంతో ఒక్కసారిగా రాజ్యసభలో కలకలం రేగింది. సదానందపై చర్యలు తీసుకోవాలని..పాయింట్ ఆఫ్ ఆర్డర్ను సీపీఎం సభ్యుడు బిట్రాస్ లేవనెత్తారు. ఈ సమయంలో సదానంద స్పందిస్తూ.. తాను చేసిన చర్య..పార్లమెంటుకు విరుద్ధమని అంటున్న సీపీఎం సభ్యులు.. వారు చేస్తున్న వ్యాఖ్యలు దేశానికి, రాజ్యాంగానికి కూడా విరుద్ధమని చెప్పడానికే తాను ఇలా చేయాల్సి వచ్చింద న్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఆయన సూచించారు. జాతీయ ప్రయోజనాలు, దేశ భద్రత ఇప్పుడు అత్యంత కీలకమని.. అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ విష యాన్ని ప్రతిపక్షాలకు అర్థమయ్యేలా చెప్పాలనే తాను కృతిమ కాళ్లను తీసి టేబుల్పై పెట్టానన్నారు. ఈ సందర్భంగా 30 ఏళ్ల కిందట కేరళలో తనపై జరిగిన దాడిని సదానంద గుర్తు చేసుకున్నారు. ఆర్ ఎస్ ఎస్ కార్యకర్త అయిన.. సదానందను అప్పట్లో సీపీఎం కార్యకర్తలు అడ్డగించారు. ఆ సమయంలో ఇరు పక్షాల మధ్య ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో సదానంద కాళ్లపై బలంగాకొట్టడంతో ఆయన తన రెండు కాళ్లను కోల్పోయారు. అయినప్పటికీ.. సదానంద ఆర్ ఎస్ ఎస్, బీజేపీల కీలక నేతగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయనను రాజ్యసభకు పంపించారు.

# లోక్ సభలో రచ్చ రేపిన మాజీ ఆర్మీ చీఫ్ పుస్తకం

లోక్ సభలో రచ్చ రేపింది ఒక పుస్తకం. దానికి రాసిన వారు మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే. ఆయన ఇంకా ఆ పుస్తకాన్ని ఎక్కడా ప్రచురించలేదు కూడా. అయితే ఆ పుస్తకంలో కొన్ని అంశాల గురించి ఒక మాగజైన్ లో కథనంగా వచ్చిందని అంటున్నారు. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని అంశాలను ఆధారంగా చేసుకుని పార్లమెంట్ లో మాట్లాడారు, దాంతో సభలో తీవ్ర మైన గందరగోళం చెలరేగింది. సభ అనేక సార్లు వాయిదా పడి చివరికి సభా కార్యక్రమాలు సాగలేదు.

**ఇంతకీ ఏముంది అందులో :** ఇంతలా లోక్ సభలో ప్రకంపనలు పుట్టించిన మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలో ఏముంది అంటే రాహుల్ గాంధీ సభలో మాట్లాడుతూ తాను చేప్పబోయేది దేశ భద్రత గురించి అన్నారు. ఇది చాలా ప్రాధాన్యత కలిగిన అంశం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి రక్షణ మంది రాజ్ నాథ్ సింగ్ కి



ఎంతో ఇబ్బందిగా ఉన్నా తాను మాట్లాడి తీరుతాను అంటూ సభలో ఆ పుస్తకం లోని అంశాలను గురించి ప్రస్తావించారు. చైనా భారత్ లోని భూ భాగాలను ఆక్రమిస్తోంది అన్నది రాహుల్ ఆ పుస్తకం నుంచి తీసుకున్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం మీద చేసిన తీవ్రమైన ఆరోపణగా ఉంది. దాంతో అధికార పక్షం నుంచి ఒక్కసారిగా సభ్యులు లేవడం ఇటు విపక్షం రాహుల్ కి మద్దతు ఇవ్వడంతో సభలో గందరగోళమే సాగింది. చైనా దురాక్రమణ అంటూ : రాహుల్ గాంధీ చెప్పిన విషయం ప్రకారం చూస్తే సిక్కిం సమీపంలోని డోక్లామ్ ట్రై జంక్షన్ లో భారత భూభాగంలోకి నాలుగు చైనీస్ ట్యాంకులు ప్రవేశించి ఓ పర్వత శ్రేణిని ఆక్రమించుకున్నాయని ఉంది. ఈ మేరకు మాజీ ఆర్మీ చీఫ్ నరవణే ఇందులో వివరించారని ఆయన ఉటంకించారు. ఇది దేశ భద్రతను సవాల్ చేసే విషయం అని రాహుల్ గాంధీ అన్నారు. దీని మీద చర్చించాలని డిమాండ్ చేశారు. అయితే కేంద్ర హోం మంత్రి అమిత్ షా రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఇద్దరూ రాహుల్ ప్రసంగానికి అభ్యంతరం తెలిపారు. ప్రచురణ కూడా కానీ పుస్తకంలోని అంశాలను సభలో ప్రస్తావించడం నిబంధనలకు విరుద్ధం అని అమిత్ షా అన్నారు. అయితే ఇది జాతీయ భద్రతకు సంబంధించినది కాబట్టి తాను ఈ విషయాన్ని లేవనెత్తుతున్నానని రాహుల్ గాంధీ సమర్థించుకున్నారు.

**ఊహల సారాంశం అంటూ :** ఔయితే రాహుల్ గాంధీ చైనా ఆక్రమణల గురించి మాట్లాడినది పూర్తిగా ఊహాత్మక సారాంశమని రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ కొట్టి పారేశారు. వాస్తవంగా సరైనది కాదని అన్నరు. రాహుల్ ఈ విధంగా సభను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ దేశ సైన్యాన్ని అవమానించకూడదని అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. మొత్తం మీద చూస్తే ఒక మాజీ ఆర్మీ అధికారి పుస్తకం లోక్ సభలో అతి పెద్ద రభసకు కారణం అయింది. ఇంతకీ భారత్ భూ భాగంలో చైనా చొరబడిందా, ఆక్రమించిందా అన్న దానికి అధికార పక్షమే సరైన క్లారిటీ ఇవ్వాలని అంతా కోరుతున్నారు.

చురకలు

## సంపాదకీయం

# బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు..

# నిజమెంత?

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్.. తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీశాయి. త్వర లోనే బీఆర్ ఎస్ పార్టీలోకి భారీ ఎత్తున చేరికలు ఉంటాయన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ సహా బీజేపీ నుంచి కూడా పదుల సంఖ్యలో కీలక నాయకులు, వందల సంఖ్యలో కార్యకర్తలు.. వచ్చి బీఆర్ ఎస్ కండువా కప్పుకోనున్నారని ఆయన తాజాగా వ్యాఖ్యానించారు. అయితే.. దీనిలో నిజం ఎంత? అనేది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం ఉన్న పరిణామాలను గమనిస్తే.. బీఆర్ ఎస్ పార్టీ పరిస్థితి పైకి కనిపిస్తున్నంత ఆనందంగా ఏమీ లేదు. అంతర్గత వివాదాలు పార్టీని కుదిపేస్తున్నాయి. ఈ విషయాన్ని గత నెలలో ఖమ్మంలో పర్యటించిన మాజీ మంత్రి బీఆర్ ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్వయంగా చెప్పారు. "అంతర్గత కుమ్ములాటలతో మీరు పాడవడమే కాదు.. పార్టీని కూడా పాడుచేస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి ఒక్క ఖమ్మంలోనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. ప్రధానంగా గత ఎన్నికల్లో టికెట్లు రాని వారు.. ఓడిన వారు కూడా.. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇక, సొంత కుమార్తె కవిత పార్టీపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పైగా ఆ పార్టీ నేతలపైనే తీవ్ర విమర్శలతో విరుచుకుపడుతున్నారు. మరోవైపు సొంత నేతలు కూడా.. ఎంత అభిమానం ఉన్నా.. సొంత ఖర్చులతో పార్టీని ముందుకు నడిపించలేమని చెబుతున్నారు. మరి ఇంతగా పార్టీ పరిస్థితి ఉంటే.. ఇతర పార్టీల నుంచి నాయకులు ఎలా వస్తారన్నది ప్రశ్న. ఇక, కాంగ్రెస్, బీజేపీల నుంచి వచ్చేందుకు కీలక నాయకులు ఎవరూ సిద్ధంగా లేదు. ఏదైనా ఉంటే.. బీఆర్ ఎస్ నుంచే నాయకులు బయటకు వచ్చేందుకు చూస్తున్నారు. అయితే.. ప్రస్తుతం ఈ విషయాలు కేసీఆర్‌కు తెలియని కాదు. కానీ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ఆయన వ్యూహాత్మకంగా ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు ఇప్పుడే ప్రధాన ఎన్నికలు కూడా లేవని.. అలాంటప్పుడు నాయకులు ఎందుకు పార్టీ మారుతారని కూడా ప్రశ్నిస్తున్నారు.

# తెలంగాణ గర్వించ దగిన గొప్ప గాత్ర సంగీత విద్వాంసుడు చౌటి భాస్కర్ - ఫిబ్రవరి 4...చౌటి భాస్కర్ వర్ధంతి



చౌటి భాస్కర్ (1939, ఆగస్టు 10 -- 1990, ఫిబ్రవరి 4) తెలంగాణకు చెందిన ఒక ప్రముఖ గాత్ర సంగీత విద్వాంసులు. సంగీతంలో ఆయన చేసిన కృషి, పొందిన బిరుదులు, ఆయన సంగీత ప్రస్థానం తెలుగువారి హృదయాల్లో ఆయనను చిరస్థాయిగా నిలబెట్టాయి. సంగీత ప్రపంచంలో ఆయన పొందిన గౌరవాలు, చేసిన సేవలు తెలంగాణ సంగీత చరిత్రలో ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచాయి. చౌటి భాస్కర్ 1939 ఆగస్టు 10న తెలంగాణ రాష్ట్రం, రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో జన్మించారు. బాల్య కాలం నుంచే సంగీతం మీద ఉన్న ఆసక్తితో చిన్న వయస్సులోనే సంగీత శిక్షణ ప్రారంభించారు. ప్రాథమిక సంగీత శిక్షణను రాగుల లక్ష్మీరాజయ్య పంతుల వద్ద పొందారు. భాస్కర్ ప్రతిభను గుర్తించిన వేములవాడ రాజన్న దేవస్థానం, ఆయనకు ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ సహాయంతో 1961లో మద్రాసులోని సెంట్రల్ మ్యూజిక్ కాలేజీలో ఆయన సంగీతంలో ఉన్నత శిక్షణ పొందారు. ఆయన కర్ణాటక సంగీతంలో ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్, డాక్టర్ డి.కె. పట్టమ్మాళ్ వంటి ప్రముఖుల వద్ద శిక్షణ పొందారు. అంతేకాకుండా, భాస్కర్ బి.ఎ. ఇంగ్లీష్ డిగ్రీను కూడా పూర్తిచేశారు. చౌటి భాస్కర్ సంగీత ప్రస్థానం మూడు దశాబ్దాల పాటు కొనసాగింది. ఆయన తన సంగీత ప్రయాణంలో 550కి పైగా గాత్ర సంగీత కచేరీలు నిర్వహించారు. ఆల్ ఇండియా రేడియోలో గ్రేడ్ ఏ-1 కళాకారుడిగా పనిచేశారు. దూరదర్శన్ లో కూడా అనేక కచేరీల్లో పాటలు అందించారు. భక్తి సంగీతంలో ప్రత్యేక కీర్తి సంపాదించిన భాస్కర్ గారు స్వయంగా ఎన్నో కృతులు రచించి పాడారు. ప్రతి ఏడాది వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించే త్యాగరాజ ఉత్సవాలు భాస్కర్ గాత్ర కచేరీలతోనే ప్రారంభమయ్యేవి. ఈ కార్యక్రమాలు ఆయన సంగీత నైపుణ్యానికి చిహ్నంగా నిలిచాయి. చిత్రలేఖనంలో ప్రావీణ్యమున్న భాస్కర్ తొలినాళ్లలో డ్రాయింగ్ టీచర్ గా వికారాబాదులో పనిచేశారు. కానీ సంగీతంపై ఉన్న మక్కువతో, సంగీత అధ్యాపకుడిగా మారారు. 1969 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని శ్రీ భక్త రామదాసు సంగీత కళాశాలలో గాత్ర సంగీత అధ్యాపకుడిగా అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. చౌటి భాస్కర్ గారు సంగీతంలో చేసిన విశేష కృషికి అనేక పురస్కారాలు అందుకున్నారు. సంగీత విద్వాన్, గాన గంధర్వ, అనేక జాతీయ స్థాయి గౌరవాలు పొందారు. భాస్కర్... సులోచనతో వివాహం చేసుకోగా, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు చౌటి రఘునందన్ తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖలో ఫీల్డ్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. 1990, ఫిబ్రవరి 4న హైదరాబాదులో జరిగిన రోడ్డు ప్రమాదంలో భాస్కర్ మరణించారు. కానీ ఆయన సంగీత సేవలు మాత్రం మరణం పొందలేదు. భాస్కర్ స్మృతిని చెలరేగించేందుకు, ఆయన పేరు మీద ఒక సంగీత కళాశాల స్థాపించబడింది. ఈ కళాశాలలో అనేక మంది విద్యార్థులు సంగీత విద్యను అభ్యసిస్తున్నారు. చౌటి భాస్కర్ తెలంగాణ సాంస్కృతిక ప్రపంచానికి చేసిన సేవలు అమూల్యమైనవి. ఆయన గాత్ర సంగీత నైపుణ్యం, భక్తి సంగీతం, జానపద గీతాలపై చూపిన ఆసక్తి ఆయనను ప్రజల హృదయాల్లో నిలబెట్టాయి.

తెలంగాణ సంగీత చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. చౌటి భాస్కర్ సంగీతం ద్వారా ప్రేరణ నిచ్చిన ప్రతి ఒక్కరికీ, ఆయన జీవితం స్ఫూర్తిదాయకం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మగ్దూం మొహియుద్దీన్ - ఫిబ్రవరి 4...మగ్దూం మొహియుద్దీన్ జయంతి





హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచమంతా గర్వించేలా, గౌరవించేలా తన గళం (ఉపన్యాసం) తోనూ, కలం తోనూ ప్రచారం చేసిన గొప్ప వ్యక్తి మగ్దూం మొహియుద్దీన్. భారత దేశంలో వచ్చిన ప్రగతి శీల రచయితల ఉద్యమానికి హైదరాబాద్‌లో జీవం పోసింది మఖ్దుమే. నాలుగు దశాబ్దాలకు పైగా కమ్యూనిస్టు ఉద్యమాలకు, సాహిత్య సృజనకు తన జీవితాన్ని అంకితమిచ్చాడు. మొక్కవోని ధైర్యంతో కులమతాల కతీతంగా పేదల పక్షాన నిలిచి వారి అభ్యున్నతికి ఆయన కృషి చేశాడు. మగ్దూం మొహియుద్దీన్ ప్రముఖ అధ్యాపకుడు, ఉర్దూ కవి. 'షాయరే ఇంక్విలాయ్' (ఉద్యమ కవి, విప్లవ రచయిత) బిరుదాంకితుడు. కవియేగాక నాటక కర్త, గాయకుడు, నటుడు కూడా. ఇతని గజల్ లు, పాఠ్యాంశాల లోను, సినిమాల లోనూ ఉపయోగించాడు. ఆయన రాసిన 'ఏ జంగ్ హై జంగే ఆజాదీ' 'ఎక్ చంబేలీకె మండ్వే తలే' అనే గీతాలు ప్రసిద్ధి పొందాయి. ఉర్దూ మహా కవిగా ప్రపంచాన్ని ఉర్రూతలూగించాడు. మగ్దూం మొహియుద్దీన్ తెలంగాణ లోని మెదక్ జిల్లా ఆందోల్లో 1908, ఫిబ్రవరి 4 న జన్మించాడు. ఆయన పూర్తిపేరు అబూ సయీద్ మహ్మద్ మఖ్దూమ్ మొహియొద్దీన్ ఖాద్రి. అయన పూర్వీకులు ఉత్తర ప్రదేశ్ లోని ఆజంగఢ్‌లో ఉండేవాడు. ఆయన తాత (తల్లితండ్రి) రషీదుద్దీన్ ఔరంగజేబు సైన్యాలతో పాటు దక్కన్ పీఠభూమికి వచ్చాడు. అలాగే, మరో తాత (తంవూడికి తండ్రి) సయ్యద్ జాఫర్ అలీ కూడా ఉత్తర ప్రదేశ్ షాజహానాబాద్ నుండి 1857లోనే దక్షిణానికి వచ్చాడు.ఆ కుంటుంబ మంతా హైద్రాబాద్ దక్కన్ పరిసరాలకు చేరింది. ఆయన తండ్రి గౌస్ మొహియొద్దీన్ నిజాము ప్రభుత్వంలో సూపరింటెండెంటుగా పని చేసేవాడు. బతకడానికి పెయింటింగ్స్, సినిమా తారల ఫొటోలు అమ్మాడు. ట్యూషన్లు చెప్పాడు, పత్రికల్లో పనిచేశాడు. ఆయన రాసిన 'గోథే ప్రేమ లేఖలు' 'మక్తబా' అనే స్థానిక ఉర్దూ పత్రిక అచ్చు వేసింది. నాగపూర్ కామ్రేడ్ల సహాయంతో 1930-40లలో హైద్రాబాద్‌లో 'స్టూడెంట్స్ యూనియన్' ప్రారంభించాడు. 1940లో తన సహచరులతో కలిసి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. చంద్ర రాజేశ్వర రావు, గులాం హైదర్, రాజ బహుదూర్ గౌర్, హమీదలీ ఖాద్రీ లాంటి నాయకులతో కలిసి పని చేస్తుండేవాడు. అక్తర్ హుస్సేన్ రాయ్‌పురి, సిబ్తె హసన్‌లతో కలిసి హైద్రాబాద్‌లో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపించాడు. సరోజినీ నాయుడు నివాసమైన గోల్డెన్ త్రెషోల్డ్లో డాక్టర్ జయసూర్య, జె.వి.నరసింగరావు లతో కలిసి సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు జరుపుతుండే వాడు. చార్మినార్ సిగట్ ఫ్యాక్టరీ, బట్టల గిర్నీ, అల్విన్, షాబాద్ సిమెంట్, ఎన్ ఎస్సార్ రైల్వే ఎంప్లాయిస్, ఎలక్ట్రిసిటీ, సి.డబ్ల్యు.డి. మున్సిపాలిటీ, బటన్ ఫ్యాక్టరీ వంటి వందల కంపెనీల్లోని కార్మిక సంఘాలకు మఖ్దూమ్ అధ్యక్షుడయ్యాడు. అహో రాత్రులు వారి సంక్షేమం కోసం కృషి చేశాడు. స్టేట్ అసెంబ్లీలో మాట్లాడినా, బయట కార్మిక సంఘాలలో మాట్లాడినా ఆయన వాగ్ధాటికి ఎదురుండేది కాదు. విషయం సూటిగా, స్పష్టంగా, దృఢంగా, బలంగా చెప్పేవాడు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో మెదక్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. శాసన మండలికి ఎన్నికై 1969లో కన్నుమూసే దాకా కమ్యూనిస్టు నేతగా ఆ పదవిలో కొనసాగాడు. మఖ్దూం కార్మిక నాయకుడు, శాసన మండలి సభ్యుడు. ఫాసిజానికి వ్యతిరేకంగా సమసమాజ స్థాపనకోసం క్రియాశీలంగా రాజకీయాల్లో పాల్గొన్నాడు. ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్నంకితం చేసి అమరుడైనాడు. కమ్యూనిస్టు అయిన మఖ్దూం మతాన్ని దూషించ లేదు, అనుసరించ లేదు. హైద్రాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ శాఖకు తొలి కార్యదర్శి. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రపంచ ప్రసిద్ధ తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్రధారి. సాయుధ పోరాటానికి ముందు కారాగార శిక్షలు, పోరాటం తర్వాత అజ్ఞాత వాసం. హైద్రాబాద్ రాష్ట్ర శాసన సభ్యుడు (1952) శాసన మండలి సభ్యుడు, ప్రతిపక్ష నేత (1956-1969), భారత కార్మిక వర్గ విప్లవ చరివూతలో ముఖ్య పాత్రధారి. ఎఐటియుసికి జాయింట్ సెక్రటరీ. నిజాముకు వ్యతిరేకంగా తెలంగాణా సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ సమాఖ్య (ఎ.ఐ.టి.యు.సి.) జాయింట్ సెక్రటరీగా కొంత కాలం ఢిల్లీలో ఉన్నాడు. 1952-55 మధ్య చైనా, సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలు, ఆఫ్రికన్ దేశాలు తిరిగి వచ్చాడు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయం వియాన్నాలో (1953-54) పనిచేశాడు. 1969, ఆగష్టు 25 తేదీన గుండె పోటుతో ఢిల్లీలో చనిపోయాడు. ఆయన పేరిట హైద్రాబాద్, హిమాయత్ నగర్‌లో సి.పి.ఐ. రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్ నిర్మించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# క్యాన్సర్ గురించి అవగాహన అవసరం - ఫిబ్రవరి 4...ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం




కాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ఫిబ్రవరి 4 న ప్రపంచ క్యాన్సర్ రోజుగా గుర్తిస్తారు. 'ఇంటర్నేషనల్ యూనియన్ ఎగెనెస్ట్ క్యాన్సర్ సంస్థ ప్రతి ఏటా ఫిబ్రవరి 4న క్యాన్సర్ దినోత్సవంగా జరిపి ప్రజలలోకి క్యాన్సర్ అవగాహనను తీసుకెళ్లేందుకు కృషి ప్రారంభించారు. ఆ సంస్థలో మొత్తం 100 దేశాలు, క్యాన్సర్ వ్యాధి మీద యుద్ధం చేస్తున్న 350 సంస్థలు సభ్యత్వం కలిగి ఉన్నాయి. వీరందరూ మీడియా ద్వారా క్యాన్సర్ వ్యాధి ప్రమాదాన్ని ప్రచారం చేయాలని పాలనా విధానాలలో క్యాన్సర్ వ్యతిరేక చర్యలు చేపట్టేల ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవటం కూడా వారు చేస్తున్న పని. 2006 నుండి ఫిబ్రవరి 4న క్యాన్సర్ డే గా జరుపుతూ తగిన చర్యలు చేపట్టారు. అసలు క్యాన్సర్ అంటే ఏమిటి సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో నియంత్రించ బడతాయి. కొన్ని సందర్భాలలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేనందువల్ల కణాలు చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఈ కణ సమూహాలను'కంతి' ( టూమర్,¯బఎశీతీ) అంటారు. అటువంటి కొన్ని ప్రమాదకరమైన వాటిని కేన్సర్ అని వ్యవహరిస్తారు. ఈ రకమైన పెరుగుదలకు ఒక స్పష్టమైన విధి ఉండదు. కేన్సర్ గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'ఆంకాలజీ' (ాఅఎశీశ్రీశీస్త్రఎ) అంటారు. క్యాన్సర్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యాధి. క్యాన్సర్ మహమ్మారి ఏటా రూ.41, 17,000 కోట్లు హరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడింట రెండొంతుల క్యాన్సర్ మరణాలు పేద, మధ్యతరగతి దేశాల్లోనే సంభవిస్తున్నాయి. అందులో ఎక్కువ భాగం ముందుగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయంచేయొచ్చని డబ్ల్యూహెచ్చ(ఔనూ) వెల్లడించింది. క్యాన్సర్ అనేది ఏ వయస్సు వారి కైనా రావచ్చును. ఆడవారికి మగవారికి కూడ రావచ్చును. శరీరములో నోరు, గొంతు, ఎముకలు, రొమ్ము, చర్మము మున్నగు ఏ భాగానికి అయినా రావచ్చును. శరీరంలో ఏదైనా అవయవానికి కేన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసు కోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. అలాగే వంశపారం పర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యు పరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ క్యాన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించక పోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కొవాలి. కేన్సర్‌కు కారణాల్లో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. మద్యం, పొగతాగడం, ఆహార పదార్థాల్లో రంగుల వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాద వశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్‌కు కారకాలు. కొన్ని రకాల కేన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం హెచ్‌పీవీ వైరస్. కాబట్టి దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించ వచ్చు. 9 ఏళ్లు పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకు ఈ వ్యాక్సిన్ వేయించు కోవచ్చు. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుంది. క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం, దానికి ఇతర అవయవాలకు విస్తరించే గుణం ఉందా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా దీనిపైనే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్‌ను జయించడం, త్వరగా గుర్తించడంతో పాటు ఆ కణితులు పరిమాణం, దశ, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం. కాన్సర్‌కు వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారూ దీని బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లను చాలా వరకు పూర్తిగా నయం చేయ గలిగినవే. అయితే, వయస్సు పెరిగేకొద్దీ కేన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. ఈ సమయంలో వచ్చే కేన్సర్ల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే కేన్సర్ చికిత్సను కూడా వయస్సును బట్టి నిర్ధరిస్తారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమోథెరఫీ, రేడియో థెరఫీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్ థెరఫీ లాంటివి చేసినా, లేక థెరఫీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయి పోయిందని భావించరాదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసు కోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్‌ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్-రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు. ప్రభుత్వాలు చర్యలలో భాగంగా పొగాకు వాడకంపై యుద్ధం ప్రకటించడం, సిగరెట్ తయారీ కంపెనీలు వ్యాపార ప్రకటనలు ఇవ్వటాన్ని నిషేధించాయి. అదే విధంగా బీడీ కట్టల మీద పుర్రె గుర్తు ముద్రణతో క్యాన్సర్ భయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్ళ గలిగారు. మత్తు పానీయ ప్రకటనల మీద నిషేధం తీసుకు వచ్చారు. మన దేశంలో నోటి క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవటానికి కారణం గుట్కా వాడకమే. భారత దేశంలో 80 శాతం మందికి క్యాన్సర్ ముందుగా గుర్తు పట్టలేక పోతున్నారు. క్యాన్సర్ పై అవగాహన పెరగాలి. లేటు వయస్సు వారికి ఎక్కువగా క్యాన్సర్ వస్తున్నది. నేడు లైఫ్ స్టైల్ మారింది. పొగాకు సంబంధిత వస్తువులు వాడటం వల్ల 40శాతం మందికి క్యాన్సర్ వస్తున్నదని తెలుస్తున్నది. చికిత్సకు సంబంధించి నిర్ణయాలు మూడు విషయాలపై ఆధారపడి వుంటాయి. శరీర సాధారణ స్థితి, ఇతర జబ్బులు, కాన్సరు దశ, రోగి కోరిక, సమ్మతి. తొలిదశలో వున్న కాన్సర్లలో 70 నుంచి 90 శాతం కేసుల్లో నయం అయ్యే అవకాశం వుంది. కాన్సరు చికిత్సలో 19వ శతాబ్దం చివరిదశలో కాన్సరుకు శస్త్ర చికిత్స ప్రారంభమైంది. అయితే కాన్సరుకు శస్త్ర చికిత్స రానురాను వయస్సు పెరిగిన కొద్దీ తగ్గిపోతున్నది. రేడియేషన్ చికిత్స ఎక్స్రేను కనుగొన్న 1895 నుండి జరుప బడుతున్నది. వృద్ధుల్లో కాన్సరు జబ్బుకు రేడియేషన్ చికిత్సను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కాన్సరుకు మందులతో చికిత్స 1950 నుండి ప్రారంభమైంది. వృద్ధుల్లో కాన్సరు చికిత్సకు మందులను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. క్యాన్సర్ కష్ట నష్టాల గురించి ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలి , కాన్సర్ వ్యాధిని నయం చేయడానికి శస్త్ర చికిత్స, రేడియేషన్, కీమోథెరపీ అవసరం. ఆరోగ్యపు అలవాట్లను, ఆహారపు అలవాట్లను 30 నుంచి 40 ఏళ్ల వయస్సు నుంచే ప్రారంభించాలి. తొలిదశలోనే కాన్సరును గుర్తించి చికిత్స పొందాలి. ధూమపానం, సురాపానం, గుట్కా, జర్దాకిల్లీలు మానాలి. పండ్లు, కూరగాయలు పీచు పదార్థం ఎక్కువగానూ, కొవ్వు తక్కువగానూ వుండే ఆహారాన్ని తీసుకోవాలి. కాన్సరు బారినుండి శరీరాన్ని రక్షించు కోవాలి. దీనికి స్క్రీనింగ్ పరీక్షలు జరపాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# అనుభవ'సారం'.. 'ఫల'సాయం

నల్గొండ :చిన్నప్పటి నుంచి సాగులో మమేకం అయ్యారు. మలి సంధ్యలో అదే మక్కువతో ఆధునిక విధానంలో పలు రకాల పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు వీరు.. తమ అనుభవంతో మంచి ఫలసాయం పొందుతూ కుటుంబాలకు ఆదరువు అవుతున్నారు.
ఆరుపదుల్లోనూ నవసేద్యం ఆరుపదుల వయస్సు అయినా ఆరు గుంటల భూమిలో తొమ్మిది రకాల పంటలను సేంద్రియ విధానంలో పండిస్తూ ఔరా అన్పిస్తున్నారు మండలంలోని దూపహాడ్‌కు చెందిన మాతంగి పెద్దవెంకన్న. కాలిఫ్లవర్, కాకర, బీర, గోకరకాయ, టమాట, వంగ, పచ్చిమిరప, పాలకూర, తోటకూర, చుక్కకూర పంటలు, బంతి పూలు ఉన్నాయి. ప్రతీ సీజన్‌లో రూ.30 వేల పెట్టుబడితో రూ.85 వేలు, బంతిపూలతో మరో రూ.25 వేలు సంపాదిస్తున్నారు.
నాణ్యమైన తాజా కాయగూరలను గ్రామస్థులు తోటవద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెటింగ్ వ్యయప్రయాసలు తప్పాయి. గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తల సలహాలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**వృద్ధాప్యంలో సిరుల విరులు**

నూతనకల్‌కు చెందిన యాస నర్సిరెడ్డికి గతంలో వ్యవసాయం చేసిన అనుభవం ఉంది. వృద్ధాప్యం రావడంతో నూతనకల్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా మూతపడిన పెట్రోల్‌బంక్ స్థలంలో కుమారులు సహకారం



తో పదిగుంటల భూమిని కౌలుకు తీసుకున్నారు. మంచానికే పరిమితమైన భార్యకు సపర్యలు చేస్తూనే ఆ భూమిలో కనకాంబరాలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఐదు నెలల కిందట నాటిన మొక్కలు ప్రస్తుతం పువ్వులు పూస్తుండటంతో వృద్ధదంపతుల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. వంద పువ్వులకు రూ.10 చొప్పున అమ్ముతున్నారు.

**ఎకరంలో ఏడు లక్షల ఆదాయం**

రావులపల్లి ఎక్స్‌రోడ్డుతండాకు చెందిన గుగులోత్ హేమ తనకున్న భూమిలో రెండు దశాబ్దాలుగా కాయగూరలను సాగుచేస్తున్నారు. తొలుత ఎకరంలో బీర సాగు చేయగా మూడు నెల్లోనే రూ.7 లక్షల ఆదాయం వచ్చింది. అన్ని ఖర్చులకు రూ.3 లక్షలు పోగా రూ.4 లక్షలు మిగిలాయి. దీంతో పదెకరాలు కౌలుకు తీసుకున్నారు. బీర, మిరప రెండెకరాల చొప్పున, మక్క, టమాట, కందగడ్డ ఎకరం చొప్పున సాగుచేస్తున్నాను. అన్నీ అనుకూలిస్తే ఖచ్చితంగా రూ.20 లక్షల ఆదాయం పొందుతానంటున్నారు.

# విక్రయ కష్టాలు.. గిట్టుబాటు దిగులు

జగిత్యాల : వివిధ రకాల పంటల సాగులో ముందుంటున్న ఉమ్మడి జిల్లా రైతులను పంట ఉత్పత్తుల విక్రయ సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో పరిమితంగా సేకరించడం, మార్కెట్ జోక్య పథకాన్ని అమలు చేయకపోవడం, రైతుబంధు పథకం కింద ఉత్పత్తుల నిల్వ అటకెక్కడం తదితర కారణాలతో మద్దతు ధరలు అందని ద్రాక్షగానే మారాయి.

**మార్క్‌ఫెడ్ సేకరిస్తేనే మేలు**

యాసంగిలో 82 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400గా ఉంది. మార్కెట్‌లో ధరలు తగ్గినపుడు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి.
33 వేల ఎకరాల్లో పసుపు సాగు చేయగా క్వింటాలుకు రూ.12 వేలలోపే ఉంది. గతంలో మాదిరిగా మార్క్‌ఫెడ్ ద్వారా కనీసం రూ.15 వేలు లేదా రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.
18 వేల ఎకరాల్లో కంది సాగు చేయగా మద్దతు ధర రూ.8 వేల వరకుండగా మార్కెట్లో ఇంతకన్నా చాలా తక్కువ ధరలున్నాయి. మార్క్‌ఫెడ్ సేకరణ ప్రారంభించి కొర్రీలు పెట్టకుండా కొనుగోలు



చేయాలి.

**సమస్యలు పరిష్కరిస్తేనే ధాన్యం సిరులు**

ఎఫ్‌సీఐ సూచన మేరకు పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో దొడ్డు ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా మూడు సీజన్లుగా సన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వం సేకరిస్తోంది. ఉమ్మడి జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లలో 18 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ధాన్యం సేకరణలో జాప్యం, తరుగు, కోతలు, బోనస్ చెల్లింపులో జాప్యం తదితర సమస్యలు రైతులను వేధిస్తున్నాయి. దీంతో చాలా మంది ధర తక్కువైనా ప్రైవేటులో విక్రయిస్తున్నారు. రానున్న సీజన్లలో సన్న వరినే సాగు చేయాలంటూ ప్రభుత్వం పేర్కొంటున్న తరుణంలో ధాన్యం సేకరణ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి.

**మధ్యవర్తులకే తెల్ల'బంగారం'**

గత వానాకాలంలో నాలుగు జిల్లాల్లో 1.89 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఎకరాకు 7–15 క్వింటాళ్ల దిగుబడి ఉంది. కపాస్ యాప్‌లో నమోదు, సీసీఐ కొనుగోళ్లలో జాప్యం, కొర్రీలు, తక్కువ కేంద్రాల సమస్యలతో గ్రామాల్లో మధ్యవర్తులకు విక్రయిస్తున్నారు.

**మామిడి రైతుకు నష్టాల దిగుబడి**

75 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించగా వ్యాపారుల గుత్తాధిపత్యం, తరుగు, కోతలు, క్యాష్ కటింగ్, బహిరంగ వేలం లేకపోవడంతో రైతులు, తోటల గుత్తేదారులు నష్టపోతున్నారు. అపెడా, ఉద్యాన శాఖ, మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు మామిడి కాయలు కొనుగోలు చేసి దేశవిదేశాలకు ఎగుమతి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# పుష్కర గోదావరికి.. ప్రగతి హారం వేద్దాం



గోదావరిఖని : గోదావరి పుష్కరాలకు ఏడాదిన్నర సమయం ఉంది.. 2015 పుష్కరాల సమయంలో భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో గోదావరి నది 150 కిలోమీటర్లకుపైగా ప్రవహిస్తుంది. ఈ పరిధిలో అప్పుడు 14 ఘాట్లు ఏర్పాటు చేశారు.. లక్షలాది భక్తులు తరలి రావడంతో పలు ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. నాడు ఎదురైన ఇబ్బందులకు అనుగుణంగా అధికారులు ప్రణాళిక రూపొందించి పనులు చేపడితేనే వచ్చే పుష్కరాల్లో ఇబ్బందులు తప్పనున్నాయి.

**రహదారుల విస్తరణ**

ధర్మపురి, కోటిలింగాల, మంథని, సుందిళ్ల పుష్కర ఘాట్‌లకు భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారు. గత పుష్కరాల సమయంలో ఈ ప్రాంతాల్లో రద్దీతో భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఈసారి ఆ ఇబ్బందులు తలెత్తకుండా రహదారి విస్తరణ పనులు చేపట్టడంతోపాటు వాహనాల పార్కింగ్ విశాలమైన ప్రాంతాలను గుర్తించాల్సిన అవసరముంది.. ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపర్చితే ప్రైవేటు వాహనాల రద్దీ తగ్గే అవకాశం ఉంటుంది.

**3 కోట్ల మంది భక్తుల అంచనా**

గత పుష్కరాల సమయంలో 2 కోట్ల మంది భక్తులు పుష్కర స్నానాలకు హాజరయ్యారు. ఈసారి 3 కోట్ల మందికిపైనే భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి అన్ని శాఖల పనులకు రూ.100 కోట్ల అంచనాలు రూపొందించారు. కానీ దీనికి రెండింతల నిధులు వెచ్చించి పనులు చేపడితేనే భక్తులు ఇబ్బంది లేకుండా పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉంటుంది.

**ప్రక్షాళన తప్పనిసరి**

పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు నదీజలాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని గోదావరి నదిలో రోజుకు 80 మిలియన్ లీటర్ల మురుగు, 10 మిలియన్ లీటర్ల పరిశ్రమల వ్యర్థాలు కలుస్తున్నాయి. మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల ద్వారా సమస్య నివారించొచ్చు. ప్రస్తుతం ధర్మపురిలో రూ.17 కోట్లతో ఎస్టీపీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రామగుండం ప్రాంతంలో సింగరేణి ద్వారా రూ.19 కోట్లతో 17 ఎంఎల్‌డీ ప్లాంట్ నిర్మాణం పూర్తి కావస్తోంది. రామగుండం నగరపాలక సంస్థ ద్వారా రూ.86 కోట్లతో 25 ఎంఎల్‌డీ మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నా ఇంకా పనులు మొదలు కాలేదు. మంథనిలో బొక్కలవాగు ద్వారా గోదావరి నదిలో కలుస్తున్న వ్యర్థాల శుద్ధికి ఎస్టీపీ నిర్మాణం తప్పనిసరి. ఈ పనులు ఏడాదిలోగా పూర్తి చేస్తే భక్తులకు నదిలో పవిత్ర జలాలను అందించినట్లవుతుంది.

**ఆలయాలకు కొత్త శోభ తెచ్చేలా..**గోదావరి తీరం వెంట ఉన్న పురాతన ఆలయాల్లో సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది. రోజూ లక్షలాది భక్తులు వచ్చే అవకాశమున్న నేపథ్యంలో దర్శనానికి ఇబ్బంది లేకుండా ప్రణాళికాబద్ధంగా ఇప్పటి నుంచే పనులు మొదలు పెట్టాలి. పుష్కర ఘాట్లకు సమీపంలో మల్లాపూర్ మండలం వాల్గొండ వద్ద సోమేశ్వరాలయం, ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, కోటిలింగాల శివాలయం, గోదావరిఖని సమీప జనగామ త్రిలింగేశ్వరాలయం, సుందిళ్ల లక్ష్మీనరసింహాస్వామి ఆలయం, గుంజపడగ కాసిపేట గ్రామ సమీపంలో శివాలయం, ఆంజనేయస్వామి ఆలయం, మంథని గౌతమేశ్వరాలయం, ఆంజనేయస్వామి, రామాలయం, సరస్వతి ఆలయాలు ఉన్నాయి.

# పర్యావరణ హితం.. రుగ్మతలకు దూరం




మల్యాల: ధ్యానంతో మానసిక, శారీరక రుగ్మతలు దూరం చేసుకోవచ్చని చెబుతున్నారా యువకుడు. శాకాహారం అలవాటు చేసుకొంటే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రచారం చేస్తున్నారు. మల్యాల మండలం మద్దుట్ల గ్రామానికి చెందిన చిట్టెం సుధాకర్ ఫ్రాన్స్‌లో 'ఫుడ్ అండ్ బేవరేజ్ మేనేజ్‌మెంట్' కోర్సులో ఎమ్మెస్సీ చదివారు. ప్రస్తుతం మిత్రుడితో కలిసి అక్కడే శాకాహార రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు.

**రూ.5 లక్షలతో పిరమిడ్ కేంద్రం**

ధ్యానం అలవాటు చేసుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా చురుకుదనం పొందవచ్చని సుధాకర్ ప్రచారం చేస్తుంటారు.
జంతు వధ మానేసి శాకాహారులుగా మారితే ఆరోగ్యంగా ఉండటంతో పాటు పర్యావరణానికి మేలు చేసిన వారవుతారని బోధిస్తుంటారు.
తాను నిత్యం ధ్యానం చేయడంతో పాటు ఇతరులు పాటించేలా ఆన్‌లైన్ ద్వారా వారానికి నాలుగు రోజులు గంట పాటు అన్ని వర్గాల వారికి ధ్యానం, శాకాహార ప్రాముఖ్యంపై వివరిస్తున్నారు.
మద్దుట్లలోని ఇంటి పక్కన రూ.5 లక్షలు వెచ్చించి 'మెర్కాబా పిరమిడ్' ధ్యాన కేంద్రాన్ని నిర్మించి 20 మంది వరకు ధ్యానం చేసుకునే అవకాశం కల్పించారు.

**నాలుగు దేశాల్లో అధ్యయనం**

'పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్' ఆధ్వర్యంలో దేశంలో వేల సంఖ్యలోని పిరమిడ్ కేంద్రాల్లో మహిళలు, పురుషులు ధ్యానం చేస్తూ ఆరోగ్యవంతమైన ఫలితాలు పొందుతున్నారు. ఇప్పటివరకు నెదర్లాండ్, జర్మనీ, బోస్నియా, ఈజిప్టు దేశాల్లో పర్యటించి పిరమిడ్ ధ్యాన కేంద్రాలపై అధ్యయనం చేశా. 'ధ్యాన జగత్' పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ దాదాపు 20 వేల మందికి ధ్యానం, శాకాహారంపై అవగాహన కల్పిస్తున్నా. నేను ఫ్రాన్స్ వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులు మద్దుట్ల ధ్యాన కేంద్రం నిర్వహణ బాధ్యతలు చూస్తారు. ప్రతి పౌర్ణమి రోజు ధ్యానం చేయడానికి వస్తున్న వారికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నాం. –చిట్టెం సుధాకర్, ధ్యాన కేంద్రం నిర్వాహకుడు

# క్యా'రేటు'.. కాలేదు గిట్టుబాటు!



మల్యాల: క్యారెట్ పండిస్తున్న అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. విపణిలో సరైన ధర లేకపోవడంతో నష్టాల పాలవుతున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో అన్ని రకాల కూరగాయలు పండిస్తుంటారు. మండలంలోని కేశవపల్లితోపాటు పలు గ్రామాల్లో క్యారెట్ పంటను సింహభాగం సాగు చేస్తున్నారు.
జిల్లాలో 1930 ఎకరాల్లో..జిల్లాలో వానాకాలం చివరి దశలో సుమారు 1,930 ఎకరాల్లో 1,564 మంది అన్నదాతలు క్యారెట్ పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. దాన్ని తీసి యంత్రాల ద్వారా శుభ్రపర్చి ఎక్కువ శాతం జంట నగరాల్లోని హోల్‌సేల్ మార్కెట్లకు తరలించి అమ్ముతుంటారు. క్యారెట్ సాగుకు కేశవపల్లి చిరునామాగా నిలుస్తోంది. గ్రామంలో ప్రతి కుటుంబం ఏటా రెండు సీజన్లలో పండిస్తుంటారు. జిల్లాలో ఎక్కువ శాతం నవాబుపేట, మోమిన్‌పేట, పూడూరు మండలాల్లో పండిస్తున్నారు. యాసంగిలోనూ 890 ఎకరాల్లో 761 మంది కర్షకులు సాగు చేస్తున్నారు.
**పెట్టుబడులూ రావడం లేదు..**ఎకరం క్యారెట్ సాగుకు విత్తనం మొదలుకొని.. ఎరువులు, కలుపుతీత, పిచికారీ, పంట తీయడానికి కూలీలకు.. శుభ్రపర్చి బస్తాల్లో నింపి విపణికి తరలించేందుకు ప్రైవేటు వాహనాలకు బాడుగ ఇతరాలు కలిపి సుమారు రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. ఎకరాకు దిగుబడి సుమారు 80–100 క్వింటాళ్ల వరకు వస్తుంది. ప్రస్తుతం విపణిలో హోల్‌సేల్ ధర కిలోకు సుమారు రూ.10–12లోపే ఉంది. ఎకరంలో పంట తీస్తే సుమారు రూ.80వేల నుంచి రూ.లక్ష లోపే వస్తోంది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వరుసగా నాలుగేళ్లుగా అధిక వర్షాలతో కూరగాయల రైతులు నష్టాల పాలవుతున్నారు. వానాకాలం నష్టాలను యాసంగిలో పూడ్చుకుందామంటే పంట చేతికొచ్చే సమయానికి సరైన ధరల్లేకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

**రూ.లక్ష దాకా పెట్టుబడి పెట్టాను..**

వానాకాలం చివర్లో బోరు కింద 1.5 ఎకరాల్లో క్యారెట్ సాగు చేశా. పెట్టుబడికి రూ.లక్ష ఖర్చయింది. 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్లో ధర లేదు. హోల్‌సేల్‌గా కిలోకు రూ.8 చొప్పున విక్రయించా. రూ.80వేలు వచ్చాయి. చేతికష్టం పోయింది.
గుర్రం వెంకట్‌రెడ్డి, రైతు, నాగిరెడ్డిపల్లి

# లెక్క తేలింది.. దాహార్తి తీర్చేదెలా!

సారంగాపూర్: జిల్లాలో వన్యప్రాణుల గణన పూర్తి కావడంతో వాటి లెక్క తేలింది. శాకాహార, మాంసాహార వన్యప్రాణులు 30,036 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటి సంరక్షణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అడవుల సంరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి పనులు దాదాపు నిలిచిపోయాయి.

**ధ్వంసమైన సాసర్ పిట్లు**

జగిత్యాల, ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లి, కొడిమ్యాల అటవీ రేంజ్‌ల పరిధిలో 67 బీట్‌లున్నాయి. ఇందులో 65 బీట్‌లలో అడవులు విస్తరించాయి. గతంలో ఒక్కో బీట్ పరిధిలో 3 నుంచి 4 సాసర్ పిట్లు నిర్మించి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతుండేవారు. మొత్తం 180 ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు తప్పనిసరిగా నీటి వసతి కల్పించాల్సి ఉంటుంది.
సాసర్ పిట్లు పూర్తిగా ధ్వంసమైనా మరమ్మతులు చేయడం లేదు. మరోవైపు నీటిని నింపేందుకు ప్రత్యేక వాహనాలు లేక పంచాయతీ ట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది. మొన్నటి వరకు పంచాయతీలకు నిధులు రాక చాలా గ్రామాల్లో ట్రాక్టర్లు మూలనపడటంతో పాటు ట్యాంకర్లను పక్కన పడేశారు.
ప్రస్తుతం నిధుల విడుదల లేకపోవడంతో నీటి వసతి కల్పించడం అటవీ శాఖ అధికారులకు తలనొప్పిగా మారింది. వేసవిలో అడవుల్లో



మంటలు లేవకుండా ప్రస్తుతం ప్రత్యేక ఫైర్‌లైన్లు(అగ్గి రేఖలు) ఏర్పాటు చేయాల్సి ఉండగా నిధుల కొరతతో ఆ పనుల ఊసే లేదు.
సాసర్ పిట్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో దాహార్తితో చెరువులు, కుంటల వద్దకు వచ్చే వన్యప్రాణులు వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి.

**నిలిచిన అభివృద్ధి పనులు**

జిల్లాలో కొన్నేళ్లపాటు అడవుల్లో భూగర్భ జలాల పెంపు కోసం ప్రత్యేకంగా పర్కలేషన్ ట్యాంకులు, రాతి కట్టడాలు, చెక్‌డ్యాంలు, సమతుల కదకాల పనులు చేపట్టారు. వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు పెరగటానికి, వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు దోహదపడ్డాయి. అటవీ శాఖ ద్వారా ప్రత్యేకంగా మొక్కలు నాటడం, సంరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పాటు కంపా తదితర పథకాల నిధులతో చేపట్టిన పనులతో జిల్లాలో అటవీ విస్తీర్ణం పెరిగినట్లు అధికారులు గుర్తించారు. కాగా నిధుల లేమి అభివృద్ధికి ఆటంకంగా మారిందని పేర్కొంటున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సారంగపూర్ డిప్యూటీ రేంజర్ రవికుమార్ తెలిపారు. సమీప పంచాయతీ ట్యాంకర్ల ద్వారా సాసర్ పిట్లలో నీటిని నింపనున్నట్లు చెప్పారు.

# హద్దులు చెరిపేసి.. పంటలు సాగు చేసి

సిరిసిల్ల : తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్లాట్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొన్ని ప్లాట్లను చదును చేసి పంటలు సాగు చేస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేయడంతోపాటు అందులో నిర్మాణాలకు అనువుగా మౌలిక వసతులు కల్పించింది. అయినా ఆక్రమణలపై రెవెన్యూశాఖ దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.
**ఇదీ పరిస్థితి** జిల్లాలో కాళేశ్వరం పదో ప్యాకేజీలో ఇల్లంతకుంట మండలం అనంతగిరి జలాశయం నిర్మించారు. దీనిలో 1,260 మంది నిర్వాసితులను గుర్తించారు. వీరికి పరిహారం చెల్లింపులతో పాటు ఇంటి నిర్మాణాలకు అనంతగిరి, తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో స్థలాలను కొనుగోలు చేసి, అందులో మౌలిక వసతులు కల్పించారు. ఒక్కో నిర్వాసితుడికి 250 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. అనంతగిరిలో సగానికిపైగా నిర్మాణాలు జరిగాయి. లక్ష్మీపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో 450 ప్లాట్లతో రూ.20 కోట్లు వెచ్చించి రహదారులు, విద్యుత్తు, తాగునీరు, మురుగుకాల్వలు వంటి మౌలిక వసతులు కల్పించారు. ప్రస్తుతం ఇక్కడ మురుగుకాల్వలు పూర్తిగా పూడుకుపోయాయి. కాలనీ శివారులోని సుమారు 30 ప్లాట్లకుపైగా చదునుచేసి పంటలు సాగు చేస్తున్నారు. విద్యుత్తు నియంత్రికలు లేవు. తాగునీటి సరఫరా పైపులైన్లు అస్తవ్యస్తంగా మారాయి.
తంగళ్లపల్లికి దగ్గరగా సిరిసిల్ల–సిద్దిపేట రహదారికి సమీపంలో ఈ కాలనీ ఉంది. భవిష్యత్తులో తంగళ్లపల్లి పురపాలికగా మారి పట్టణంగా విస్తరిస్తే తమ ప్లాట్లకు ధరలు పెరుగుతాయని నిర్వాసిత కుటుంబాల్లో చాలా మంది లక్ష్మీపూర్‌లో ప్లాట్లు తీసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఒకప్లాటు సుమారు రూ.10 లక్షల ధర పలుకుతోంది.
ప్రభుత్వం 2022లో నిర్వాసితులకు పంపిణీ చేసిన ప్లాట్లను క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి వరకు స్తబ్దుగా ఉన్న కాలనీల్లో ఆక్రమణలకు తెరతీసినట్లు అయింది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించిన ప్లాట్లలో హద్దురాళ్లు తొలగించేస్తున్నారు.
ఈ విషయమై ఆర్డీవో వెంకటేశ్వర్లును సంప్రదించగా.. 'కాలనీల్లో ఆక్రమణల విషయం మా దృష్టికి వచ్చింది. పంచాయతీ అవసరాలకు కేటాయించిన ఖాళీ స్థలాల రక్షణ బాధ్యత పంచాయతీలకే ఉంది. హద్దులు తొలగించి ఆక్రమణలకు పాల్పడుతున్న ప్లాట్లపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

# అంజన్న సన్నిధిలో అపరిశుభ్రత

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రతతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ధర్మసత్రం గదుల వెనుక వైపు, మెట్ల కింద, మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, విస్తర్లు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మెట్ల దారిలోని శౌచాలయానికి ఎప్పుడు చూసినా తాళమే కనిపిస్తుండటంతో భక్తులు ఆరు బయటే మల మూత్ర విసర్జన చేస్తున్నారు. మారుతీ ధర్మసత్ర భవనం మొదటి అంతస్థులోకి వెళ్లే మెట్ల దారి ముందు హోటల్ నుంచి వచ్చే మురుగు నిలుస్తోంది. కొందరు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోని గదుల వెనుక వైపు చెత్త, మురుగు పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ధర్మసత్రం భవనంపైనా చెత్త పేరుకుపోయింది.

**డంపింగ్ యార్డుకు తరలిస్తే మేలు**

చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను దూరంగా తరలిస్తే ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. ఇందుకోసం ఆలయానికి చెందిన స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని భక్తులు సూచిస్తున్నారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైతే మరికొందరు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి వేతనాలు పెంచాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా..**

ఏటా హనుమాన్ జయంతి ఉత్సవాల సమయంలో రూ.10 లక్షలు వెచ్చించి బ్లీచింగ్, ఫినాయిల్, సున్నం, చీపుర్లు ఇతర సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఈ సామగ్రిని ఏడాదంతా వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## సర్కారు బడికి కొండంత అండ

వెల్గటూరు : పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థుల శ్రేయస్సే పరమావధిగా ఆ ఉపాధ్యాయుడు నిరంతరం పాఠశాల ప్రగతి కోసం శ్రమిస్తున్నారు. వెల్గటూరు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న యాలం కొండల్‌రెడ్డి చొరవ, కృషి ఫలితంగా పాఠశాల రూపురేఖలు మారాయి. పలు సౌకర్యాలు విద్యార్థులకు సమకూరాయి.

**సమకూర్చిన సౌకర్యాలివే**సుమారు రూ.3.95 లక్షల వ్యయంతో పాఠశాలలో పలు అవసరాలు, అభివృద్ధి చర్యలు చేపట్టారు. అందులో తన వంతుగా సొంతంగా రూ.1.50 లక్షల వరకు వెచ్చించారు. జలమణి పథకంలో భాగంగా పాఠశాలకు వచ్చిన నీటి శుద్ధి యంత్రం నిరుపయోగంగా మారగా రూ.90 వేలతో కొత్త ట్యాంకు, మోటారు



సహా తగిన మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చారు. 280 మంది విద్యార్థులకు రూ.1.50 లక్షల వ్యయంతో స్పోర్ట్స్ జెర్సీలను సమకూర్చారు. రూ.లక్ష వ్యయంతో మరమ్మతులు చేయించి మరుగుదొడ్లు, మూత్రశాలలు వినియోగంలోకి తెచ్చారు. రూ.45 వేలతో పాఠశాల ప్రధాన ద్వారం గేటు, కొత్త భవనానికి ప్రత్యేక గ్రిల్స్ ఏర్పాటు చేయించారు. ప్రధానోపా ధ్యాయులు నందయ్య, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పూర్వ విద్యార్థుల సహకారంతో పలు కార్యక్రమాలు చేపట్టడం ఆత్మ సంతృప్తిని కలిగిస్తుందన్నారు.

## రసీదు ఇవ్వరు.. లెక్క తెల్వదు!


సూర్యాపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా ఉచితంగా చౌక దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నాయి.వీటితోపాటు చక్కెర, కిరోసిన్ వంటి సరకులు ఇవ్వాల్సి ఉన్నా..వాటిని ఎప్పుడో మరిచిపోయింది. కాగా ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని అందిస్తోంది. వీటిని నిరుపేదలు ఎంతోమంది సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రతి నెలా రేషన్ దుకాణాల నుంచి బియ్యం తీసుకున్న తరువాత లబ్ధిదారులకు దుకాణదారులు రసీదు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంది. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా అమలు కావడం లేదు. నిబంధనల ప్రకారం తప్పనిసరిగా బిల్లు ఇవ్వాల్సి ఉన్నా.. లబ్ధిదారుల అమాయకత్వాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. **కొందరు డీలర్ల నిర్వాకం**
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 77 మండలాల్లో 11,54,125 రేషన్‌కార్డులు



ఉన్నాయి. ప్రతి నెల ఒకటి నుంచి 15 వరకు బియ్యం పంపిణీ చేస్తుండటంతో సదరు లబ్ధిదారులు ఆయా దుకాణాల నుంచి తీసుకుంటున్నారు. కాగా సంబంధిత రసీదులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సదరు లబ్ధిదారులకు మంజూరైన బియ్యం, తీసుకున్న వారి వివరాలు, వారి వేలిముద్రలు, సమయం, తేదీ, కేటాయించిన పరిమాణం తదితర వివరాలన్నీ అందులో పొందుపరిచి ఉంటాయి. కానీ వీటిపై లబ్ధిదారులకు ఇవ్వకుండా వారి వద్దే ఉంచుకోవడం గమనార్హం. కొందరు రేషన్ దుకాణాల నిర్వాహకులు తమ వద్దే ఉంచుకుని తిరిగి వెనుక వైపు ఉపయోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని డీఎస్వో మోహన్‌బాబుతో వివరణ ఇచ్చారు. ఇది పాటించని దుకాణదారులపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆహ్లాదం.. అందనంత దూరం

సూర్యాపేట :కోదాడ పట్టణంలో రెండు పార్కులే ఉన్నాయి. ఉదయం నడక సాగించడానికి, విశ్రాంత ఉద్యోగులు కాలక్షేపానికి పట్టణ ప్రధాన రహదారులతోపాటు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణే దిక్కవుతోంది. గాంధీపార్కులో సౌకర్యాలు, మూత్రశాలలు, మరుగుదొ డ్లు ఉన్నా.. వాటికి తాళాలు వేస్తున్నారు. ఉత్తమ్‌పద్మావతినగర్‌లోని పార్కులో కనీస సౌకర్యాలు లేవు. పట్టణ వాసులకు ఆహ్లాదం కల్పించాలనే లక్ష్యంతో పురపాలికల్లో ఏర్పాటు చేసిన పార్కులు కళాహీనంగా మారాయి. నిర్వహణ లేమితో కనీస సౌకర్యాలు నోచుకోక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పాలకులైనా గతి మారుస్తారని ఆశిస్తున్నారు.సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డ, నిర్మల ఆసుపత్రి రోడ్డు, అంబేడ్కర్‌నగర్, జమ్మిగడ్డలో ఉ



ద్యానాలున్నాయి. తాళ్లగడ్డలోని ఎన్టీఆర్ పార్కులో పచ్చదనం కరవైంది. బోరుమోటారు పైపులకు లీకేజీ ఏర్పడ్డాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ప్రజలు కూర్చొనేందుకు కనీసం కుర్చీలు ఏర్పాటు చేయలేదు. ఇందిరా పార్కులో కూర్చోవడానికి దిమ్మెలు ఏర్పాటు చేశారు. బహిరంగ వ్యాయామశాల కూడా ఉంది. కానీ మరుగుదొడ్డికి తాళం వేసి ఉంటోంది. జమ్మిగడ్డలోని రాజీవ్‌గాంధీ పార్కు రోడ్డు నిర్మాణంలో కొంత వరకు స్థలం కేటాయించారు. అన్ని పార్కుల్లో తాగునీటి వసతి లేదు.
ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి నిర్వహణను మెరుగుపరుస్తామని పుర కమిషనర్ హన్మంతరెడ్డి తెలిపారు.తిరుమలగిరి పురపాలిక ఏర్పడి ఎనిమిదేళ్లు కావొస్తున్నా ఒక్కటైనా పార్కు ఏర్పాటు చేయలేదు. ప్రజలు సాయంత్రం వేళ పెద్దచెరువు కట్టపైకి, ఆంజనేయస్వామి గుట్టపైకి ఎక్కి ఆస్వాదిస్తున్నారు. పలు వార్డుల్లో స్థిరాస్తి వ్యాపారులు పదిశాతం స్థలాలిచ్చినా కార్యాచరణకు దిగలేదు. నేరేడుచర్ల పురపాలికలో పార్కు నిర్మాణానికి ప్రభుత్వం ఎకరం స్థలం కేటాయించింది. ఇందుకు రూ.64 లక్షలు కేటాయించి మూడేళ్లయినా.. ప్రహరీ దశలోనే నిలిచిపోయింది. రెండేళ్ల క్రితం గుత్తేదారు పనులు మధ్యలోనే ఆపేశారు.

## వదిలేశారు.. కాపాడ‘కుంట’



హైదరాబాద్ : కొండాపూర్‌లో ప్రధాన రహదారి పక్కనే ఉన్న జంగం కుంట ఆక్రమణకు గురైంది. అది తమదేనంటూ స్థానిక నేత.. కుంటను మట్టి, బండరాళ్లతో నింపేశారు. దాదాపు మూడెకరాల భూమిని లేఅవుట్‌గా మార్చుతుంటే జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ముడుపులు తీసుకుని చోద్యం చూస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి. ఓవైపు హైడ్రా అధికారులు చెరువుల్లోని బంగ్లాలు, వ్యాపార కేంద్రాలు, నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లను ధ్వంసం చేస్తుంటే.. ఏమాత్రం బయటపడకుండా ఆక్రమణదారు జంగం కుంటను దర్జాగా చదును చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. బహిరంగ మార్కెట్లో దీని విలువ రూ.200 కోట్లకుపైగా ఉంటుంది.

**2010 నుంచి పరంపర..**
శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ సర్వే నంబర్ 134లో జంగంమోని (జంగం) కుంట ఉంది. దీని విస్తీర్ణం 2 ఎకరాల 35 గుంటలు. కట్టను తొలగించేందుకు 2010లో స్థానిక నేత విఫలయత్నం చేశారు. స్థానికులు అడ్డుపడటంతో ఆగింది. 2013లో గ్రామస్థులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు.
2022, 2023లో పూర్తిగా మట్టితో పూడ్చారు. పండగ సెలవుల్లో మట్టి, బండరాళ్లతో 3 ఎకరాల కుంటను మైదానంలా మార్చారు. మసీద్‌బండ గ్రామస్థులు తిరగబడటంతో మళ్లీ పనులు ఆగాయి. వారం కిందట కుంటలోకి మళ్లీ జేసీబీలు ప్రవేశించాయి. రేయింబవళ్లు చదును చేస్తున్నాయి. ప్రస్తుతం లేఅవుట్‌గా మార్చారు.
పూర్వం ఈ కుంట నుంచి పొలాలకు నీరు వెళ్లేదని స్థానికులు తెలిపారు. 10-15 అడుగుల లోతు ఉంటే బండరాళ్లతో జలవనరు ఆనవాళ్లను చెరిపేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూడ్చివేత ఆధారాలను ఎమ్మార్వోకు పంపినా చర్యలు తీసుకోలేదన్నారు.
పదహారేళ్ల క్రితం నుంచీ బల్దియా, రెవెన్యూ అధికారులు చెరువు కట్టను పునరుద్ధరించలేదు. కంచె ఏర్పాటు చేయలేదు. తటాకంలో నింపిన వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదంటే అధికారుల తీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రారెడ్డిని వివరణ కోరగా కబ్జా ఆధారాలను సేకరిస్తున్నామని, ఫొటోలు, వీడియోలు వచ్చాక చర్యలు తీసుకుంటామన్నారు.
ఏళ్ల తరబడి జంగం కుంట సంరక్షణకు చేస్తోన్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో తాజాగా స్థానిక సీపీఎం నేత శోభన్ ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

## ఇంతింత.. చెరువంతా!



తాండూరు : బషీరాబాద్ మార్గంలోని జుంటివాగు చెక్‌డ్యాం వింగ్‌వాల్స్ రాళ్లు తొలగించిన ఓ వ్యక్తి కంచె వేశాడు. వాగు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చి ఆక్రమణకు పాల్పడ్డాడు. స్తంభాలు పాతి తీగ చుట్టేశాడు. ఫిర్యాదులు వెళ్లగా.. సాగునీటి శాఖ, రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేసి వాగు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. ఆక్రమణ మాత్రం ఇంకా తొలగలేదు.
తాండూరు పట్టణంలోని గొల్లచెరువు పరిధి 70 ఎకరాలకుపైగా ఉంది. ఇప్పటికే 12 ఎకరాలకుపైగా కబ్జాకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. మత్స్యకారుల సంఘం ప్రతినిధులు పలుమార్లు సాగునీటి శాఖకు, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరూ పట్టించుకోవడం లేదు. కబ్జా ప్రాంతంలో ఇళ్లు నిర్మిస్తూనే ఉన్నారు.
జిల్లాలో చెరువులు, వాగులు కబ్జాలకు గురవుతున్నాయి. పలుమార్లు సాగునీటిశాఖ, రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్నా.. ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు. చెరువుల సమీపంలోని పొలాలను కొందరు బడా బాబులు కొనడంతో వాటికి ఆనుకొని ఉన్న నీటి వనరులను ఆక్రమించుకుం టున్నారు. కబ్జా అని అధికారులు నిర్ధరించినా.. ఆక్రమణలు తొలగడం లేదు. మరికొందరు చెరువుల పరిధిలోని భూముల్లోకి వచ్చి పంటలు సాగు చేస్తున్నారు. దీంతో చెరువులు కుంచించుకుపోతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.

**సంయుక్త సర్వే చేస్తేనే..**
సాగునీటి, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్త సర్వే చేస్తే చెరువుల ఆక్రమణలు బయటపడతాయని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. చెరువుల నక్ష, దస్త్రాల్లో విస్తీర్ణం, ప్రస్తుతం ఎంత ఉందో తెలుసుకోవచ్చు. పట్టాలున్నాయని కొందరు శిఖం భూముల్లోకి వచ్చి సాగు చేస్తున్నారు. ఆయకట్టు రైతులు, ఎవరైనా అడ్డు చెబితే గొడవలు జరుగుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.
**ఏక్ ఫసల్ పేరిట..**జిల్లాలో చిన్న, పెద్దవి కలిపి 1,236 చెరువులున్నాయి. ప్రతి గ్రామానికి కనీసం 2-4 వరకున్నాయి. వర్షాకాలంలో చెరువు నిండాక ఆయకట్టు భూములకు నీరు వదిలేది. ప్రస్తుతం చాలామంది బోరుమోటార్లు ఉపయోగిస్తుండడంతో చెరువునీటిని సాగుకు తక్కువగా ఉపయోగిస్తున్నారు. వర్షాకాలం తరవాత యాసంగిలో ఏక్ ఫసల్ పేరిట కొందరు రైతులు చెరువు భూమిని సాగు చేసేవారు. ఈ సాకుతో చాలా రోజులుగా కబ్జాలో ఉన్నామనే నెపంతో ఆక్రమించుకుంటున్నారు. జిల్లాలోని 60 శాతం చెరువుల ప్రస్తుత విస్తీర్ణం, దస్త్రాల్లో ఉన్నదానికి చాలా తేడా కనిపిస్తోంది.

## మిగిలింది తారు పనులే..



వేములవాడ : వేములవాడ పట్టణ శివారు మల్లారం రోడ్డులోని లోలెవల్ వంతెనతో ఎన్నో ఏళ్లుగా అష్టకష్టాలు పడిన ప్రజలకు హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తి కావడంతో దాదాపు పది గ్రామాల ప్రజల రాకపోకలు మెరుగయ్యాయి. ఇక తారు నిర్మాణం మిగిలి ఉంది. ఇదొక్కటి పూర్తయితే వంతెన నిర్మాణం సంపూర్ణం కానుంది. **పనులు చకచక..**
హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.2.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ చేసినప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు భూమిపూజకే పరిమితమయ్యాయి. అనేకసార్లు ఈ సమస్యపై ‘ఈనాడు’లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ సమస్యను ‘న్యూస్‌టుడే’ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి పనులు మొదలు కావడానికి చొరవ చూపారు. దీంతో ఏడాది క్రితం వంతెన నిర్మాణ పనులను అర్‌అండ్‌అబీ అధికారులు చేపట్టారు. పనులు చకచక జరగడంతో హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తయింది.

**తొలగిన ఇబ్బందులు**
కట్టుకాలువ చూడ్డానికి చిన్నదిగానే ఉన్నప్పటికీ వర్షాకాలంలో భారీ ఎత్తున వరద పారడంతో అవతలి వైపు ఉన్న జయవరం, రాజ్‌నగర్, మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, గ్రామాలతో పాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు వెళ్లే గ్రామాల ప్రజలతో పాటు మరోవైపు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. వంతెన నిర్మాణం పూర్తి కావడంతో ఇబ్బందులు తొలగాయి. ప్రస్తుతం తారు నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. గుత్తేదారుతో మాట్లాడామని, తారు నిర్మాణం పనులు త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ డీఈ వరప్రసాద్ తెలిపారు.

## కాసులకు కక్కుర్తి.. రైతులను కష్టాల్లోకి నెట్టి

చందంపేట : ప్రభుత్వాలు..పాలకులు.. అధికారులు మారడం తప్ప రైతుల గోస తీరడం లేదు. దీంతో ఆరు గ్రామాలు, ఎనిమిది వేల ఎకరాల సాగు భూమి నిషేధిత జాబితాలో నుంచి తొలగించే వారే కరవయ్యారు. ఎనిమిదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారే లేరని రైతులు వాపోతున్నారు.
2017-18లో అప్పటి అధికారులు భూములకు అక్రమ పట్టాలివ్వడంతో నలుగురు తహసీల్దార్లు, ఆరుగురు వీఆర్వోలు సస్పెండ్‌కు గురికావడంతో పాటు పలువురు జైలు శిక్షనూ అనుభవించారు. చందంపేట మండల పరిధిలోని అచ్చంపేటపట్టి గ్రామంలో సర్వే నెం.50లో 850 ఎకరాలు, బొల్లారం గ్రామ సర్వే నెం.50లో 300 ఎకరాలతోపాటు కంబాలపల్లి, పొగిళ్ల, రేకుగలడ్డ, చిత్రియాల గ్రామాల్లో ఎనిమిది వేల ఎకరాలు ఎనిమిదేళ్లయినా నిషేధిత జాబితాలోనే ఉండిపోయాయి.
**అసలేం జరిగిందంటే..:** ఆయా గ్రామస్థులకు చెందిన పట్టా భూములు అటవీ, ప్రభుత్వ భూముల చెంత ఉండటంతో అప్పటి అధికారులు కాసులకు కక్కుర్తిపడి.. సమీపంలోని అటవీ, ప్రభుత్వ, గుట్టలను సైతం అక్రమ పట్టాలు చేశారు. ఇలా అప్పట్లో దాదాపు 12 వేల ఎకరాలు అక్రమ పట్టాలు బట్టబయలయ్యాయి. దీంతో పలువురు అధికారులు



అక్రమ పట్టాలను తొలగించే క్రమంలో దాదాపు 4వేల ఎకరాలకుపైగా తొలగించగా.. మిగతా 8 వేల ఎకరాలు నేటికి నిషేధిత జాబితాలో ఉండిపోయాయి.
**కొనలేక.. అమ్ముకోలేక:** నాగార్జునసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాల్లో ఆ ఆరు గ్రామాలున్నాయి. అప్పట్లో ముంపువాసులకు ఒక్కో కుటుంబానికి ఐదెకరాల చొప్పున డీఫాం పట్టాలను జారీచేశారు. ఈ భూమి సైతం నిషేధిత జాబితాలో ఉండటంతో విక్రయించడం, కొనుగోలు చేసే పరిస్థితి కన్పించడం లేదు. ఎనిమిదేళ్లుగా రైతులు రైతుబంధు, భరోసా, బీమా, పంట రుణాలు పొందలేకపోతున్నారు.
**సర్వే చేస్తున్నాం..: శ్రీధర్‌బాబు, తహసీల్దార్**కలెక్టర్ ఆదేశాల మేరకు ఎనిమిది వేల ఎకరాల భూమిని సర్వే చేసేందుకు ఆరుగురు సర్వేయర్లను మండలానికి ఎంపిక చేశారు. ఇప్పటికే బొల్లారం, అచ్చంపేటపట్టి గ్రామాల్లోని ఈ భూములను దాదాపు పరిష్కరించాం. కంబాలపల్లి, పొగిళ్ల గ్రామాల్లో సర్వే చేపడుతున్నాం.

## ప్రతిభకు కొలమానం.. బహుమతి ప్రదానం

నల్గొండ : పాఠశాలల విద్యార్థులకు ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం నల్గొండలో జరిగాయి. స్థానిక కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన.. వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్ పోటీల్లో నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, కోదాడ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి పట్టణాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ డీఈవో బొలారం భిక్షపతి హాజరై మాట్లాడారు. పత్రికలు చదవడంతో జ్ఞానం పెరుగుతుందన్నారు. తాను గ్రూప్-1 సాధించడంలో దినపత్రికలు, గ్రంథాలయాలు ఎంతో దోహదపడ్డాయన్నారు. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రంథాలయంలో ఎక్కువ సమయం వినియోగించుకోవడంతోనే ఉద్యోగం సాధించినట్లు వివరించారు. విద్యార్థులు, యువతరం సెల్‌ఫోన్ ఎక్కువ వినియోగించడం వల్ల లాభం లేదని, పత్రికలు, పుస్తకాలు చదవాలని సూచించారు. దినపత్రికలు చదవడంతో ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న విషయాలు, సైన్స్ పరిజ్ఞానం, భూగోళ పరిస్థితులు తెలుస్తాయన్నారు. ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ఏటా విద్యార్థులకు ప్రతిభా, క్రీడా పోటీలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తుందని వివరించారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ‘ఈనాడు’ చేస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ముఖ్యమని, ఓడినవారు నిరాశపడకుండా మరోసారి ప్రయత్నించాలని సూచించారు.సూర్యాపేట యూనిట్ ఇన్‌ఛార్జి వేణుకుమార్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘ఈనాడు-ఈటీవీ’ ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదట పాఠశాల స్థాయిలో, తర్వాత రీజినల్, ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు వివరించారు.
అనంతరం విజేతలకు డీఈవో బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఇంగ్లిష్ అండ్ సైకాలజీ స్టేట్ రిసోర్సు గ్రూప్ సభ్యుడు, డైట్ ఫాకల్టీ డా.టి.భానుప్రకాష్‌గౌడ్(వ్యాసరచన), నేషనల్ రిసోర్సు గ్రూప్ ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సభ్యుడు, ఇంగ్లిష్ స్టేట్ రిసోర్సు గ్రూప్ సభ్యుడు కె.నరేందర్‌రెడ్డి(ఉపన్యాసం), ప్రభుత్వ ఉన్నత పాఠశాల డైట్ ఉపాధ్యాయుడు గాదరి సహదేవ (చిత్రలేఖనం)లు వ్యవహరించారు.
ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి విజేతలు వీరే..
వ్యాసరచన పోటీల్లో.. ప్రథమ- వి.సాయిసింధు(ఎస్పీఆర్ హైస్కూల్ మిర్యాలగూడ), ద్వితీయ-సఫియాకౌసర్( కృష్ణవేణి టాలెంట్ స్కూల్, దేవరకొండ), ఎం.హర్షిణిరెడ్డి(శివాని హైస్కూల్, మిర్యాలగూడ).
ఉపన్యాస పోటీల్లో .. ప్రథమ-జి.వర్షిత(శివాణి హైస్కూల్ మిర్యాలగూడ), ద్వితీయ- జె.రాధిక(ఎస్ఎస్ హైస్కూల్, నల్గొండ), తృతీయ-సిహెచ్.అభినవనందన్(సృజన హైస్కూల్ సూర్యాపేట).
చిత్రలేఖనంలో.. ప్రథమ-ఎన్.సాత్విక(శివాణి హైస్కూల్ మిర్యాలగూడ), ద్వితీయ-టి.సాహితీ శ్రీవైష్ణవి(జయ హైస్కూల్ సూర్యాపేట), తృతీయ-జి.వెంకటేశ్(విద్యాభారతి హైస్కూల్ సూర్యాపేట).
జనరల్ నాలెడ్జ్ పరీక్షలో.. ప్రథమ-ఎం.సాత్విక్(ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ లెర్నింగ్, నల్గొండ), ద్వితీయ-ఎన్.మోక్షశ్రీ(ప్రేరణ హైస్కూల్ నల్గొండ), తృతీయ-షేక్ అఫ్నాన్ (తేజ విద్యాలయ కోదాడ) గెలుపొందారు.
సంతోషంగా ఉంది: వి.సాయిసింధు
ఒక్కో దశలో బహుమతి సాధిస్తూ ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో వ్యాసరచనలో ప్రథమ బహుమతి పొందినందుకు సంతోషంగా ఉంది. పోటీ చాలా ఎక్కువగా ఉంది. ఇలాంటి పోటీలతో మాలో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుంది. కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం: జి.వర్షిత ఈ పోటీలతో చాలా విషయాలు తెలుసుకోగలుగుతున్నాం. ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. వివిధ దశల్లో నిర్వహించిన పోటీల్లో గెలుస్తూ ఇక్కడి వరకు రావడం సులువు కాదు. ఉపన్యాసంలో ప్రథమ బహుమతి సాధించినందుకు సంతోషంగా ఉంది.
సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం: ఎన్.సాత్విక
చిత్రలేఖనం పోటీలో గత మూడేళ్లుగా పాల్గొంటున్నా. ఈనాడు ప్రతిభా పోటీల్లో చిత్రలేఖనం విభాగంలో ప్రథమ బహుమతి సాధించినందుకు సంతోషంగా ఉంది. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు ‘ఈనాడు’ చేస్తున్న కృషికి అభినందనలు.ప్రతిభను పెంపొందించుకునే అవకాశం: సాత్విక్పోటీ పరీక్షలతో మన ప్రతిభను అంచనా వేసుకునే అవకాశముంది. జనరల్ నాలెడ్జ్ పరీక్షలో ప్రథమ బహుమతి సాధించినందుకు ఆనందంగా ఉంది.

# ప్రతి 7 కిలోమీటర్లకు ఒక రేడియల్ రోడ్డు

హైదరాబాద్: మహానగరం చుట్టూ 158 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న అవుటర్ రింగ్ రోడ్డు...భవిష్యత్తులో రానున్న ప్రాంతీయ రింగ్ రోడ్డు(ట్రిపుల్ఆర్) అనుసంధానం కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగరం నుంచి ఓఆర్ఆర్‌ను పూర్తిగా అనుసంధానం చేయనున్నారు. రానున్న రోజుల్లో ఈ రెండు కీలక రహదారుల మధ్యే అభివృద్ధి ప్రాజెక్టులు రానుండటంతో మౌలిక వసతులు కల్పించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే తొలుత రోడ్డు నెట్‌వర్క్‌పై హెచ్ఎండీఏ దృష్టిపెట్టింది. ప్రస్తుతం అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా 11 వరకు రాష్ట్ర, జాతీయ రహదారులు వెళుతున్నాయి. ఇవి ఓఆర్ఆర్, ప్రాంతీయ రింగ్ రోడ్డు దాటి వెళ్లనున్నాయి. ఇవే కాకుండా...ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ప్రతి 7-8 కిలోమీటర్ల మధ్య ఒక్కో రేడియల్ రోడ్డు నిర్మించాలనేది ప్రణాళిక. వీటిని ట్రిపుల్ఆర్‌తో అనుసంధానం చేస్తారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 నుంచి ఫిలింనగర్, ఐటీసీ కోహినూర్ మీదుగా శిల్పా లేఅవుట్ వరకు మొత్తం 9 కిలోమీటర్ల మేరకు ఎలివేటెడ్ స్టీల్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇది ఓఆర్ఆర్‌కు అనుసంధానం అవుతుంది. దీనికి సంబంధించి డీపీఆర్ హెచ్ఎండీఏ సిద్ధం చేస్తోంది. 15 ఎకరాల వరకు రక్షణశాఖ, ప్రైవేటు భూములను సేకరించేందుకు సిద్ధమవుతోంది. ఇక ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ఆర్ వరకు అనుసంధానం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



రావిర్యాల (ఎగ్జిట్ 13) నుంచి ఆమనగల్లు వరకు 41 కిలోమీటర్లకు ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు మొదలయ్యాయి. ఎల్ఎన్‌టీ, రిత్విక్ కంపెనీలు ఈ పనులు మొదలు పెట్టాయి.

శంషాబాద్ విమానాశ్రయం వర్ధమాన్ కళాశాల సమీపం నుంచి లగచర్ల వరకు మరో 81 కిలోమీటర్ల వరకు ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ఆర్ వరకు రహదారి నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇవి కాకుండా దశల వారీగా మరిన్ని రోడ్లు నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు.. అక్కడి నుంచి ట్రిపుల్ఆర్ వరకు రానున్నాయి.

ఆ రెండింటి మధ్య..

షేక్‌పేట్‌నుంచి మణికొండ, మైహోం అవతార్, ఎంజీఐటీ వరకు 7 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి చేయనున్నారు. నానక్‌రాంగూడ-అవుటర్‌కు మరో రోడ్డును సైతం మరో రెండు లేన్లు విస్తరించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది.

**భూ సేకరణ షురూ.. !**

అవుటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రాంతీయ రింగ్ రోడ్డును అనుసంధానించే రెండో గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు ప్రణాళిక షురూ అయింది. దీనికి సంబంధించి భూ సేకరణ చేపట్టడానికి తాజాగా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఓఆర్ఆర్ బుద్వేల్ సమీపం నుంచి జాతీయ రహదారి 167ను కలుపుతూ నాచారం వరకు మొత్తం 81 కిలోమీటర్ల పొడవుతో ఈ రేడియల్ రోడ్డును నాలుగు వరుసలు నిర్మించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా భూ సేకరణ కీలకం కావడంతో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని మాచన్‌పల్లి ప్రాంతంలో 45.05 ఎకరాలు, కొందుర్గ్ మండలం ముట్పూర్‌లో 95.72 ఎకరాల భూమిని సేకరించనున్నారు. భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చి తర్వాత పరిహారం లెక్కించనున్నారు. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమయ్యే భూమిని గుర్తించారు. ఇప్పటికే రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు ఫ్యూచర్‌సిటీ, ట్రిపుల్ఆర్‌ను కలుపుతూ 41 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో పనులు కూడా ప్రారంభించారు.

# ప్రణ'మిల్లు'తున్నారా..?

సంగారెడ్డి : ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని పలు మిల్లుల్లో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. అయినా ఈ మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఓ మిల్లు నిర్వాహకుడు సీఎంఆర్ బకాయిపడితే ఆయనకు చెందిన స్థిర, చరాస్తులను వేలం వేసి రెవెన్యూ రికవరీ యాక్టు కింద రూ.47 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా దోమ మండలానికి చెందిన రెండు మిల్లుల యజమాని ఎండీ సర్దార్ 2000 వేల మెట్రిక్ టన్నులకు సంబంధించి జరిమానాతో కలిసి రూ.7 కోట్ల వరకు బకాయిపడడంతో కేసు నమోదైంది.

**పరిస్థితి ఎలా ఉందంటే..**

2022-23 సీజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో బియ్యం తీసుకోవడంపై అనిశ్చితి ఏర్పడింది. ఫలితంగా మెదక్ జిల్లాలో 72 రైసు మిల్లర్ల వద్ద భారీ స్థాయిలో ధాన్యం పేరుకుపోయింది. ప్రస్తుత ప్రభుత్వం చిక్కులు తొలగించేందుకు మిల్లర్ల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని వేలం వేసింది. మెదక్ జిల్లా పరిధిలో 87.986 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి వేలం వేశారు. దక్కించుకున్న వ్యాపారులు టన్నుకు రూ.21,700ల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిన్నర దాటినా చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగలేదు.

నిల్వ ధాన్యానికి నగదు చెల్లించాలని మెదక్ జిల్లా పౌరసరఫరాల శాఖ పలుమార్లు నోటీసులు జారీచేసినా ససేమిరా అంటున్నారు. పైరవీలతో నగదు చెల్లించకుండానే ప్రతీ సీజన్‌కు ధాన్యం కేటాయింపులు చేసుకుంటూ తమ మిల్లులను యథవిధిగా నిర్వహిస్తున్నారు. కొందరు తమ మిల్లును లీజుకు ఇచ్చేసి వెళ్లిపోయారు.

సంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్ ప్రారంభానికి ముందు విజిలెన్స్ యంత్రాంగం జిల్లాలోని మూడు నుంచి నాలుగు మిల్లుల్లో తనిఖీలు చేయగా ధాన్యం విక్రయించినట్లు నిర్ధారణైంది. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి 32,792 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. సిద్దిపేట జిల్లాలో యాసంగి సీజన్‌కు 10,534 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.

**రాజకీయ ఒత్తిళ్లతో...**

గత మూడు నాలుగు సీజన్లుగా ఉమ్మడి జిల్లాలోని కొన్ని మిల్లులు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నా రాజకీయ కారణాలతో వాటి యజమానులపై చర్యలు తీసుకోవడం లేదని తెలిసింది. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో కేసులతోనే సరిపెట్టారు. రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతోపాటు చట్టపరంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. తమపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లున్నట్లు అధికారులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సీఎంఆర్ ఇవ్వని మిల్లు యజమానులను బ్లాక్ లిస్టులో పెట్టడంతో ధాన్యం పంపిణీని నిలిపివేయాలి.

| 2021-22లో సీఎంఆర్ బకాయిలు జిల్లా | మిల్లులు | బకాయిలు |
|---|---|---|
| మెదక్ | 13 | రూ.120 కోట్లు |
| సిద్దిపేట | 6 | రూ.56 కోట్లు |

# శాండ్ 'బేజార్'..!



మిర్యాలగూడ : తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌లో ఇసుక అక్రమ తరలింపు దందాతో నెలరోజులుగా భారీగా ఇసుక నిల్వలు పేరుకుపోతున్నాయి. టీజీఎండీసీ ఆన్‌లైన్ యాప్‌లో ఇసుకను బుకింగ్ చేసుకుంటే సాధారణ వినియోగదారులకు టన్ను రూ.1,400, ఇందిరమ్మ ఇళ్లకు టన్ను రూ.1,000కి విక్రయిస్తున్నారు. దీనికి అదనంగా రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. నకిరేకల్ నియోజకవర్గం వంగమర్తి నుంచి ఇసుకను భారీ వాహనాల్లో తరలించి ఇక్కడ నిల్వ చేస్తున్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని రావులపెంట రీచ్ తెరవడంతో ఇక్కడి ఇసుకను బుకింగ్ చేసుకుంటున్నారు. వాస్తవానికి ఇక్కడ పదుల సంఖ్యలోనే ఇసుక బుకింగ్ చేస్తుండగా అనధికారికంగా తక్కెళ్లపాడు, కామేపల్లి మూసీ పరీవాహక ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక అక్రమ తరలింపు కారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌లో నెలరోజులుగా ఇసుక భారీగా పేరుకుపోయింది. ప్రస్తుతం 7500 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు పేరుకు పోగా చేసేది ఏం లేక టీజీఎండీసీ ఉన్నతాధికారులు గురువారం ఇసుక ధరలను తగ్గించారు. సాధారణంగా ఇసుక టన్నుకు రూ.1400 ఉండగా రూ.1300లకు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.1,000 నుంచి రూ.900 తగ్గించారు. ఇకనైనా సంబంధిత పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు స్పందించి అక్రమ ఇసుక తరలింపును అడ్డుకొని శాండ్ బజార్ ఇసుక కొనుగోలు చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి ఇసుక బుకింగ్‌లు తగ్గిపోయాయని శాండ్ బజార్ ఇన్‌ఛార్జి కృష్ణారెడ్డికి తెలిపారు. ధరల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

# ఆరు దాటితే అవస్థలే!




నిర్మల్ : ఏవైనా అవసరాల నిమిత్తం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, వివిధ శాఖల పరిధిలో దూరప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు సైతం ఇది సమస్యాత్మకంగా మారుతోంది. పని త్వరగా పూర్తయితే పగటివేళలో ఎలాగోలా వెళ్లిపోవచ్చు. ఏమాత్రం ఆలస్యమైనా, సాయంత్రమైందంటే వాహనాలు దొరక్క ఇబ్బందికరంగా మారుతోంది.పట్టణానికి సుమారు నాలుగు కి.మీ.లకు పైగా దూరంలో ప్రభుత్వం అభివృద్ధి చేసిన రహదారి మార్గంలో నూతన కలెక్టరేట్ భవనం ఉంటుంది. దాదాపు అన్ని జిల్లా కార్యాలయాలు అక్కడే ఉండటంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిత్యం వెళ్తుంటారు. సొంత వాహనాలున్న వారి సంగతి పక్కనపెడితే.. మహిళలు, సొంత వాహనాలు లేని వారికి ఇబ్బందులు తప్పటం లేదు. ఉద్యోగుల సౌలభ్యం కోసం ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు నడుస్తున్నా.. అది అందరికీ పూర్తిస్థాయి ప్రయోజనం కల్పించలేకపోతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించేవారు సాయంత్రం 4.30 గంటల్లోపు పనులు పూర్తిచేసుకోవాలి. అలాగైతేనే ఆ సమయంలో వచ్చే బస్సులో తిరిగెళ్లొచ్చు. కానీ, అన్నిచోట్లా ఇది సాధ్యం కాదు. బస్సు వెళ్లిపోయిం దంటే.. ఉద్యోగులు, సిబ్బంది నానాతంటాలు పడాల్సిందే. ఆటోలైతే ప్రత్యేకంగా వీరిని తీసుకెళ్లేందుకే వెళ్లడం, తిరిగొచ్చేటపుడు కిరాయిలు దొరకవన్న కారణంతో రూ.100కు పైగా వసూలు చేస్తున్నారు.

**అదొక్కటే ఆధారం**

ఉద్యోగుల సౌలభ్యం కోసం నిర్మల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ఒక్కో ట్రిప్పు బస్సు నడిపిస్తున్నారు. ఉదయం 10.15 గంటలకు, సాయంత్రం 4.30 గంటలకు ఇది వెళ్తుంది. సొంత వాహనాల్లేనివారు ఈ బస్సులో ప్రయాణిస్తున్నారు. ఉదయం 8.35 గంటలకు ఓ బస్సు నడుస్తున్నా, అది రెండు పడకగదుల ఇళ్ల ప్రాంతంలో ఉండే విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటుచేశారు. ఆ బస్సు సమయం ఉద్యోగులకు ఏమాత్రం ఉపయోగపడదు.

# కోచ్ ఫ్యాక్టరీ ఉద్యోగాలపై కోటి ఆశలు



కాజీపేట : హనుమకొండ జిల్లా కాజీపేటలోని అయోధ్య పురంలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిరుద్యోగులు నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కోచ్ ఫ్యాక్టరీ కల త్వరలో సాకారం కానుంది. ప్రస్తుతం దీనిపై రైల్వే ఐకాస ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతోంది. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది. ఈ క్రమంలో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి, నియామకాలు ఎలా జరుగుతాయనే విషయంపై అందరిలో ఆసక్తి నెలకొంది.

**నియమకాలు ఎలా ఉంటాయి?**

కోచ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే సుమారు 3 నుంచి 4 వేల ఉద్యోగుల అవసరం ఉంటుంది. ముందుగా ఇతర కోచ్‌ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న నిపుణులను ఇక్కడికి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి స్థానిక ఉద్యోగులకు శిక్షణ ఇప్పిస్తారు. డిప్యుటేషన్‌పై వచ్చిన నిపుణులు కొన్నేళ్ల తర్వాత తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లిపోతారు. ప్రధాన విభాగాలు కాకుండా పారిశుద్ధ్యం, టెక్నికల్, సెక్యూరిటీ తదితర విభాగాలు మాత్రం ఇతర ప్రైవేటు పరిశ్రమల్లో మాదిరిగానే ఉంటాయి. లేదా రైల్వే.. ఒక సంస్థకు ఉత్పత్తి బాధ్యతలను అప్పగించే అవకాశాలు ఉన్నాయి. ఇలా జరిగితే పూర్తిగా స్థానికులకే ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. ఏప్రిల్ లేదా మే మాసంలో ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**స్థానికులకు ప్రాధాన్యమివ్వాలని..**

కాజీపేటలోని అయోధ్యపురంలో 160 ఎకరాల్లో రూ.521 కోట్ల వ్యయంతో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, మెమూ, మెట్రో రైళ్ల కోచ్‌లు, వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపులు ఉంటాయి. దీని నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 1980లోనే కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ మంజూరైంది. భూమిని కూడా సర్వే చేశారు. నాడు పంజాబ్‌లో జరుగుతున్న ఆందోళనలను చల్లార్చి అక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కాజీపేట ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తలకు తరలించారు. అక్కడి యువతకు 82 శాతం ఉద్యోగాలు కల్పించారు. ఆ తర్వాత రాయ్‌బరేలీలో నిర్మించిన కోచ్‌ఫ్యాక్టరీలో కూడా స్థానికులకు 50శాతం ఉద్యోగాలిచ్చారు. అక్కడి నిబంధనలనే ఇక్కడా అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిరుద్యోగుల కోసమే రైల్వేశాఖ కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టింది. కోచ్‌ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని ఉద్యమంగా తీసుకెళ్తున్నాం.

దేవులపల్లి రాఘవేందర్, రైల్వే ఐకాస కన్వీనర్

# గడువు ముగిసినా.. ఓసీ ఇస్తాం

హైదరాబాద్: నిర్ణీత గడువులోపు నివాసయోగ్యపత్రం(ఓసీ) పొందలేకపోయిన భవనాలకు ఉపశమనం కల్పిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నిబంధనలను పాటించి ఇంటి నిర్మాణం చేపడితే.. ఆలస్యమైనా సరే ఓసీ జారీ చేద్దామని ఆయన నిర్ణయించారు. అందులో భాగంగా.. ఓసీ దరఖాస్తులను రెండు రకాలుగా విభజించి.. వాటికి గురువారం మార్గదర్శకాలు జారీ చేశారు. రెండు కేటగిరీల్లోనూ.. భవన నిర్మాణంలో ఉల్లంఘనలుగరిష్ఠంగా 10శాతం మాత్రమే ఉండాలని, 18మీటర్ల ఎత్తు వరకు అనుమతి తీసుకున్న భవనాలకు మాత్రమే వర్తించనుందని స్పష్టం చేశారు. **మార్గదర్శకాలు ఇలా..**నిర్మాణ అనుమతి గడువు ముగిసిన తేదీ నుంచి రెండేళ్లలోపు ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే.. పెండింగులోని నిర్మాణ అనుమతి రుసుము, లింకు రోడ్డు ఛార్జీలు, సీఆర్ఎంపీ ఫీజు, ఇతరత్రా రుసుములతో దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. నిర్మాణ అనుమతి గడువు ముగిసిన తేదీ నుంచి రెండేళ్ల తర్వాత దరఖాస్తు చేసుకున్నట్లయితే.. దరఖాస్తు తేదీ నాటికి మొత్తం నిర్మిత విస్తీర్ణానికి వర్తించే అన్ని రుసుములు, ఛార్జీలు వసూలు చేస్తారు.

# అంకుర సంస్థలు.. పరిశోధనలు.. కృత్రిమ మేధ

హైదరాబాద్: అంకుర సంస్థలు... అభివృద్ధి.. పరిశోధన... కృత్రిమమేధ అంశాలే కీలకంగా జేఎన్‌టీయూ హైదరాబాద్ భవిష్యత్ నిర్దేశనం చేసుకుంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాల మేరకు జేఎన్‌టీయూలో చదువుకుంటున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు వారి చదువు పూర్తయ్యేలోపే విద్య, ఉపాధి అవకాశాలు సులువుగా లభించేలా కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు వచ్చే ఐదేళ్లకు సంస్థాగత ప్రణాళికను అధికారులు రూపొందించనున్నారు. దీన్ని సమగ్రంగా తయారు చేసేందుకు జేఎన్‌టీయూ కాకినాడ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ తులసీ రామ్‌దాస్ మార్గదర్శకత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కేవీరావు, ప్రిన్సిపల్ జీవీ నరసింహారెడ్డిలు ప్రణాళికలో



అంశాలను చర్చించారు. నిరంతర విద్యానైపుణ్యంతో విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రోత్సహించే పది కమిటీలను ఏర్పాటు చేశారు.

**వినూత్న ఆవిష్కరణలు.. పేటెంట్లు**

విద్యార్థులు, ఆచార్యులు కలిసి వినూత్న ఆవిష్కరణలను కనుగొనేలా వర్సిటీ క్యాంపస్‌లో అభివృద్ధి, పరిశోధన విభాగాలను బలోపేతం చేయనున్నారు. విద్యార్థుల ఆలోచనలను పరిశోధనలుగా మార్చి పరిశ్రమలు, ఇతరసంస్థలకు ఉపయుక్తంగా ఉంటే పేటెంట్లు లభించేలా వారికి ప్రోత్సాహం అందించనున్నారు.

**దీర్ఘకాలిక అభివృద్ధికి శ్రీకారం**

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 50నుంచి70% వరకూ సరైన ఉద్యోగాలు లభించడంలేదు. చదువుకున్న కోర్సుతో పాటు నైపుణ్యాలు విద్యార్థుల్లో ఉండాలంటూ పరిశ్రమలు, బహుళజాతి సంస్థలు ఆశిస్తున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు దీర్ఘకాలిక అభివృద్ధికి సంస్థాగత అభివృద్ధి ప్రణాళికలను రూపొందించనున్నామని రిజిస్ట్రార్ ప్రొ. కేవీరావు తెలిపారు. 3,4నెలల్లో సమగ్ర, సమ్మిళిత కార్యాచరణ రూపొందిస్తామని, తెలంగాణ టెక్నాలజీ విజన్-2035, తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రాలకు అనుగుణంగా తమ ప్రణాళిక ఉంటుందని వివరించారు.

# రహదారులు మెరుగు.. వాహనాల పరుగు!

పరిగి : దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలు ఒక్కొక్కటిగా తీరుతున్నాయి. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈక్రమంలోనే రవాణా సౌకర్యాలను మెరుగు పరుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ప్రతి ఊరికి దాదాపు రెండు వరుసల రహదారి పనులు జరుగుతున్నాయి. పరిగి నియోజకవర్గంలో ప్రధాన రోడ్లు నాలుగు వరుసలుగా మార్చే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. షాద్‌నగర్, వికారాబాద్ మార్గంలోనూ పనులు ప్రారంభించారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణం సజావుగా సాగడంతో పాటు ప్రజల కష్టాలు తీరనున్నాయి.

**రవాణా వసతులతోనే అభివృద్ధి: రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే**

రవాణా సౌకర్యాలను మెరుగు పరిస్తే గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయి. ఇందుకోసం జాతీయ రహదారులకు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లను అనుసంధానించాలని ప్రభుత్వాన్ని కోరాం. పరిగి -షాద్‌నగర్, పరిగి - వికారాబాద్ రోడ్లను నాలుగు వరుసలుగా మార్చుతున్నాం. నిర్మాణంలో ఉన్న గడిసింగాపూర్

-రంగారెడ్డిపల్లి రోడ్డు

**ఇదిగో ఇలా**

పరిగి నియోజకవర్గంలో రోడ్లు, భవనాల శాఖ రహదారులు 14 ఉండగా 178 కిలోమీటర్ల దూరం ఉన్నాయి. మొత్తంగా బీటీ ఉండగా అక్కడక్కడా దెబ్బతిన్న వాటికి మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

పరిగి మండలం గడిసింగాపూర్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా రంగారెడ్డిపల్లి గ్రామాల మధ్య దూరం 26కిలోమీటర్లు. ఇందులో 16కిలోమీటర్ల దూరం వరకు సింగిల్ రోడ్డును రెండు వరుసలుగా మార్చుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.80 కోట్లు వెచ్చిస్తున్నారు. పరిగి నుంచి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మార్గంలో 15కి.మీ, పరిగి నుంచి వికారాబాద్ వరకు 18.2 కి.మీ దూరం ఈ రెండింటికి కలిపి రూ.240 కోట్లు కేటాయించారు. ఈ రోడ్లను నాలుగు వరుసలుగా మార్చుతున్నారు. శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు మరింత పెరిగేందుకు అవకాశముంది. పూడూరు మండలం కంకల్ -కొందర్గు మండలం లాల్‌పహాడ్ రోడ్డును రూ.20కోట్ల వెచ్చించి రెండు వరుసలుగా మార్చుతున్నారు. దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

పరిగి మండలంలోని ఇబ్రాహీంపూర్ వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల రోడ్డు బీటీ దెబ్బతిని అస్తవ్యస్తంగా మారింది. ఇదే మార్గంలో అనేక గిరిజన తండాలున్నాయి. రవాణా వసతి లేకపోవడంతో నిత్యం వేలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డును రూ.22 కోట్ల అంచనా వ్యయంతో మెరుగు పరచనున్నారు.

# కాలుష్య పరిశ్రమలు అవుటర్ దాటేనా?

జిన్నారం: పారిశ్రామిక పాలసీ (హిల్ట్)పై ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన ప్రకటన.. పటాన్‌చెరు నియోజకవర్గంలో చర్చనీయాంశమయింది. హైదరాబాద్ మహానగరాన్ని విస్తరించే కార్యక్రమంలో భాగంగా అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలికి తరలించటానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పటాన్‌చెరు నియోజకవర్గంలో పలు పారిశ్రామిక వాడలున్నాయి. హిల్ట్ పరిధిలోకి ఇస్నాపూర్, పటాన్‌చెరు, పాశమైలారంలను చేర్చారు. తమకూ అవకాశం కల్పించాలని ఐడీఏ బొల్లారం పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. తాజాగా ఉపముఖ్యమంత్రి ప్రకటనతో పరిశ్రమల తరలింపు వ్యవహారం చర్చనీయాంశమైంది.

భవిష్యత్తులో సమస్యలు లేకుండా..

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ(హిల్ట్) పరిధికి పారిశ్రామికవాడలను తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నూతన విధానానికి తెరతీసింది. ఇందలో భాగంగా ముందుగా కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే ఆలోచనతో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 పారిశ్రామికవాడలను హిల్ట్ పరిధిలో చేర్చగా.. పటాన్‌చెరు నియోజకవర్గంలోనివి ఐదు ఉన్నాయి. నగరానికి భవిష్యత్తులో కాలుష్య సమస్య లేకుండా చేయాలనే ప్రభుత్వం ఓఆర్ఆర్ లోపల ఉన్న ఉన్న పరిశ్రమలను తరలించే యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాలసీలో 40 ఏళ్ల చరిత్ర ఉన్న ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడ లేకపోవడంపై యజమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రసాయన పరిశ్రామలను ఓఆర్ఆర్ ఆవలికి తరలిస్తే.. ఆయా ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# వారిదే హవా.. వామ్మో అనేలా!

అమరావతి : సంచలనం సృష్టించిన కల్తీ నెయ్యి వ్యవహారంలో హవాలా రూపంలో లంచాల సొమ్ము చెల్లింపు మూలాలు విజయవాడలో ఉన్నట్లు సిట్ గుర్తించింది. వైకాపా జమానాలో జరిగిన ఈ వ్యవహారంలో బోలేబాబా డెయిరీ ప్రతినిధులు తమ అక్రమ కార్యకలాపాలకు హవాలా మార్గంలో డబ్బులు చెల్లించినట్లు తేలింది. ఇందులో విజయవాడ వ్యాపారి భరత్‌భాయ్ ఠాకూర్ కీలకమని వెల్లడైంది. ఇది అసలైన పేరా లేదా ఈ పేరుతో చెలామణి అవుతున్నారో తేలాలి. ఈనేపథ్యంలో విజయవాడ పాతబస్తీ కేంద్రంగా పెద్దమొత్తంలో సాగే హవాలా వ్యాపారం చర్చనీయాంశమైంది.

**ఏటా రూ.500 కోట్ల లావాదేవీలు...**

పాతబస్తీలో హవాలా వ్యాపారులు 50 మంది వరకు ఉన్నారు. వీరిని ఆశ్రయించి పలువురు వ్యవహారాలు సాగిస్తుంటారు. నిత్యం పెద్దమొత్తంలో వీరి ద్వారా హవాలా రూపంలో నగదు చేరవేస్తున్నారు. దిల్లీ, ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్, చెన్నై, రాజస్థాన్, బెంగళూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, గుడివాడ, కాకినాడ, తదితర ప్రాంతాలకూ వ్యాపారం విస్తరించింది. వీరు నగదు, బంగారం, వెండి, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి ఖరీదైన వస్తువులు బిల్లు లేకుండా చేరవేసి కమీషన్ తీసుకుంటారు. ఏటా రూ.500 కోట్లు హవాలా రూపంలో చేతులు మారుతుందని సమాచారం.



**కరెన్సీ నోటు నెంబరు మేరకు...**

డబ్బులు, బంగారం, వెండి స్వీకరించే వారికి, చేరవేసే వారికి సంధాన కర్త.. కరెన్సీ నోటు నెంబరు మాత్రమే. రూ.10, రూ.20, రూ.50, 100, రూ.500 నోటుపైన నెంబరు ఆధారంగా హవాలా వ్యాపారం జరుగుతోంది. విజయవాడలోని వ్యాపారి, గుజరాత్‌లో ఉన్న వారికి నగదు, బంగారం, వెండి చేరవేయాలంటే ఒక కరెన్సీ నోటు నెంబరు చెబుతాడు. ఆ వ్యాపారి ఏజెంటు వద్దకు వెళ్లి ఆ నోటు నెంబరు చెప్పగానే ముందే నిర్ణయించిన మొత్తం వారికి అందజేస్తాడు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ, ఆదాయపన్నులు ఉండవు. వ్యాపార లావాదేవీల్లో తేడాలు వచ్చి అధికారులకు సమాచారం వస్తే వెలుగు చూస్తాయి.

**అంతా కుమ్మక్కు...**

హవాలా వ్యాపారులకు పలువురు నేతలు, పోలీసుల సహకరిస్తున్నారని ప్రచారం ఉంది. బిల్లు లేకుండా బంగారం తరలిస్తున్న రాష్ట్రేతర వ్యాపారి వ్యవహారం ఇటీవల పోలీసుల దృష్టికి వచ్చింది. ఇది వెలుగు చూడకుండా రూ.లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. జీఎస్టీ అధికారులు నామమాత్ర కేసులు నమోదు చేసి మామూళ్లు దండుకుంటున్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు పక్కన చిన్న పాన్ షాపు నడిపే వ్యక్తి సైతం పాతబస్తీలో రూ.2.50 కోట్లు వెచ్చించి ఇల్లు కొనేస్థాయికి ఎదగడం హవాలా వ్యాపార హవాకు నిదర్శనం. నిరుడు వాణిజ్య పన్నుల విభాగంలో చిరుద్యోగి సైతం అనిశా అధికారులకు పట్టుబడటం వెనక వాటాల్లో తేడా రావడమే కారణమనే ప్రచారం జరుగుతోంది.

# పెన్నాలో ఇసుక తోడేళ్ల బరితెగింపు

సిద్దవటం : పెన్నా నదిని ఇసుకాసురులు వదలడం లేదు. ప్రభుత్వ నిబంధనలను కాలరాస్తూ ఇష్టానుసారంగా తవ్వకాలు సాగిస్తూనే ఉన్నారు. కొండలను తలపించేలా కుప్పలను నిల్వ చేస్తున్నారు. అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇష్టారీతిన తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. లోతుగా తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వ్యవసాయ బోర్లు ఒట్టిపోతున్నాయి. సమీప గ్రామాల వాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు అడ్డుకునే దిశగా కన్నెత్తి కూడా చూడడం లేదు.వైకాపా హయాం నుంచి మొదలు: సిద్దవటం మండలం జంగాలపల్లె పరిధిలో కమ్మపాలెం, జంగాలపల్లె, వెలుగుపల్లె గ్రామాలు ఉన్నాయి. పక్కనే ఉన్న పెన్నా నదిలో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉండడంతో వైకాపా పాలనలో క్వారీ పేరుతో తవ్వకాలు సాగించారు. యంత్రాలతో తవ్వేస్తూ కమ్మపాలెం, జంగాలపల్లె, వెలుగుపల్లె గ్రామాల్లో సంపదను కొల్లగొట్టారు. కుంటలను తలపించేలా భారీ గోతులు పెట్టారు. ట్రాక్టర్లు,



టిప్పర్లు, లారీలతో ఇతర రాష్ట్రాలకు కూడా తరలించి ఇనప్పెట్టెలు నింపుకొన్నారు. కమ్మపాలెం శ్మశానాన్నీ వదలకుండా తవ్వేశారు.

కొనసాగుతున్న అక్రమాలు: వైకాపా నేతలు మొదలు పెట్టిన అక్రమాలను ప్రభుత్వం మారినా కొందరు కూటమి నేతలు కొనసాగిస్తున్నారు. ఒంటిమిట్ట మండలం గొల్లపల్లెలో గత ఏడాది క్వారీ పేరుతో యంత్రాలతో తవ్వకాలు ప్రారంభించారు. సమీపంలోని జంగాలపల్లెలోకి చొరబడి తవ్వేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. సమీపంలో ఉన్న సిద్దవటం ప్రాంతంలోకి కూడా ప్రవేశించే ప్రయత్నాలు చేస్తున్నారు. తవ్వకాలతో ఇప్పటికే పలుమార్లు తాగునీటి పైపులైను ధ్వంసమయ్యాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఎవరికీ పట్టడం లేదు. ఈ విషయమై సిద్దవటం తహసీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ.. సర్వే చేసి గొల్లపల్లె పరిధిలోనే తవ్వకాలు సాగించేలా గతంలో చర్యలు తీసుకున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని.. జంగాలపల్లె పరిధిలోకి వచ్చి తవ్వకాలు చేపడుతున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నిర్లక్ష్యంలో లాకు.. నిధులకు సాకు



ఆత్రేయపురం : జిల్లాకు సాగు, తాగునీటి సరఫరాలో కీలకమైన లొల్ల, బ్యాంక్ కెనాల్ లాకుల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. 1883లో బ్రిటిషు కాలంలో ఆత్రేయపురం మండలంలో నిర్మితమైన ఈ కట్టడాలు ప్రమాదకరంగా మారాయి. గతంలో వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వీటిని పరిశీలించి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కనీసం పట్టించుకోలేదు.

**తాగు, సాగునీటికి కీలకం**

లొల్ల లాకుల నుంచి జిల్లాలోని 16 మండలాలకు చెందిన సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీరందుతోంది. నిత్యం 2 వేల నుంచి 3 వేల క్యూసెక్కుల సాగునీరు ప్రవహిస్తోంది. కాలువల ద్వారా సరకు రవాణా చేసేందుకు నిర్మించిన లాక్ ఛాంబర్ వ్యవస్థ దెబ్బతింది. పది సంవత్సరాల క్రితం వరకు జలరవాణా సజావుగా సాగేది. కాలువలు పూడిపోయి కుచించుకుపోయాయి. వీటికి సమీపంలో రహదారులపై నిర్మించిన వంతెనలు కూడా దెబ్బతిన్నాయి.

**కూటమి హయాంలో..**

కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లొల్ల, బ్యాంక్ కెనాల్ లాకులపై అసెంబ్లీలో ప్రస్తావించారు. అనంతరం నిధులు మంజూరు చేయించాలని నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి విజ్ఞప్తి చేశారు. సుమారు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.

**ప్రతిపాదనలు వెళ్లాయి**లొల్ల లాకుల వ్యవస్థ ఆధునికీకరణకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరు కాలేదు. సాగునీటి సరఫరాకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నాం. వేసవిలో కాలువల కట్టుబడి సమయంలో నిర్వహణ పనులు చేస్తాం. సాయిమాధవ ప్రసన్న, జలవనరులశాఖ ఏఈఈ

# అ'ధనం'.. అనధికారం..!




చిత్తూరు : తిరుపతి జిల్లా రేణిగుంటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తూ సస్పెన్షన్‌కు గురైన ఆఫీస్ సబార్డినేట్ తిరుమలేష్ సుమారు రూ.50 కోట్ల వరకు ఆస్తులు కూడబెట్టినట్లు అవినీతి నిరోధక శాఖ (అనిశా) గుర్తించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఓ కింది స్థాయి ఉద్యోగే అన్ని కోట్లు సంపాదిస్తే.. పైస్థాయిలో ఇంకెంతో అనే చర్చ జరుగుతోంది. చాలావరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డబ్బులు ముట్టజెప్పందే పనులు కావనేది బహిరంగ రహస్యమే. జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**ఫిర్యాదులు వస్తున్నా..**నకిలీ పత్రాలు సృష్టించి భూముల్ని రిజిస్ట్రేషన్ చేసిన ఘటన నాలుగేళ్ల క్రితం వెలుగుచూసింది. ఈ ఉదంతంలో ఉద్యోగులు, దస్తావేజు లేఖరుల పాత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. అప్పట్లో ఓ సబ్ రిజిస్ట్రార్ సైతం సస్పెన్షన్ గురయ్యారు. తిరుపతి జిల్లాలోనూ అక్రమ రిజిస్ట్రేషన్లపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనిశా ఆకస్మిక తనిఖీల సమయంలో.. కార్యాలయంలో చెత్తడబ్బాల్లో, టేబుల్ కింద నోట్ల కట్టలు బయటపడుతున్నాయి. క్రయవిక్రయదారులు, సాక్షులు కాకుండా కార్యాలయంలో అనధికార వ్యక్తులు ఉండటం, వారి వద్ద నగదు లభ్యమవుతుండటం పరిపాటైపోయింది.

**సంస్కరణలు తెచ్చినా**

స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో మధ్యవర్తులు లేకుండా పనికావడం గగనమే. ఈసీ కావాలన్నా, నకలు అవసరమైనా.. వివాహ, స్థిరాస్తుల్ని రిజిస్ట్రేషన్ చేయాలన్నా దస్తావేజు లేఖరుల్ని ఆశ్రయించాల్సిందే. ప్రజలే స్వయంగా దస్తావేజు సిద్ధం చేసుకోవచ్చని 'పబ్లిక్ డాక్యుమెంట్ ఎంట్రీ' విధానం తెచ్చారు. కోరుకున్న సమయంలో రిజిస్ట్రేషన్‌కు సమయాన్ని ఎంచుకోవచ్చని 'స్లాట్ బుకింగ్' విధానం అమలు చేస్తున్నారు. దస్తావేజు తయారీ భాష ప్రజలకు అర్థం కాదు. దస్తావేజుల్ని సిద్ధం చేసుకోలేరు. చివరికి వారి సాయం లేకుండా డాక్యుమెంట్ సిద్ధంకాదు.. అ'ధనం' ఇచ్చుకోకుంటే పని జరగదనే..! వాదన ఇప్పటికీ నాటుకుపోతోంది. ఉమ్మడి జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. పర్యవేక్షణకు జిల్లా రిజిస్ట్రారు ఉన్నారు. డీఐజీ స్థాయి అధికారి రెండు జిల్లాల్ని పర్యవేక్షిస్తారు. వీరితోపాటు ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ ప్రత్యేకంగా ఉంటారు. ఆడిట్ డీఆర్‌లు.. మూడు నెలలకోసారి దస్తావేజులన్నింటినీ తనిఖీ చేస్తారు. పనిభారంతో పర్యవేక్షణ, పాలనాపరమైన లోపాలతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. హెల్ప్ డెస్కులను పటిష్ఠంగా అమలు చేసి.. లేఖరుల అవసరం లేకుండా చేసినప్పుడే అవినీతికి అడ్డుకట వేయొచ్చు.

# రెప్పపాటులో.. బురిడీ



హిందూపురం : నిరక్షరాస్యులైన హిందూపురం గ్రామీణ మండలం కొటిపికి చెందిన గంగరత్నమ్మ సంఘం డబ్బు బ్యాంకులో జమ చేయటానికి వస్తే గుర్తుతెలియని వ్యక్తి మహిళా సంఘం ఖాతా స్థానంలో తన ఖాతా నంబరు వేసి బురిడీ కొట్టించిన ఘటన శుక్రవారం హిందూపురంలోని ధనలక్ష్మి రోడ్‌లో ఉన్న ఎస్‌బీఐ శాఖ వద్ద చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. రూ.50 వేలు సంఘం ఖాతాలో జమ చేయటానికి శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు వచ్చింది. చదువు రాకపోవటంతో బ్యాంకు వద్ద ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఫారం భర్తీ చేయాలని కోరి సంఘం నంబరు చెప్పింది. అతను తనకు తెలియకుండా సంఘం ఖాతా స్థానంలో అతని వ్యక్తిగత ఖాతానంబరు వేసి రూ.50 వేలు జమ చేసుకొన్నారు. కొంత సమయం తర్వాత ఈ విషయం బయటపడటంతో బాధితురాలు తోటి సంఘం సభ్యులకు తెలియజేసింది. వారు వెంటనే బ్యాంకు వద్దకు చేరుకొని జరిగిన మోసం గురించి బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలిస్తామన్నారు. మహిళను బురిడీ కొట్టించిన వ్యక్తి తన ఖాతాలోకి మళ్లించుకొన్న నిధులు మహిళా సంఘాల ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణ రెండో పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై జయమ్మకు మహిళలు ఫిర్యాదు చేశారు.

**మాయగాళ్లున్నారు..**

పొదుపు మహిళలు తమ సొమ్మును జాగ్రత్తగా జమ చేయాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి..

చెల్లింపు సమయంలో కచ్చితంగా ఎవరో ఒకరు విద్యావంతులు వెళ్లాలి.

అకౌంట్ నంబరు పూరించేటప్పుడు చూడాల్సిందే.

మహిళలకు అన్ని అంశాల్లో అవగాహన కల్పించడానికి 3,465 మంది ఈ-నారీలు ఉన్నారు. బ్యాంకుల్లో వారి సహకారం తీసుకోవచ్చు.

మన డబ్బులు, మన లెక్కలు యాప్‌తో పాటు సొమ్ము చెల్లించే సమయంలో సభ్యురాలు సొంత ఫోన్‌పే ద్వారా చెల్లించవచ్చు.

బ్యాంకుల్లో అప్పు చెల్లించడానికి వెళ్లే సమయంలో బ్యాంకు స్లిప్పులు ఇంట్లోనే రాసుకొని వెళితే మరింత ప్రయోజనం ఉంటుంది.

డీఆర్‌డీఏ పీడీ శైలజ, అదనపు ప్రాజెక్టు సంచాలకురాలు రాధారాణి

# పండుగప్ప ధర అదరహో..

ఉప్పలగుప్తం: గత మూడేళ్లుగా జిల్లావ్యాప్తంగా పండుగప్ప సాగు పెరుగుతోంది. తెల్లచేపల సాగులో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్న రైతులు వీటిపై మొగ్గు చూపుతున్నారు. అంతర్వేది, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు, కాకినాడ తీర ప్రాంతాల్లో సాగు కనిపిస్తోంది. ఈ చేపలకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉంది. ఉప్పు, పంటకాలువ జలాల్లో రైతులు పెంచుతున్నారు. ఏడాది నుంచి 18 నెలల కాలంలో కేజీ నుంచి ఐదు కేజీల వరకు పెరుగుతున్నాయి. తీరప్రాంతంలో సుమారు 4 వేల ఎకరాల్లో ఈ సాగు విస్తరించింది.

ధర కేజీ రూ.550 ఆరు నెలల క్రితం కేజీ రూ.330కి పడిపోవడంతో రైతులు దిగాలు చెందారు. నెల రోజులుగా రూ.550 పలకడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం, ఇతర ప్రాంతాల్లో కేజీ రూ.600 వరకు కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. వేట నిషేధకాలం ఏప్రిల్‌లో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ధర లాభసాటిగా ఉందని సామంతకుర్రుకు చెందిన రైతు కొపనాతి ఆంజనేయులు తెలిపారు.

# కబ్జాకు అడ్డేవరు.. కలిపేస్తే అడిగేదెవరు

ఏలూరు : ఓ స్థిరాస్తి వ్యాపారి ఏలూరు నుంచి కొత్తూరుకెళ్లే రోడ్డులో సుమారు 18 ఎకరాల్లో ప్లాట్లు వేశారు. కొత్తూరుకు అవతల వైపునున్న బూరాయిగూడేనికెళ్లే దారిలో సుమారు మూడెకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ, రోడ్లు, డివైడర్లు నిర్మించారు. ఇక్కడ ఎకరా రూ.1.50 కోట్లు పలుకుతోంది. కళ్లెదుటే రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తమ్మిలేరు అంచులను కొందరు ఆక్రమించేస్తున్నారు. భవనాలు నిర్మిస్తుండటంతో పాటు సిమెంటు ఇటుకలు, వరలు, కిటికీలు, గుమ్మాలు తదితర తయారీ ఖార్కానాలు నిర్వహిస్తున్నారు. కొందరు వ్యవసాయం చేస్తున్నారు. ఈ తంతంతా అధికారులకు తెలిసినా, చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

జిల్లా కేంద్రం ఏలూరు నగర శివారుల్లో స్థిరాస్తి వ్యాపారుల దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. పంట కాలువలు, రహదారులు, దేవాదాయ, ర.భ.శా. భూములనూ వదలడం లేదు. చొదిమెళ్ల నుంచి నగర శివారు వరకు పెద్దఎత్తున భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. రూ.కోట్లు విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా.. అధికారులు తమకేమీ



పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**సామాజిక స్థలాల్నీ వదలక..**

వెంకటాపురం పరిధి హనుమాన్‌నగర్ లేఅవుట్లలో ప్రభుత్వానికి వదిలిన 10 శాతం సామాజిక స్థలాలను సైతం అక్రమార్కులు వదల్లేదు. గతంలో పలు పదవులు చేపట్టిన ఓ రాజకీయ నాయకుడు సామాజిక స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం గమనార్హం. దీనిపై కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత శివారు గ్రామాలు నగరపాలక సంస్థలో విలీనం కావడంతో.. అధికారులు కన్నెత్తి చూడటం లేదు. 'అధికారులతో పరిశీలన చేయిస్తాం. ఆక్రమణలుంటే వాటిని స్వాధీనం చేసుకుంటాం. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం' అని జలవనరుల శాఖ ఎస్‌ఈ సీహెచ్ దేవప్రకాశ్, ఏలూరు అర్బన్ తహసీల్దారు గాయత్రి తెలిపారు.

# నిలిచిన పనులు.. భక్తులకు ఇక్కట్లు

మార్కాపురం : నాలుగు యుగాల దేవుని పురంగా ప్రసిద్ధి గాంచిన మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధిపై ఇటు పాలకులు, అటు అధికార యంత్రాంగం శీతకన్ను వేయడంతో పరిస్థితి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**2022లో ప్రారంభించినా..**

చెన్నకేశవస్వామి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి గత ప్రభుత్వం 2022 డిసెంబర్‌లో మార్కాపురం పట్టణంలోని మాఢ వీధులకు అనుగుణంగా ఆలయానికి కొత్త రూపురేఖలు తెచ్చే విధంగా నాలుగు ప్రాకార గోపురాలు నిర్మించేందుకు పనులు చేపట్టారు. గోపురాలతో పాటు గోదాదేవి, రంగనాయకస్వామి, ఆంజనేయస్వామి, బేరి మండపం, చుట్టూ ప్రహరి నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందుకు గాను తిరుపతి, పెద్దాపురం ప్రాంతాలకు చెదిన గుత్తేదారులతో 7.60కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటిలో రూ.2కోట్లు దేవాదాయశాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి నాలుగు గోపురాల ప్రధాన పనులు పూర్తి చేశారు. ఇందుకు గాను 5.19కోట్లు గుత్తేదారులకు చెల్లించారు.

**6నెలల్లో పూర్తికావాల్సి ఉన్నా...**

వాస్తవంగా ఈ పనులు 2023చివరి నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా ఎంచుకున్నారు. అయితే ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు కొంత ఆలస్యం కావడం, పాలకవర్గ సమయం ముగియడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆలయ అభివృద్ధి పనులపై దృష్టి సారించలేదు. భక్తులకు సౌకర్యాలకు అనుగుణంగా తలనీలాలు, స్నానపుగదులు, మరుగుదొడ్లు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది.

**ప్రాచీన ఆలయం...**మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి 600సంవత్సరాల చరిత్ర ఉంది. 1425వ సంవత్సరంలో విజయనగర పాలకులు ఈ ఆలయ నిర్మాణానికి బీజం వేశారు. ప్రధాన ద్వారం వద్ద 9అంతస్తులతో 130 అడుగుల గాలిగోపురం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ప్రసిద్ధి.

# వెన్నెముక సరిచేసి.. ఆయువు పోసి

కర్నూలు : కల్లూరు మండలం వామసముద్రానికి చెందిన చిన్నారి అనే యువతి తీవ్రమైన తలనొప్పితోపాటు వెన్నెముక వంకరతో నడవలేక ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు 2019లో తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడి వైద్యులు వివిధ పరీక్షలు చేసి మెదడులో ఉన్న లోపానికి శస్త్రచికిత్స చేశారు. తలనొప్పి తగ్గినా వెన్నెముక సమస్య అలానే ఉండిపోయింది. మరోసారి స్విమ్స్‌కు వెళ్లి వైద్యులను సంప్రదించగా.. శస్త్రచికిత్స చేస్తే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని.. లేదా శాశ్వత దివ్యాంగురాలయ్యే అవకాశముందని చెప్పడంతో




వెనక్కి వచ్చేశారు. ఇటీవల ఆమెకు తలనొప్పి ఎక్కువవడం.. నడక సాగించడంలో ఇబ్బందులు పడుతుండటంతో తల్లిదండ్రులు గత నెలలో కర్నూలులోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అనస్థీషియా వైద్యురాలు శ్రుతి, క్రిటికల్ కేర్ వైద్యుడు రాజేష్‌తోపాటు వైద్య బృందం కలిసి గత నెల 26వ తేదీన 5 గంటలకుపైగా శ్రమించి శస్త్రచికిత్స చేసి వంకరపోయిన వెన్నెముకను 90 శాతం వరకు సరిచేసింది. ఎన్టీఆర్ వైద్యసేవల కింద ఆపరేషన్ ఉచితంగా చేశారు. ఈ వివరాలను ఆర్థోపెడిక్ వైద్యుడు కిరణ్‌కుమార్, రీజనల్ సీవోవో సిద్ధారెడ్డి, డా.శ్రుతి, డా. షేక్.మున్నన్ వెల్లడించారు.

# కలల వారధి.. ఎప్పటికి సాకారమయ్యేది!

రామచంద్రపురం : దశాబ్దాలుగా రామచంద్రపురం, అమలాపురం నియోజకవర్గాల ప్రజలు ఎదురుచూస్తున్న గౌతమీ గోదావరి నదిపై కోటిపల్లి–ముక్తేశ్వరం మధ్య వంతెన నేటికీ సాకారం కాలేదు. 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.210 కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదించింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ వంతెన నిర్మిస్తామని.. రామచంద్రపురం నియోజకవర్గానికి జిల్లా కేంద్రం అమలాపురం దగ్గరవుతుందని హామీ ఇచ్చింది. ఆ తర్వాత చేతులెత్తేసింది. దీంతో ఇక్కడి ప్రజలు అమలాపురం చేరుకోవాలంటే చుట్టూ తిరిగి అటు యానాం లేదా రావులపాలెం మీదుగా వెళ్లాలి. లేకుంటే కోటిపల్లి–ముక్తేశ్వరం మధ్య రేవులో పంటు ప్రయాణం చేయాల్సిందే... భారీ వాహనాలు పంటు దాటే అవకాశం లేదు. వివాహాది శుభకార్యాలకు బస్సులపై బంధువులు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తే అటు ముమ్మిడివరం, ఇటు రావులపాలెం మీదుగా 65–



75 కి.మీ. ప్రయాణం తప్పదు. ఇక గోదావరికి వరదలొస్తే రేవు ప్రయాణమే ఉండదు.. దీంతో ఏడాదిలో 3 నుంచి 4 నెలలు అమలాపురం వెళ్లేందుకు అవస్థలు పడాల్సిందే.

**ప్రతిపాదనలు రూపొందించి..** వంతెన నిర్మాణంపై అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్‌తో కలిసి మంత్రి సుభాష్ ఆ మధ్య కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు సమగ్ర నివేదిక(డీపీఆర్) తయారుచేయాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలందాయి. ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు, ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ దీనిని తయారుచేశారు. 6.5 కి.మీ. పొడవున నిర్మాణానికి రూ.490కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. కిలోమీటర్‌కు రూ.75కోట్లు అవుతుందని అంచనా. దీనికి సంబంధించి కదలిక రావాల్సి ఉంది. మరోవైపు వంతెన కోసం రామచంద్రపురం నుంచి 'వారధి సాధన సమితి' బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పడింది. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించింది.

# ఇంకెప్పుడు ఇస్తారు?

అమరావతి : వ్యవసాయంలో యంత్ర పరికరాలు అత్యంత కీలకం. విత్తన వేయడం మొదలు.. నూర్పిడి వరకు సాగులో ప్రతి దశలోనూ వాటి అవసరం ఉంది. కూలీల కొరత అధిగమించాలంటే అవి అందుబాటులో ఉండాలి. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీ ఇచ్చి పరికరాల కొనుగోలును ప్రోత్సహిస్తున్నాయి. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా జమ చేసి ఏటా రూ.వందల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. నాగళ్ల నుంచి ట్రాక్టర్ల వరకు అనేక పరికరాలను రైతులకు 40 నుంచి 60 శాతం వరకు రాయితీపై ఇస్తోంది. ఏటా ఖరీఫ్ సమయంలో దరఖాస్తు చేసుకుంటే వీటిని అందించేవారు. ఈసారి రబీ తుది దశకు వస్తున్నా.. ఇప్పటికీ రైతులకు చేరలేదు. ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించినా.. సాంకేతిక సమస్యలు, ఇతరత్రా కారణాలతో పథకాన్ని పట్టాలెక్కించలేదు. ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు రాలేదని జిల్లాస్థాయి అధికారులు రైతులకు సర్దిచెబుతున్నారు. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

**తగ్గిన కేటాయింపు...**

గతంలో ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.30 కోట్లకుపైగా నిధులు కేటాయించేవారు. జిల్లాల విభజన తరువాత ఈ మొత్తం రూ.10 కోట్లకు పరిమితమైంది. గుంటూరు జిల్లాలో గతేడాది రూ.5.69 కోట్ల విలువైన 1,331 పరికరాలను రైతులకు అందించారు. ఇందులో ప్రభుత్వ రాయితీ రూ.2.29 కోట్లు. రోటవేటర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు,



పవర్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, బ్రష్‌కట్టర్లు, పవర్ టిల్లర్లు, ట్రాక్టర్‌తో నడిచే యంత్ర పరికరాలు అందించారు.

**ఇలా అయితే ఎలా...**

సకాలంలో మార్గదర్శకాలు ఇవ్వకపోవడం వల్ల లక్ష్యాలు నెరవేరడం లేదు. బహిరంగ మార్కెట్లో వందశాతం సొమ్ము వెచ్చించి రైతులు కొనే పరిస్థితి లేదు. అటు ప్రభుత్వం ఇవ్వకపోయేసరికి మార్కెట్లో వ్యాపారులు ధరలు పెంచేశారు. చిన్న, సన్నకారు రైతులు వందశాతం ధర చెల్లించి కొనుగోలు చేయలేక అద్దె యంత్రాలపై ఆధారపడుతున్నారు. అవీ సకాలంలో లభించక పనులు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి. రబీ సీజన్‌లో పంటలకు ఎరువులు, మందుల పిచికారీకి పరికరాలు అవసరమవుతున్నాయి. బహిరంగమార్కెట్‌లో పిచికారీ యంత్రం కోసం రూ.20 వేలకుపైగా వెచ్చించాల్సి వస్తోంది.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కనీసం పిచికారీ యంత్రాలనైనా రాయితీపై ఇస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని కోరుతున్నారు.

# అనుసంధాన మంత్రం.. సులువుగా పుణ్యస్నానం



రాజహేంద్రవరం : కుంభమేళా తరహాలో వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ఇటీవల అత్యున్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంతి ఆదేశించారు. ఆ దిశగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. రద్దీ నియంత్రణ, ఒకే స్నానఘట్టానికి భక్తులంతా పోటెత్తకుండా అన్ని రేవులను అనుసంధానం చేయాలని నిర్ణయించారు. తద్వారా సులువుగా పుణ్యస్నానాలు చేసేందుకు వీలుంటుంది. ప్రధానంగా రాజమహేంద్రవరం పుష్కరాలరేవు, కోటిలింగాల ఘాట్, కొవ్వూరు గోష్పద క్షేత్రాలకు ఎక్కువమంది ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే 1.2 కి.మీ మేర ఉన్న కోటిలింగాల రేవును పుష్కరాల రేవుతో అనుసంధానం చేసి దాదాపు 2.5 కి.మీ పొడవున విస్తరించనున్నారు. నగరంలోని సరస్వతీ, గౌతమ ఘాట్‌లను 1.2 కి.మీ మేర.. గోష్పద క్షేత్రం పరిధిలోని ఘాట్లన్నింటినీ అనుసంధానం చేసి మరో 1.2 కి.మీ. మేర స్నానఘట్టాలు ఏర్పాటు చేస్తారు. కాతేరు పరిధిలో 100, 200 మీటర్ల పొడవున రూ.4.75 కోట్లతో రెండు రేవులు ఏర్పాటుచేస్తారు. 200 మీటర్ల రేవును ప్రముఖులకు (వీఐపీ) కేటాయిస్తారు.

బొబ్బిల్లంక, తొర్రేడు, జాలిమూడి, కాటవరం, ఇనుగంటివారిపేట, సీతానగరం, రఘుదేవపురం, సింగవరం, వంగలపూడి, కొవ్వూరు, ఔరంగాబాద్, అరికిరేవుల, కుమారదేవం, తాడిపూడి, వశిష్ఠ నదిపై 5 చోట్ల 21 కొత్త ఘాట్‌లు వస్తాయి. రూ.29.76 కోట్లతో 828 మీటర్ల మేర నిర్మిస్తారు.

**రూ.204.24 కోట్లతో ప్రతిపాదనలు**

రాజమహేంద్రవరం, కొవ్వూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 102 ఘాట్‌లు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో దాదాపు 24 కొత్త స్నానఘట్టాలు నిర్మిస్తారు. పాత ఘాట్‌ల మరమ్మతులు, విస్తరణ, కొత్త నిర్మాణాలకు రూ.204.24 కోట్లు అవసరమని జలవనరుల శాఖ ప్రతిపాదించింది.

**గత పుష్కరాలకన్నా మూడు రెట్లు అధికం..**

తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఇప్పటికే 2.68 కి.మీ మేర ఘాట్‌లు ఉండగా, 2.84 కి.మీ అదనంగా విస్తరించడంతోపాటు మరో 828 మీటర్లు కొత్తగా నిర్మిస్తారు. తద్వారా 6.35 కి.మీ అందుబాటులోకి వచ్చినట్లవుతుంది. గత పుష్కరాలకన్నా మూడు రెట్లు అదనం. 10 కోట్ల మంది భక్తులు వస్తారన్న అంచనాల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రచిస్తున్నారు.

ప్రతిపాదనలిలా... (రూ.కోట్లలో)

| | |
|---|---|
| పాత ఘాట్‌ల మరమ్మతులకు | 59.53 |
| విస్తరణ, అనుసంధానం | 115 |
| కొత్త రేవుల నిర్మాణం | 29.76 |

# నదీ కోత.. తీరని వెత



రావులపాలెం : లంకభూముల్లో రైతులు ఎన్నో ఏళ్లుగా పంటలను పండించి విక్రయించుకుని జీవనం సాగిస్తున్నారు. కొందరు స్వార్థం కోసం చేస్తున్న పనులు కారణంగా విలువైన లంక భూములు కోతకు గురవుతున్నాయి. వీటికి ప్రధాన కారణం ఆప్రాంతాల్లో మట్టి తవ్వకాలు జరపడమే. వీటివల్ల నీటి ప్రవాహం వేగంగా మారి దిశ మార్చుకుని లంక భూములు కోతకు గురవుతున్నాయి.

**అత్యధికంగా ఇక్కడే..**

బొబ్బర్లంక నుంచి పేరవరం, వాడపల్లి, ఊబలంక, కొమరాజులంక, మందపల్లి, నారాయణలంక, కేదార్లంక, అయినవిల్లి, సానపల్లిలంక, మురమళ్ల బలుసుతిప్పి, రాజవరం, పులిదిండి, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, గోపాలపురం, బూరుగులంక, రాజోలు, సఖినేటిపల్లి మలికిపురం తదితర ప్రాంతాల్లో లంక భూముల కోత ఎక్కువగా ఉంది. గోదావరి వరద వచ్చిన ప్రతిసారి వందల ఎకరాలు గోదావరిలో కలిసిపోతున్నాయి. అత్యధికంగా కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 1500 ఎకరాలు వరకు భూమి కోతకు గురైంది. వీటి విలువ రూ.100 కోట్ల పైమాటే.

**ప్రతిపాదనలతోనే సరి**

బొబ్బర్లంక, పులిదిండి, గోపాలపురం, లక్ష్మీపోలవరం, కొమరాజులంక, రాజోలు తదితర ప్రాంతాల్లో రాతి కట్టడం నిర్మాణాలకు సుమారుగా రూ.200 కోట్లపైనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. మంజూరు కావాల్సి ఉంది.

**ఇబ్బందులు లేకుండా చర్యలు**

ఏఏ ప్రాంతాల్లో గోదావరిలో భూములు కలిసిపోతున్నాయో గుర్తించాం. రాతి కట్టడాలు కట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించి నివేదించాం. లంకప్రాంతాల్లో మట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తున్నాం. ఎవరైనా మట్టి తవ్వకాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రసాద్, హెడ్‌వర్క్సు ఏఈ

# భీమేశ్వరా.. సౌకర్యాలు ఏవయ్యా



సామర్లకోట : పంచారామాల్లో ప్రసిద్ధి చెందిన ఆలయం సామర్లకోట చాళుక్య కుమారరామా భీమేశ్వరాలయం. యోగలింగమూర్తి కావడంతో స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. మహాశివరాత్రి పర్వదినం సమయంలో మొత్తం పరిసరాలు కిక్కిరిపోతాయి. ఈ ఆలయం పురావస్తు శాఖ ఆధీనంలో ఉండటంతో అభివృద్ధికి ఆమడ దూరంగా ఉంది. ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి అనేక మంది దాతలు ముందుకు వస్తున్నా పురావస్తు శాఖ అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో భక్తులకు సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్నాయి.

**అనుమతులు ఇవ్వకపోవడంతో..**

భీమేశ్వరాలయంలో ఏ చిన్న అభివృద్ధి చేయాలన్నా పురావస్తు శాఖ నుంచి అనుమతులు ఇవ్వకపోవడంతో పూర్వం నిర్మించిన ఆలయం అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయింది. ఆలయ ప్రాకారం లోపలి గర్భాలయం చుట్టూ పూర్వం నిర్మించిన ఫ్లోరింగ్ అక్కడక్కడా కుంగిపోవడం, పలు చోట్ల ఎత్తు పల్లాలుగా ఉంది. దీంతో అక్కడ ప్రదక్షణ చేసే భక్తులు రాళ్లు తన్నుకుని పడిపోతున్నారు. ఆలయంలో విద్యుత్తు వైర్లు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. కెనాల్ రోడ్డులోనుంచి ఆలయానికి వెళ్లే రోడ్డు శిథిలమై ప్రమాదభరితంగా మారింది. ఆలయ కోనేరు అభివృద్ధి చేసి స్వచ్ఛమైన నీటితోనింపాలని కోరుతున్నారు. గోదావరి కాలువలోని జలాలు కలుషితం కావడం ఆ జలాల్లోనే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడం జరుగుతోంది. ఆలయానికి ఆదాయాన్ని పెంచేందుకు ఆవరణలో షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి, అన్నదానట్రస్టు ద్వారా భక్తులకు ఉచితంగా అందజేస్తున్న భోజనశాల నిర్మాణానికి ఎంతో కాలంగా అనుమతులకోసం ఎదురు చూస్తున్నారు.

**భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు**

భీమేశ్వరాలయంలో భక్తులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఆలయ ఆవరణలో ఫ్లోరింగ్ నూతనంగా నిర్మించేందుకు చర్యలు తీసుకున్నాం. పనులు చేయడానికి సుమారు 6 నెలలు పడుతోంది. మహాశివరాత్రి ఉత్సవాలు అనంతరం పనులు మొదలు పెడతాం. లైటింగ్, వైరింగ్‌కి అనుమతులు ఇస్తాం. ఆలయ వద్ద దుకాణాలు, అన్నదాన భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులకు అనుమతుల నిమిత్తం నివేదిక పంపాం. మూర్తి, సెంట్రల్ ఆర్కియాలజీ సీఏ కాకినాడ

# దాటాలంటే దడ!

మచిలీపట్నం : సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం వద్ద రోజూ వందల మంది విద్యార్థులు డివైడర్‌పై నుంచి దూకుతూ రోడ్డు దాటుతున్నారు. కాలి నడక వంతెన ఉన్నా చుట్టూ ఫ్లెక్సీలతో మార్గం మొత్తం చీకటిగా మార్చేశారు. వంతెనపై కొందరు మద్యం తాగుతూ కూర్చుంటున్నారు. దీంతో విద్యార్థులు, విద్యార్థినులు అటువైపు వెళ్లడానికి సాహసించడం లేదు. ఈడుపుగళ్లు, పెనమలూరు వంతెనల వద్దా ఇదే పరిస్థితి ఉంది. జాతీయ రహదారి కావడం, వాహనాలు వేగంగా దూసుకొచ్చి పాదచారులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలు ఉన్నాయి. మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారి 65పై నిత్యం వాహనాల రద్దీ ఉండడంతో పాదచారులు రోడ్డు దాటేందుకు నిర్మించిన వంతెనలు ఆక్రమణకు గురయ్యాయి. వంతెనలకు ఇరువైపులా వ్యాపార, రాజకీయ బ్యానర్లు కట్టేస్తున్నారు. నెలల తరబడి అలాగే ఉంటున్నాయి. ఫ్లెక్సీల ద్వారా లోపల నుంచి బయట ఏం కనిపించదు. బయట నుంచి చూస్తే బ్యానర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో దొంగలు, గంజాయి, మందుబాబులకు ఈ వంతెనలు అడ్డాగా మారాయి. వీటిని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా చేసుకున్నారు.

**ఇక్కడ ఇలా..**

ఈడుపుగల్లు, పెనమలూరు, కానూరులోని సిద్ధార్థ కళాశాల, బెంజ్‌సర్కిల్ వద్ద రోడ్డు దాటేందుకు వీలుగా ఈ వంతెనలు నిర్మించారు.



ఆక్రమణలు పెరిగిపోవడంతో వాటిపై నుంచి రోడ్డు దాటాలంటేనే మహిళలు, విద్యార్థులు, ఒంటరిగా ఎవరూ వెళ్లలేని పరిస్థితి. మెట్లపైనా పలు దుకాణాలు, వ్యాపారుల సామగ్రి నింపేశారు. రెండు వైపులా వాహనాలు అడ్డుగా పెట్టడమో.. చెత్తతో నింపేయడంతో రోడ్డు దాటాలంటే సాహసం చేయాల్సిందే. ప్రజలు, విద్యార్థులు ఎంత ఇబ్బంది పడుతున్నా సంబంధిత శాఖాధికారులు ఫ్లెక్సీల ఏర్పాటు, మందుబాబుల ఆగడాలపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు..**

రోడ్డు భద్రతా సమీక్షలో పలువురు అధికారులు వంతెనల ఆక్రమణపై కలెక్టర్ బాలాజీ దృష్టికి తెచ్చారు. విద్యార్థుల ఇబ్బందులను తెలియజేశారు. ఆక్రమణలను పట్టించుకోకపోవడం.. ఆకతాయిలకు అడ్డాగా మారినా నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫ్లెక్సీలు, బ్యానర్లు ఇతర ఆక్రమణలు తొలగించి.. సీసీ కెమెరాలు, లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే సరహించేది లేదని హెచ్చరించారు.

# తోడేళ్లకు తోడై.. ఊరోళ్లకు కీడై

మచిలీపట్నం : 'ఇసుకాసురుల ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. నేతల అండతో ఇష్టారాజ్యంగా కృష్ణా నదిలో తవ్వేసి ప్రకృతి వనరులు కొల్లగొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులకు నెల వారీగా మామూళ్లు అందుతుండటంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.' 'ప్రభుత్వ క్వారీలో తవ్వకాలకు అనుమతులు పొందిన వారు నిబంధనలకు పాతరేస్తున్నారు. తమ బలంతో అడ్డొచ్చిన వారిని తొక్కుకుంటూ నదిలో రోడ్లేసుకొని మరీ కన్పించిందంతా తరలించేస్తున్నారు. అనుమతించినచోట కాక ఎక్కడపడితే అక్కడ భారీ గుంతలు పెట్టి తవ్వేస్తున్నా జిల్లా యంత్రాంగానికి అక్రమాలు కనిపించడం లేదు.'

**రాత్రీపగలు.. భారీ యంత్రాలు...**

చోడవరం, రొయ్యూరు, తోట్లవల్లూరు, అప్పారావుపేట, శ్రీకాకుళం తదితర చోట్ల ప్రభుత్వం ఇసుక రేవులకు అనుమతించింది. టెండర్లు దక్కించుకున్న వారు నిబంధనలకు విరుద్ధంగా తవ్వేస్తున్నారు. చిన్న యంత్రాలతో తవ్వకాలు చేయాల్సిన రేవుల్లో భారీ యంత్రాలతో రేయింబవళ్లు తవ్వేస్తున్నారు. నదిలో ఎటు చూసినా పదుల అడుగుల లోతున భారీ గుంతలే దర్శనమిస్తున్నాయి. ఎంత విస్తీర్ణం.. ఎంత లోతు తవ్వాలో అధికారులకే స్పష్టత లేదు. చేతులు తడిపితే చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. పరిమితికి మించి భారీ టిప్పర్లలో లోడ్ వేసుకెళ్తూ గ్రామీణ దారులను ధ్వంసం చేస్తున్నా పట్టించుకోవట్లేదు.

**బుసకనూ వదలరే...**

రొయ్యూరు క్వారీలో రాత్రీ పగలు యంత్రాలు ఆగట్లేదు. అధికార



పార్టీ నాయకుల కనుసన్నల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. క్వారీ వద్దకు ఎవరూ రాకుండా అడ్డుపడుతున్నారు. పక్కనే పొలాల్లో బుసకనూ తవ్వేస్తున్నారు. అక్రమాలపై ప్రశ్నించిన వారితో నిర్వాహకులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఎవరినీ రానివ్వట్లేదు. ప్రశ్నిస్తే బెదిరింపులు... దాడులకు పాల్పడుతున్నారు. 'అధికారులకు చెబితే మేం పారిపోవాలా? అందరికీ అడిగినంత ఇస్తున్నాం. ఎవరికీ భయపడేది లేదని' నిర్వాహకులు రెచ్చిపోతున్నారు.

**25 హెక్టార్లకే అనుమతిచ్చాం....**

రొయ్యూరు క్వారీ అక్రమాలపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా '25 హెక్టార్లు ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చాం. మిగిలిన చోట ఇసుక, బుసక తవ్వకాలు చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# తప్పులు ఆపలేదు.. ముప్పు ఆగలేదు !

విశాఖపట్నం : సింహాచలం కొండపై దేవస్థాన బృహత్తర ప్రణాళికకు విరుద్ధంగా 'ప్రసాద్' పథకం పనులు సాగాయి. గత ప్రభుత్వ హయాంలో పథకం డీపీఆర్ కూడా ఇష్టారాజ్యంగా తయారు చేశారు. విషయం అప్పటి అధికారులకు తెలిసినా ఎవరూ నోరుమెద పలేదు. ఎక్కడెక్కడ ఎలా చేస్తున్నారో తనిఖీ చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ఇంజినీరింగ్ విభాగం వైఫల్యాన్ని గుర్తించలేకపోయారు. ఈ నిర్లక్ష్యం వల్లే గత ఏడాది చందనోత్సవం రోజున ఏడుగురు భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఈవోగా పనిచేసిన త్రినాథరావు పర్యవేక్షణ లోపం ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి... ఆయనపై అభియోగాలు నమోదు చేసి పది రోజుల్లో వివరణ కోరింది.

అభ్యంతరం తెలిపినా..: 'ప్రసాద్' పథకం నిధులతో చేస్తున్న పనులపై దేవాదాయశాఖ కొన్ని అభ్యంతరాలు తెలిపినా అప్పటి ఈవో పట్టించుకోలేదు. కొత్త ఘాట్ రోడ్డు వద్ద కాంప్లెక్సును మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించారు. కొండపై బస్సులు నిలిపే ప్రాంగణం వద్ద భక్తుల సౌకర్యార్థం ఓ సెంటర్ నిర్మించారు. దీంతో బస్సులు నిలపడానికి, భక్తులు వేచి ఉండేందుకు ఇబ్బందిగా మారింది. దీనిపై దేవాదాయశాఖ అభ్యంతరం తెలిపినా అక్కడే కొనసాగించారు.

పాత పుష్కరిణి సత్రం స్థానంలో అయిదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. దీనికీ పూర్తిస్థాయి అనుమతి లేదు. బస్ బేల నిర్మాణాలు, పర్యాటక సమాచార కేంద్రం, ఫుడ్ కోర్టులు మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా లేవు. గత ఏడాది ప్రమాదం తర్వాత పనులు నిలిపి మళ్లీ కొత్తగా టెండర్లు పిలిచి పనులు చేస్తున్నా బృహత్తర ప్రణాళికకు విరుద్ధంగానే ఉన్నాయనే విమర్శలొస్తున్నాయి.

అయిదుసార్లు పనిచేసినా: మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా పనులు జరగడంతోనే గత ఏడాది కొండపై రిటైనింగ్ వాల్ కూలిన ఘటనలో



ఏడుగురు భక్తులు మృతిచెందారని ప్రభుత్వం భావించింది. అప్పట్లో ఈవోగా చేసిన త్రినాథరావు పర్యవేక్షణ లోపం ఉన్నట్లు తేల్చింది. ఈయన గత వైకాపా ప్రభుత్వ హయాం నుంచి గత ఏడాది అక్టోబరు వరకు అయిదుసార్లు సింహాచలం ఈవోగా చేశారు. మొదటిగా 2020 సెప్టెంబరు 2 నుంచి 2021 జనవరి 22 వరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు. 2022 సెప్టెంబరు22 -2023 జూన్ 10; మళ్లీ 2023 జూన్ 28 - సెప్టెంబరు 17 వరకు చేశారు. ఆ తర్వాత 2024 సెప్టెంబరులో మళ్లీ బాధ్యతలు తీసుకొని 2025 ఫిబ్రవరి వరకు ఉండి మూడు నెలలు సెలవులో వెళ్లారు. అనంతరం గత ఏడాది మే 26న విధుల్లో చేరి అక్టోబరు 23 వరకు పని చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ భక్తులకు తీవ్ర అసౌకర్యం కలగడంపై నాడు జిల్లా అధికారులతో విచారణ చేయించారు. ఈవో త్రినాథరావు తప్పిదాన్ని గుర్తించి అప్పటి జేసీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అయినా ఆయనపై చర్యలు తీసుకోకుండా నాడు జాప్యం చేశారు.

# మొదలుకు ముందే ముగింపు

అనకాపల్లి : జిల్లాలో రబీలో సాగు ఇంకా పూర్తిస్థాయిలో చేపలేదు. ఖరీఫ్ పంట కోతదశలోనే ఉంది. ఇంతలోనే రబీ పంటలకు బీమా సమయం ముగిసిపోయింది. ఒక్క ఎకరాకు కూడా బీమా భరోసా లభించకముందే గడువు పూర్తయిపోయింది. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను (పంటల బీమా పథకం) రబీలో వరి, పెసర, మినుము పంటలకు అమలు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఇంకా వరికోతలు కోస్తున్నారు. కోతల అనంతరం రబీ వరి, అపరాల సాగు చేపడతారు. ఇంతవరకు కేవలం 15 శాతం వరి, 38 శాతం అపరాలు సాగు చేశారు. ప్రభుత్వం వరి పంటకు బీమా చేసేందుకు డిసెంబరు నెలాఖరు వరకు, మినుము, పెసరకు డిసెంబరు 15 వరకు సమయం ఇచ్చింది. అప్పటికి వరి నాట్లే వేయలేదు. మినుము, పెసర కేవలం నాలుగు శాతమే సాగు చేశారు. వీరికి బీమాపై అవగాహన లేకపోవడంతో ఒక్కరూ చేయలేదు. వరి పంటకు ఎకరాకు రూ. 630, మినుము, పెసరకు రూ.300 రైతులు ప్రీమియంగా చెల్లించాలి. పంట నష్టపోతే వరికి రూ. 30 వేలు, పెసర, మినుముకు రూ. 18 వేలు పరిహారంగా అందిస్తారు.

**బీమా ఉంటే ఎంతో మేలు**

గతంలో ఉన్న పంటల బీమా పథకానికి ప్రస్తుతం ఉన్న పథకానికి ఎంతో తేడా ఉంది. వరి నాట్లు వేస్తేనే గతంలో బీమా చేయడానికి అర్హులు. ప్రస్తుతం నాట్లు వేయకపోయినా చేయవచ్చు. నారు వేస్తే చాలు. గతంలో కోతల అనంతరం పంటలు దెబ్బతింటే ఎటువంటి పరిహారం లభించేది కాదు.

ఈ పథకంలో కోతల అనంతరం 14 రోజుల వరకు నష్టం వచ్చినా



పరిహారం అందిస్తారు. గతంలో పంట దెబ్బతింటేనే పరిహారం చెల్లించేవారు. ఇప్పుడు అలా కాదు. నారు పోయినా 25 శాతం వరకు బీమా ఇస్తారు. బీమా చెల్లించే విధానంలో కూడా మార్పులొచ్చాయి. ఏడేళ్ల దిగుబడులు సరాసరి లెక్కించి పరిహారం అందించేవారు. వీటిలో కరవు వచ్చిన సంవత్సరం ఉంటే తగ్గిన దిగుబడి లెక్కించేవారు. ఇప్పుడు కరవు సంవత్సరం దిగుబడులను పరిగణనలోకి తీసుకోరు.

**సమయం పొడిగించమని అడిగాం**

జిల్లాలో రబీ సీజన్ ఆలస్యంగా ప్రారంభమవుతుంది. పంటల బీమా పథకంలో చేరితే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంది. కేంద్ర ప్రభుత్వం బీమా ప్రీమియంలో కొంత రాయితీగా ఇస్తుంది. వరి నాట్లు వేయకపోయినా బీమా చేయవచ్చు. రైతులు నాట్లు వేశాకే బీమా కట్టడానికి ఇష్టపడుతున్నారు. అందువల్ల సమయం పొడిగించమని కోరాం.ఆశాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి

# మరల్లో మన సత్తా



ఉరవకొండ : అనంతపురం జిల్లా అంటే కరవు గుర్తుకు వస్తుంది. ఆ మాట చెరిగి పోయి ఇపుడు పవన విద్యుత్తుకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఉరవకొండ పవన విద్యుదుత్పత్తికి కేంద్రంగా మారింది. గాలి మరలు ఉత్పత్తి చేసే విద్యుత్తును స్వీకరించి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడానికే ఉరవకొండ మండలం పెద్ద ముష్టూరు వద్ద 105 ఎకరాల్లో ట్రాన్స్‌కో 14 ఫీడర్లతో 1630 మెగావోల్ట్- ఆంపియర్ (ఎంవీఏ) సామర్థ్యంతో 220 కేవీ ఉప కేంద్రాన్ని నిర్మించింది. దీనిని 2016లో అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ఇక్కడి నుంచి ఎక్కడికి**

ఉత్పత్తి అయిన పవన విద్యుత్తును ఇక్కడి నుంచి తాడిపత్రి సమీపంలో తలారి చెరువు, హిందూపురం, తెలంగాణలోని వెల్గటూరులోని విద్యుత్తు ఉపకేంద్రాలకు 400 కేవీ ఫీడర్లతో సరఫరా చేస్తారు. ఇక్కడ తక్కువ వచ్చినా అక్కడి నుంచి తీసుకొనే సామర్థ్యం ఉంది.

ఘనత: విద్యుత్తు సామర్థ్యం కలిగినదిగా పెద్ద ముష్టూరు కేంద్రానికి గుర్తింపు దక్కింది. కార్యకలాపాలన్నీ బెంగళూరు కేంద్రంగా నడుస్తాయి. సబ్‌స్టేషన్ ఆటోమేషన్ సిస్టమ్ (ఎస్ఏఎస్)ను కలిగి ఉంది. అధిక ఓల్టేజ్‌ను నియంత్రించడానికి రెండు రియాక్టర్లను ఏర్పాటు చేశారు. ఈ ఉపకేంద్రం నిర్వహణలో అధికారులు ఉత్తమ అవార్డును అందుకోవడం విశేషం. పవన, సౌర విద్యుత్తు ఉత్పత్తికి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ముందు ముందు ఈ కేంద్రానికి మరిన్ని ఘనతలు దక్కే అవకాశం ఉందని ఈఈ రమణమూర్తి చెబుతున్నారు.

603 గాలిమరలు : నింబగల్లు, ఆమిద్యాల, ఇప్పేరు, వజ్రకరూరు, బెళుగుప్ప ప్రాంతాల్లో

1500 మెగావాట్లు: గాలి మరల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తు మొత్తం సామర్థ్యం

1467ఎంవీ: గరిష్ఠంగా ఒక రోజులో స్వీకరించిన విద్యుత్తు

3.2 కోట్ల యూనిట్లు: ఒకరోజులో గాలి మరలు సంపూర్ణంగా తిరిగిన సమయంలో రికార్డైన విద్యుత్తు 2.8 కోట్ల యూనిట్లు: ఈ ఏడాది గరిష్ఠంగా ఒక రోజులో సరఫరా చేసింది.

# కోడిగుడ్లు ఎగ్గొట్టి చిక్కీలు చెడగొట్టి



పుట్టపర్తి: జిల్లాలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. కొన్నిచోట్ల వారాల తరబడి కోడిగుడ్లు, చిక్కీలు ఇవ్వకపోయినా, మెనూ అమలు చేయకపోయినా అడిగేవారుండరు. ఉమ్మడి అనంత జిల్లాలో జరుగుతున్న అక్రమాలపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలో ఎండగట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలో కోడిగుడ్లు, చిక్కీలు సక్రమంగా అందడం లేదని, చిక్కీల్లో బెల్లానికి బదులు చక్కెర కలుపుతున్నారంటూ గతేడాది నవంబరు 6నలో కథనం ప్రచురితమైంది. అదేనెలలో అగళి మండలంలోని మూడు పాఠశాలల్లో కోడిగుడ్లు, చిక్కీలు ఇవ్వలేదు. కొండమనాయునిపాల్యంలో కొన్ని కోడిగుడ్లు పాడయ్యాయని, తక్కువ బరువు ఉన్నాయని గుర్తించారు.

నెలలో ఒక అధికారి పదిచోట్ల తనిఖీలు చేయాలన్నది లక్ష్యం. అధికారికి వాహన సౌకర్యం ఉండదు. సొంత ఖర్చులు పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. పథకం నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. ఇప్పటివరకు గుత్తేదారులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పడం లేదు.

**ఒక్కరోజు ఇవ్వకపోయినా...**

వారంలో ఐదు రోజులు విద్యార్థులకు గుడ్లు ఇస్తున్నారు. గతనెల ధర చూసుకుంటే.. ఒక్కో గుడ్డుకు రూ.6.50 చొప్పున చెల్లించారు. అంటే.. ఒక రోజు మొత్తం 1,23,524లో 524 మంది గైర్హాజరైనా.. 1.23 లక్షల మందికి రూ.7,99,500 మిగులుతుంది. చిక్కీలకు సంబంధించి టన్నుకు రూ.40 వేలు ఇస్తున్నట్లు సమాచారం. ఇవన్నీ కలిపితే రోజుకు రూ.10 లక్షలకు పైగా జేబుల్లోకి వెళుతుంది. గుత్తేదారులకు కొందరు నాయకుల సహకారం ఉందనే ఆరోపణలున్నాయి.

**జిల్లాలో ఇలా..**

ప్రభుత్వ పాఠశాలలు: 2,012

జూనియర్ కళాశాలలు: 22

మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు: 1.23 లక్షలు

సమీక్షించి చర్యలు తీసుకుంటాం

మౌర్య భరద్వాజ్, జేసీ, శ్రీసత్యసాయి జిల్లా

పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి సమీక్షస్తున్నాం. ఇప్పటికే గుత్తేదారుల టెండరు గడువు అయిపోయింది. జనవరి వరకు పొడిగించాం. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకుంటాం.

# శుద్ధి.. నీటి రాతే



పుత్తూరు : పైవేటు నీటి శుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి కాసుల వేట సాగిస్తున్నారు. కనీస ప్రమాణాలు, నిబంధనలు పాటించకుండా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు రెస్టారెంట్లు, బస్టాండ్లు, బేకరీల్లో నకిలీ బ్రాండ్లే కనిపిస్తున్నాయి. ఈ నకిలీ దందా విజిలెన్స్ అధికారుల తనిఖీల్లోనూ బయటపడినా.. ఇంకా అడ్డుకట్ట మాత్రం పడలేదు. ప్రధాన నగరాలు, పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో ప్రముఖ కంపెనీల పేర్లలోని అక్షరాలు మార్చి వాటిలో నీటిని నింపి విక్రయిస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో జిల్లాలో ఈ నీళ్ల సీసాల విక్రయాలు నిత్యం వేల సంఖ్యలోనే ఉంటోంది. శుభకార్యాలు, సమావేశాలు జరిగితే నకిలీ బ్రాండ్ల ప్యాకేజ్డ్ అర లీటరు సీసాలు పెడుతున్నారు. బ్రాండెడ్ కంపెనీ అయితే అర లీటరు రూ.10, లోకల్ అయితే రూ.5 నుంచి రూ.6కే వస్తోంది. ప్లాంట్లలో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకనే బాటిళ్లు నింపి విక్రయాలు చేపడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.

**ప్రమాణాలు ఏవీ..** నీటిశుద్ధి ప్లాంటులో ఏసీతో పాటు కెమికల్, బయాలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది తప్పనిసరి.

బీఐఎస్ నిబంధనల మేరకు ప్లాంట్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఉండాలి. అధికారులు మూడు నెలలకోసారి నమూనాలు పరీక్షించాలి. సంతృప్తికరంగా ఉంటేనే అనుమతులు కొనసాగించాలి.

ప్యాకెట్లు, బాటిళ్లలో నింపి విక్రయించడానికి ప్రత్యేక అనుమతులు అవసరం.క్లోరినేషన్ ఎంతో కీలకం. నీటిని ట్యాంకులోకి పంపించాకే ఈ ప్రక్రియ చేయాలి. తర్వాత పలు ఫిల్టర్లలో నీటిని శుభ్రం చేసి రివర్స్ అస్మాసిస్ చేయాలి. మినరల్స్‌ను జతచేసి ఓజోనైజేషన్ చేశాకే క్యాన్లలో నింపాలి. తరచూ తనిఖీలు చేస్తున్నాం..

-జగదీశ్, ఆహార నియంత్రణ అధికారి, తిరుపతి జిల్లా

జిల్లాలో తరచూ తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు, ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై కేసులు పెడుతున్నాం. ఇకపై తనిఖీలు ముమ్మరం చేసి కఠినచర్యలు తీసుకుంటాం.

# చదువులమ్మ సేవలో తరిస్తూ..!

విశాఖపట్నం : విశాఖకు చెందిన ఎంతో మంది వివిధ దేశాల్లో స్థిరపడినా... జిల్లా అభివృద్ధికి, వివిధ సంస్థలకు తమ వంతుగా సాయం చేస్తూనే ఉన్నారు. శుక్రవారం 'ప్రవాస భారతీయుల దినోత్సవం'. ఈ నేపథ్యంలో ఏయూ పూర్వ విద్యార్థి దాతృత్వం.. ప్రయోజనం ఏమిటో తెలుసుకుందామా.అమెరికాలో స్థిరపడినా.. తనకు జ్ఞానాన్ని అందించిన ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని మరువలేదు పూర్వ విద్యార్థి దేవ పురాణం. ఏటా మూడు, నాలుగు పర్యాయాలు ఏయూని సందర్శించి వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు వివిధ రూపాలలో రూ.12.9కోట్లు వితరణ అందించారు. దేవ పురాణం అమలాపురం అగ్రహారంలో పుట్టి పెరిగారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, పీహెచ్‌డీ చేశారు. తర్వాత చెన్నైలో ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం ఉద్యోగాన్వేషణలో అమెరికా వెళ్లారు. అక్కడ పేరెన్నిక గన్న ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు చేశారు. ప్రస్తుతం అమెరికా, యూకే, భారత్‌లో పలు ఫార్మా కంపెనీలకు కన్సల్టెంట్(సలహాదారు)గా పనిచేస్తున్నారు. ఏయూకి అందించిన విరాళాలు: ఏయూ కెమిస్ట్రీ, ఫార్మసీ, సెంట్రల్ ల్యాబ్‌లకు సుమారు రూ.8కోట్ల విలువ చేసే పరికరాలు అందించారు. ఫార్మసీ కళాశాలలో లెక్చరర్ హాలు, ల్యాబ్ ఆధునికీకరణ, మహిళలకు శౌచాలయం, కెమిస్ట్రీ కళాశాలకు ల్యాబ్ పరికరాలు అందించారు.



గత ఏడాది డిసెంబరు 13న జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని వర్సిటీకి ఏయూ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (ఎఎఎ)కు రూ.20లక్షల విరాళం అందించారు. తల్లిదండ్రులు లలితా దేవి పురాణం, కోటిలింగ పురాణం పేరిట ఏయూ ఫార్మా విద్యార్థినులకు వసతిగృహం నిర్మించారు.

**తల్లి మాటల స్ఫూర్తితో:** 'నీవు సంపాదించింది నీదికాదు.. ఇతరులకు ఇచ్చిందే నీది' అని మా అమ్మ ఎప్పుడూ చెబుతుండేది. నేను దాన్ని పూర్తిగా నమ్ముతున్నా. అమెరికాలో బాగా స్థిరపడినా ఏటా తల్లిదండ్రులను చూడటానికి భారత్ వస్తుంటా. అలాగే ఏయూని సందర్శిస్తుంటా. ఏప్రిల్‌లో జరగనున్న ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ఆహ్వానించారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నా. దేవ పురాణం, ఏయూ పూర్వవిద్యార్థి

# కోనసీమకు దీటుగా..

ఎలమంచిలి : సంక్రాంతి పండగ వేళ గోదావరి జిల్లాల్లో ఏర్పాటు చేసే కోడిపందేల శిబిరాలు ఎంతో ప్రఖ్యాతిగాంచాయి. అక్కడి పందెం బరులను చూడటానికి ఎక్కడెక్కడి నుంచో తరలివెళ్తారు. గోదావరి జిల్లాలకు దీటుగా ఇప్పుడు జిల్లాలోనూ కోడి పందేల బరులు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం, పెందుర్తి, నర్సీపట్నంలో శిబిరాలు ఏర్పాటు చేశారు. భోగి నుంచి మూడు రోజులపాటు పగలు, రాత్రి తేడాలేకుండా పందాలు నిర్వహించారు. ఈసారి మరో అడుగు ముందుకేసి కోనసీమ తరహాలో బరులతోపాటు టెంట్లు, గ్రిల్స్ ఏర్పాటు చేసి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్ల పార్కింగ్‌కి ప్రత్యేకంగా స్థలాలు కేటాయిస్తున్నారు. గతేడాది ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలం రామన్నపాలెం గ్రామంలో పందెం బరి ఏర్పాటు చేశారు. ఈ ఏడాది రాంబిల్లి మండలం వెంకటాపురంలో నిర్వహించాలని నిర్ణయించారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లిలో గత ఏడాది నిర్వహించగా.. ఈ ఏడాది దీన్ని ఎస్.రాయవరం మండలానికి మార్చారు. కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటైన అడ్డరోడ్డులో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇదేతరహా ఏర్పాట్లు సాగుతుండటంతో పందేల ప్రేమికులు ఈ ఏడాది భీమవరం వెళ్లక్కర్లేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**పదివేలకు పైగా సిద్ధం:** గతేడాది పండగ సమయంలో పందేలకు సరిపడా కోళ్లు లభించలేదు. స్థానికంగా ఉన్నవి సరిపోకపోవడంతో కోనసీమ జిల్లాలకు వెళ్లి అధిక ధరలకు కొని తెచ్చుకోవాల్సి వచ్చింది. అక్కడ కూడా తగినన్ని దొరక్కపోవడంతో కనుమ పండగ రోజున శిబిరాల్లో జనాల సందడి కనిపించలేదు.

దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది జిల్లాలో పదివేలకు పైగా పందెం పుంజులు పెంచి వాటికి శిక్షణ ఇచ్చి సిద్ధం చేశారని అంచనా. వారంరోజులుగా వీటి అమ్మకాలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. జాతి పుంజులు ఒక్కొక్కటి రూ. 10 వేల నుంచి నుంచి రూ. 15 వేల వరకూ విక్రయిస్తున్నారు.

# నిధులు దండు'కుంట'న్నారు.

కర్నూలు : ఉమ్మడి జిల్లాలో వేసవికుంటలు, వాటికి అనుసంధానంగా ఏర్పాటైన సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణలో భారీ అక్రమాలు జరుగుతున్నాయి. కొందరు గుత్తేదారులు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి దశాబ్దాలుగా పథకాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. తక్కువకు టెండర్లు దక్కించుకుని.. పథకాలను సక్రమంగా నిర్వహించకుండా.. నిబంధనల మేరకు నీటిని శుద్ధి చేయకుండా రూ.కోట్లు స్వాహా చేస్తున్నారు. వేసవి కుంటల్లో కనీస నీటినిల్వలు లేకపోయినా.. శుద్ధి చేయకుండా నీటిని విడుదల చేస్తూ..ప్రభుత్వం కళ్లు కప్పి పూర్తిస్థాయిలో బిల్లులు జేబుల్లో వేసుకుంటున్నా అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు ముడుపులకు ఆశపడి వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**నమ్మబుద్ధికాని నీటిశుద్ధి** ఉమ్మడి కర్నూలు జిల్లాలో 39 వేసవికుంటలు (ఎస్ఎస్ ట్యాంకులు) ఉన్నాయి. వీటి ద్వారా 342 గ్రామాల పరిధిలోని 9.99 లక్షల మంది ప్రజలు శుద్ధినీరు సరఫరా చేయాల్సి ఉంది. వీటి నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.25.89 కోట్లు కేటాయిస్తుంది. వీటి నుంచి సీపీడబ్ల్యూఎస్‌లకు నీటిని పంపింగ్ చేసిన తర్వాత అక్కడ శుద్ధిచేసి గ్రామాలకు సరఫరా చేయాల్సి ఉంది. నిబంధనల మేరకు నీటిశుద్ధి జరగడం లేదు. కొన్నిచోట్ల చెరువుల నుంచి వచ్చే నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారు.

**నిర్వహణకు నీళ్లొదిలారు** 30- 35 ఏళ్ల కిందట నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకుల నీటి నిల్వ సామర్థ్యం ఏటా తగ్గిపోతోంది. పూడిక పేరుకుపోయింది. నాచు, పిచ్చిమొక్కలు పెరిగినా తొలగించడం లేదు. కొన్నేళ్లుగా నిర్వహణ పనులు చేపట్టిన దాఖలాల్లేవు. వీటిలో నీటి నిల్వ తగ్గిపోవడంతో అన్ని గ్రామాలకు నీరివ్వలేని పరిస్థితి నెలకొంది. కొందరు గుత్తేదారులు మాత్రం అన్ని గ్రామాలకు నీరు ఇస్తున్నట్లు ఎం.బుక్‌లో నమోదు చేస్తూ యథేచ్ఛగా బిల్లులు డ్రా చేస్తున్నారు. కొందరు ఉద్యోగులు వారికి సహకరిస్తూ నిధులు దోచిపెడుతున్నారు.

**'తక్కువ'కు దక్కించుకుని** సీపీడబ్ల్యూఎస్ పథకాలను దక్కించుకునేందుకు గుత్తేదారులు పోటీపడ్డారు. కొందరు ఏకంగా 40 శాతం వరకు తక్కువ (లెస్)కు టెండర్లు వేసి దక్కించుకున్నారు. 20- 25 శాతం తక్కువకు టెండర్లు వేసుకునే వెసులుబాటు ఉంది. పోటీ పెరగడంతో కొందరు అతి తక్కువ మొత్తానికి నీటి పథకాలు నిర్వహిస్తామని ముందుకొచ్చారు. ఆదోని డివిజన్ పరిధిలోని పలు పథకాలను 30- 40 శాతం తక్కువకే దక్కించుకున్నారు.

# ఆయుష్ పోస్తున్నారు

బనగానపల్లి : 'ఆయుష్' వైద్య సేవలపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది.. నిధుల్లేక గత కొన్నేళ్లుగా ఆయా కేంద్రాల నిర్వహణ అటకెక్కింది.. అదేవిధంగా ఔషధాల పంపిణీ లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.కోటి విలువైన మందులను సరఫరా చేసింది. రాయలసీమలోనే 10 పడకల ఆసుపత్రిగా ఉన్న బనగానపల్లి ఆసుపత్రి మరమ్మతులకు రూ.16 లక్షలు మంజూరు చేసింది. జిల్లా కేంద్రమైన నంద్యాల దవాఖానాకు రూ.50 లక్షలు, పాణ్యానికి రూ.30 లక్షలు, శిరివెళ్ల, దొర్నిపాడు, జిల్లెళ్లకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

**ఖాళీల భర్తీకి ఒప్పందం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో హోమియోపతి ఆస్పత్రులు 14, ఆయుర్వేదిక్ 42 యునాని వైద్యశాలలు 11, నాచురోపతి 2 వరకు ఉన్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ కింద 2014–19లో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రతి ఆసుపత్రిలో ఓ వైద్యుడు, ఫార్మసిస్ట్, అటెండర్, స్వీపర్, ఏఎన్ఎం ఉండాలి. యునాని మినహా మిగిలిన వైద్యాలయాల్లో ఏళ్ల తరబడి వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఆయా కేంద్రాల్లో పక్షవాతం, కీళ్లు, కండరాల నొప్పులు తదితరాలకు చికిత్స అందించే వారు. సిబ్బంది లేక పోవడంతో మంచా లు, ఇతర వైద్య పరికరాలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. "ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది నియామకానికి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయి.. త్వరలో భర్తీ చేయనున్నట్లు" ఆర్‌జేడీ డా.శేఖర్‌బాబు తెలిపారు.



**వీటిపై దృష్టి పెట్టాలి**

కర్నూలు నగరంలోని ఆయుర్వేద ఆసుపత్రిలో ఇన్‌ఛార్జి వైద్యుడే సేవలందిస్తున్నారు. ఇద్దరు సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. దొర్నిపాడులోని యునాని వైద్యశాల వైద్యురాలు బదిలీ కావడంతో ఆస్పత్రి మూతపడింది. అలాగే సంజామల మండలం ఆకుమల్లలో వైద్యులు, సిబ్బంది లేక ఆయుర్వేద ఆస్పత్రికి తాళం వేశారు.

ఆళ్లగడ్డలో వైద్యుడు బదిలీపై వెళ్లడం, సిబ్బంది లేక ఆయుర్వేద ఆసుపత్రిలో మూత పడే దశకు చేరుకుంది. కృష్ణగిరిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో హోమియో వైద్యశాల నిరుపయోగంగా మారింది. రుద్రవరం మండలం ఆలమూరులో ఆయుర్వేద ఆస్పత్రిలో సిబ్బంది లేక దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. డోన్ ఆయుర్వేద ఆసుపత్రిలో వైద్యాధికారిణి, అటెండరే విధులు నిర్వహిస్తున్నారు. అవుకు మండలం గుండ్లశింగవరంలో ఉన్న ఒకే ఒక ఫార్మసిస్ట్ బదిలీ కావడంతో ఆసుపత్రి అలంకారప్రాయంగా మారింది. రుద్రవరంలో వైద్యుడు లేక ఏళ్లయింది. ఫార్మసిస్టే సేవలు అందిస్తున్నారు.

# జొన్నకు పురుగు.. ఖజానాకు చిల్లు

నంద్యాల : పౌర సరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో జొన్నలను పురుగులు బుక్కుతున్నాయి. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో పెద్దఎత్తున జొన్న సాగైంది. వీటికి బహిరంగ విపణిలో గిట్టుబాటు ధర లేకపోవడంతో కొనుగోలుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. 4,180 మంది రైతుల నుంచి 27,097.100 మెట్రిక్ టన్నులు సేకరించారు. క్వింటాకు మద్దతు ధర రూ.3,371 చెల్లించారు. వాటిని నంద్యాల కేంద్ర గిడ్డంగుల సంస్థలో నిల్వ చేయాల్సి ఉంది. అక్కడ పెద్దఎత్తున పత్తి నిల్వ ఉండటంతో నంద్యాల, నందికొట్కూరు సీడబ్ల్యూసీ, ఏపీడబ్ల్యూసీ గోపవరం గోదాములతోపాటు గడిగరేవుల, దీబగుంట్ల, ఆళ్లగడ్డలోని ప్రైవేట్ గోదాముల్లో నిల్వ ఉంచారు. వీటి గడువు గతేడాది ఏప్రిల్ నాటికి ముగిసింది. అప్పటి వరకు అధికారులు అటువైపు తొంగి చూడకపోవడం గమనార్హం.

**సంచికి రూ.4 చెల్లించారు**

గోదాముల్లో నిల్వ చేసిన సరకుకు గాలి ఆడేలా ఏర్పాట్లు ఉండాలి. పురుగు పట్టకుండా రసాయనాలు వినియోగించాలి. ఇవేమీ పాటించకపోవడంతో పెద్ద ఎత్తున 'పురుగు' పట్టింది.

ఆరు వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉంచిన దీబగుంట్ల గోదాము, 3,600 టన్నులు నిల్వ ఉంచిన గడిగరేవుల గోదాములు, 5,600 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న ఆళ్లగడ్డ గోదాములో పురుగులు తినేస్తున్నాయి. సీడబ్ల్యూసీలో నిల్వ చేసే జొన్నల సంచికి రూ.5 చెల్లిస్తుండగా.. ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేసే సంచికి రూ.4 ధరకే యజమానులు



ఒప్పుకొన్నారు. జిల్లాలోని మూడు గోదాముల్లో నిల్వ, నిర్వహణ బాధ్యతలు వారికే అప్పగించారు. కొంతకాలంగా ఇదే విధంగా 'పనులు' పొందుతున్న అనధికార గుత్తేదారు వీటిని దక్కించుకొన్నారు. ప్రైవేట్ గోదాములను లీజుకు తీసుకుని సరకును వ్యక్తి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేస్తున్నారు.

**రేషన్ దుకాణాలకు తరలింపు**

గోదాముల్లో నిల్వ ఉంచిన జొన్నల్లో 17,400 మెట్రిక్ టన్నులను రేషన్ దుకాణాలకు తరలించారు. ప్రత్యేకించి జొన్నలు వినియోగించే నంద్యాల, కర్నూలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, కడప, పల్నాడు, ఒంగోలు, గుంటూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు తీసుకెళ్లారు.

రేషన్ దుకాణాల ద్వారా ఈనెల ఒకటో తేదీ నుంచే పంపిణీ కూడా ప్రారంభమైంది. కొన్నిచోట్ల జొన్నలు పుచ్చుపట్టడంతో కార్డుదారులు తీసుకోవడానికి విముఖత చూపినట్లు సమాచారం. మరోవైపు గోదాముల నుంచి తరలించిన జొన్నలు కొన్ని జిల్లాల్లో పౌరసరఫరాల గోదాముల్లో నిల్వ ఉంచారు. జొన్నలు నాణ్యతగా లేకపోవడంతో పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

# పేదల ఇల్లు.. 'పెద్దల కళ్లు'!



ఒంగోలు: గూడు లేని నిరుపేదలకు ఆవాసం కల్పించేందుకు ప్రభుత్వం స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి సాయమందించింది. అప్పట్లో మౌలిక వసతులు కల్పించకపోవడం, ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. తాజాగా మార్కాపురం జిల్లా కేంద్రం కావడంతో పెద్దల ముసుగులోని అక్రమార్కుల కళ్లు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్లపై పడ్డాయి. పేదల ఇళ్లను లాక్కోవడమే కాకుండా ఖాళీ జాగాలు కనిపిస్తే కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మార్కాపురం పట్టణంలో పేదలకు ఇళ్లు పంపిణీ చేసేందుకు 2007–08లో అప్పటి ప్రభుత్వం పట్టణ శివారులోని చెన్నరాయునిపురం, నరసింహపురంలో భారీ ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపట్టింది. నరసింహపురంలో 787 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం చేపట్టగా 587 ఇళ్లకు పైకప్పు వేశారు. మరో 139 పునాదుల స్థాయిలోనే ఉండిపోయాయి. దీనికి అనుబంధంగా ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో భాగంగా చెన్నరాయునిపురంలో 80 ఎకరాల్లో 889 మంది పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 531 ఇళ్లకు పైకప్పు వేయగా, పునాదుల దశలో 262 ఇళ్లు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఏవైతే పునాదుల దశలో నిలిచిపోయాయో వాటిపై అక్రమార్కులు కన్నేశారు. వాటిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే పైకప్పు దశలో ఉన్నవాటిని లబ్ధిదారులకు డబ్బులు ఆశ చూపి స్వాధీనం చేసుకుంటున్నారు. ఎప్పుడో 18 ఏళ్ల కిందట లబ్ధిదారులకు కేటాయించడంతో నిజమైన లబ్ధి దారులు ఎవరనేది గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి.

**అధికారుల తప్పిదాలతోనే..**

అప్పట్లో కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపట్టి వదిలేయగా, మరికొంతమంది ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభించలేదు. ఇలాంటి వాటిని అధికారులు లంచాలు తీసుకుని పలువురికి కేటాయించే ప్రయత్నం చేశారు. నకిలీ పత్రాలతో ఇద్దరు, ముగ్గురికి కట్టబెట్టడం గమనార్హం. ప్రస్తుతం అక్కడ ఖాళీ జాగా కనిపిస్తే ఎవరుబడితే వారు ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారు. తమ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేయడంతో కొత్తగా చేపట్టిన కొన్నింటిని అధికారులు కూల్చేశారు. కొంతమంది పెద్దలు చేపట్టిన నిర్మాణాలను మాత్రం కూల్చకుండా చోద్యం చూస్తున్నారు. మార్కాపురం జిల్లా కేంద్రం కావడం, ఇందిరమ్మ ఇళ్లను ఆనుకుని ఓ ప్రైవేటు సంస్థ భారీ లేఅవుట్ వేయడంతో అందరి కళ్లు వీటిపై పడ్డాయి. డబ్బు లేని పేదలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తుండగా, అక్రమార్కులు మాత్రం వడివడిగా నిర్మాణాలు చేపడుతున్నారు.

**నిజమైన లబ్ధిదారులకే కేటాయింపు**

మార్కాపురం పట్టణంలో ఎవరైతే నిజమైన లబ్ధిదారులు ఉన్నారో వారికే ఇళ్లు కేటాయిస్తాం. ఆర్థిక స్థోమత లేక ఇంటి నిర్మాణం చేపట్టలేని నిజమైన హక్కు దారులు తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చు. గృహ నిర్మాణ శాఖ ద్వారా అందించే రూ.2.50 లక్షల్లో అప్పట్లో ఇచ్చిన నగదును మినహాయించుకుని మిగిలిన మొత్తం లబ్ధిదారులకు అందజేస్తాం. ఆక్రమణల వ్యవహారాన్ని రెవెన్యూశాఖాధికారుల దృష్టికి తీసుకెళతాం.

పి.శ్రీనివాసవరప్రసాద్, పీడీ, గృహనిర్మాణశాఖ

# మామిడి దిగుబడి.. మంచుతో దిగులుపడి!



కనిగిరి : ఫలాల్లో రారాజు మామిడి. వందలాది రకాలతో నోరూరించే రుచులతో వేసవిలో ప్రత్యేకంగా లభించే పండు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించక పూత, పిందె దశకు వచ్చేసరికి మంచుదెబ్బ తగులుతోంది. ప్రస్తుతం మామిడి తోటలకు ఓ వైపు పొగమంచు, మరోవైపు తెగుళ్ల ప్రభావంతో ఇబ్బందులు తప్పడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 6 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి. సింగరాయకొండ, ఉలవపాడు, గిద్దలూరు, బెస్తవారిపేట, కనిగిరి, యర్రగొండ పాలెం, పెద్దారవీడు, జరుగుమల్లి తదితర ప్రాంతాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడం, రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడం, భారీగా మంచు కురుస్తుండడంతో మామిడికి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. సాధారణంగా నవంబరు నుంచి జనవరి వరకు మామిడి పూత వస్తుంది. అనంతరం పిందె దశకు చేరుకుంటుంది. ప్రస్తుతం రసాలు, సువర్ణరేఖ, బంగినపల్లి, తోతాపురి తదితర రకాల చెట్లు పూత, పిందె దశలో ఉన్నాయి. వీటిలో కొన్ని రకాలకు పూత ఆలస్యంగా రాగా, మరికొన్ని రకాలు పూత, పిందె దశకు చేరుకున్నాయి. మంచు ప్రభావంతో పూత వచ్చే పరిస్థితి కనిపించడంలేదని, మంచుతో పూత, పిందెలు సైతం రాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తేనె మంచు పురుగు సోకి పూత మాడిపోయి, పిందె దశలో ఉన్న కాయలు రాలిపోతున్నాయి. మంచు ప్రభావంతో మచ్చ తెగులు సోకి మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచు ప్రభావం, తెగుళ్ల నివారణకు రూ.వేలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేసినప్పటికి ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది ప్రారంభ దశలోనే ఇలాగుంటే కాయపక్వానికి వచ్చే సరికి ఎలా ఉంటుందోనని రైతులు మరింత ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై జిల్లా ఉద్యానవనశాఖాధికారి గోపీచంద్ మాట్లాడుతూ మంచు, తెగుళ్ల ప్రభావంతో పూత, పిందె రాలిపోతోందన్నారు. తేనె మంచు. పక్షకన్ను తెగులు, బూడిద తెగులు సోకుతున్నాయని, పూత దశలో శిలీంద్ర నాశకాలు పిచికారీ చేయాలన్నారు. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతోపాటు స్థానిక ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి సూచనలు తీసుకోవాలన్నారు.

**తెగుళ్లకు.. 'కంది'పోతోంది!**

పశ్చిమ ప్రాంతంలో ఈ ఏడాది కంది సాగు పెరిగింది. పొగాకు పండించే రైతులు కొంత మేరకు విస్తీర్ణం తగ్గించి కంది సాగువైపు మొగ్గుచూపారు. అయితే కందిలో ఎండుతెగులు ప్రభావంతో అక్కడక్కడ పంట దెబ్బతింటోంది. రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు పంట నీట మునిగింది. ఆ సమయంలోనే కొన్నిచోట్ల దెబ్బతింది. మరికొన్ని చోట్ల రైతులు అప్రమత్తమై నీటిని బయటకు తోడటంతో పంటను దక్కించుకోగలిగారు.

సాధారణ సాగు కంటే ఎక్కువ.. పొదిలి మండలంలో కంది సాధారణసాగు విస్తీర్ణం 6,500 హెక్టార్లు కాగా ఈ ఏడాది 10,812 హెక్టార్లలో సాగైంది. మార్కాపురం మండలంలో 3,264 ఎకరాలు, తర్లుపాడులో 770 హెక్టార్లు, కొనకనమిట్లలో 4,500 హెక్టార్లలో కంది వేశారు. గత ఏడాది 7 వేల హెక్టార్లలోపే సాగు చేశారు. పంట విస్తీర్ణం పెరిగినప్పటికీ కొన్నిచోట్ల ఎండుతెగులుతో మొక్కలు చనిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని వాపోతున్నారు. కందిపంటలో సస్యరక్షణ చర్యలు, బెట్ట పరిస్థితులను అధిగమించేందుకు వ్యవసాయ అధికారుల సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి: ఎండు తెగులు నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి డి.శ్రీనివాసులరెడ్డి సూచిస్తున్నారు. ప్రారంభంలో రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ప్రస్తుతం కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

# వెలిగొండపై విద్యుత్తు బకాయిల గుదిబండ

మార్కాపురం : జిల్లాలోని దోర్నాల మండలం కొత్తూరు శివారులో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణమవుతోంది. ఇక్కడ సొరంగాల నిర్మాణ పనులకు గత అయిదేళ్లుగా వినియోగించిన విద్యుత్తుకు సంబంధించి రూ.107 కోట్ల బిల్లు బకాయిలు పేరుకుపోయాయి. ఇక్కడ నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారు సంస్థను బకాయిలు చెల్లించాలని కోరుతున్నప్పటికీ స్పందన లేదని, పలుమార్లు సంప్రదించినా వసూలు కాలేదని అధికారులు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ హయాం నుంచే బకాయిలు రూ.107 కోట్లకు చేరుకోవడంతో తక్షణమే చెల్లించాలని గుత్తేదారు సంస్థకు నోటీసులిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయమై మార్కాపురం విద్యుత్తుశాఖ ఈఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ పాత సంస్థ పేరిటే బిల్లు ఉందని, బిల్లును ప్రస్తుతం చేస్తున్న కంపెనీ పేరిట మార్చమని కోరారని, బిల్లు మార్పు చేసి పాత బకాయిలు వసూలుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే బిల్లు చెల్లించేందుకు గుత్తేదారు సంస్థ అంగీకరించిందన్నారు.

# ఇరకాటంలో భవిత!

నరసాపురం : దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను వసతుల లేమి సమస్య వెంటాడుతోంది. ఈ కేంద్రాల ద్వారా దివ్యాంగ చిన్నారులకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ తదితర సేవలు అందిస్తున్నారు. కొన్ని కేంద్రాలు ఇరుకు గదుల్లో కొనసాగుతుండగా మరికొన్ని గ్రామాలకు దూరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల ర్యాంపులు లేకపోవడంతో దివ్యాంగ చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు.మొగల్తూరు లోని భవిత కేంద్రంలో సుమారు 20 మంది చిన్నారులు ఉన్నారు. ఈ భవనానికి ర్యాంపు లేకపోవడంతో చిన్నారులు మూడడుగుల ఎత్తులో ఉన్న మెట్ల మార్గం నుంచి లోపలికి వెళ్లాల్సి వస్తోంది. చక్రాల కుర్చీలో పిల్లలను తీసుకువచ్చే వారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పోడూరు లో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ దాదాపు 20 మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. వీరికి అనువుగా ఫ్రెండ్లీ టాయిలెట్లు (మరుగుదొడ్లు) లేవు. పెనుమంట్ర మండలం ఆలమూరులో భవిత కేంద్రం ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ



తగిన సదుపాయాలు లేక దూర ప్రాంతాల నుంచి పిల్లలను తీసుకువచ్చే తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు.

ఆకివీడులో భవిత కేంద్రానికి సొంత భవనం లేదు. ప్రారంభంలో సంతమార్కెట్ వద్ద పాతభవనంలో ఏర్పాటు చేశారు. అది శిథిలావస్థలో ఉండటంతో మాదివాడ ప్రాథమిక పాఠశాలలో ఒక గది కేటాయించారు. కొద్దికాలానికి ఆర్యవైశ్య కళ్యాణ మండపం రోడ్డులో ఉన్న పాఠశాలకు తరలించారు. ఇక్కడ దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు లేవు. నరసాపురంపట్టణంలో భవిత కేంద్రాన్ని స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఓ తరగతి గదిలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 25 మంది దివ్యాంగులు శిక్షణ పొందుతున్నారు. వారికి అవసరమైన వసతి లేకపోవడంతో ఇరుకు గదిలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు..జిల్లాలో భవిత కేంద్రాలకు విడతల వారీగా సొంత భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాం. తొలి విడతలో అయిదు భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తాం. దివ్యాంగ చిన్నారులు కూడా సాధారణ విద్యార్థుల్లా విద్య, క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

– శ్యామ్‌సుందర్, సర్వశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్

# అనగనగా చెరువుంది! అది ఇప్పుడెక్కడుంది!!

కొవ్వూరు–గుండుగొలను జాతీయ రహదారి వెంబడే ఉంటుంది నారాయణపురం జమ్మి చెరువు. ఇక్కడ ఎకరా మార్కెట్ విలువ రూ.కోటికి పైగా ఉంది.

పంటల సాగు: ఆక్రమణదారులు రెండు పంటలు పండించుకుని సగటున ఎకరాకు రూ.50 వేల వరకు నికర ఆదాయం పొందుతున్నారు. చర్యలు: చెరువులో కొందరు రైతులు సాగు చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. పంచాయతీ కార్యదర్శితో నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని అనుకున్నారంతే.

ఈనాడు–ఏలూరు: ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రజల తాగునీటి అవసరాలు.. సాగుకు ఉపయోగపడేవి చెరువులు. భూగర్భ జలాల పెంపునకు దోహదం చేస్తాయి. సహజ సిద్ధమైన ఈ జల వనరులు జిల్లాలో అత్యధికంగా ద్వారకాతిరుమల మండలంలో ఉండగా... అవి కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. వాటి విలువ రూ.30–40 కోట్లకు పైగానే ఉంటుంది.

చాలా చెరువులు ఆక్రమించి పంటలు సాగుచేసుకుంటున్నారు. నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో గుక్కెడు నీళ్లకు నోచుకోవడం లేదనే స్థానికుల ఫిర్యాదులపై అధికారుల చర్యలు శూన్యం. ఆక్రమణల తొలగింపు విషయంలో ఇటు జల వనరులు, అటు జిల్లా పంచాయతీ అధికారులు ఎవరికి వారే మీదంటే.. మీదంటూ తప్పించుకు



ంటున్నారు.

**49 ఎకరాల్లో 25 ఎకరాలు ఆక్రమణ**

గుణ్ణంపల్లి–తక్కెళ్లపాడులో లక్ష్మపురం చెరువు గర్భంలో కొంత భూమిని సాగు చేసుకుంటుండగా మరికొందరు కొందరు ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఉంటున్నారు.

ఇక్కడ ఎకరా ధర రూ.40–50 లక్షలు ఉంది. సగటున ఎకరాకు రూ.40 లక్షలు అనుకున్నా రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది.

చర్యలు: ఇళ్ల నిర్మాణాల తొలగింపునకు కలెక్టర్, పోలీసులకు అధికారులు బందోబస్తు కోరుతూ లేఖ రాసి మిన్నకుండిపోయారు.

**32 ఎకరాల్లో 16 ఎకరాలు ఆక్రమణ**

సత్తాల చెరువును ఆక్రమించి వరి పంటతో పాటు ఆయిల్‌ఫాం తోటలు సాగు చేశారు.ఇక్కడ ఎకరా ధర రూ.40 లక్షలు. ఈ ప్రకారం చూస్తే కబ్జాకు గురైన భూమి విలువ రూ.6.40 కోట్లు.చర్యలు: ఆక్రమణల తొలగ్రినకు కలెక్టర్, పోలీసు, పంచాయతీ అధికారుల సహకారం కోరుతూ గతేడాది జూన్, జులైలో జల వనరుల శాఖ రాసిన లేఖకు ఇప్పటికీ స్పందన లేదు.

సీఎస్ఆర్ నిధులతో పరిరక్షిస్తాం

ద్వారకాతిరుమల మండలంలో కొన్ని చెరువులు కబ్జాకు గురయ్యాయని గుర్తించాం. వాటి తొలగింపునకు నిధులతో పాటు పోలీసు బందోబస్తు అవసరం. మా శాఖ వద్ద బడ్జెట్ లేదు. సీఎస్ఆర్ నిధుల భాగస్వామ్యంతో అన్ని చెరువుల్లో ఆక్రమణలు తొలగించి వాటి పరిరక్షణకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– పి.సతీష్, ఏఈ, చిన్న నీటి పారుదల శాఖ

## భాగ్యశ్రీ 'పానీపూరి' పంచ్ ఎవరి పై?

అందం ఉంది... ప్రతిభ ఉంది.. కానీ లక్ కలిసి రావడం లేదు... దీంతో వరుస ఫ్లాపులు ఎదుర్కొని డీలా పడిపోయింది భాగ్యశ్రీ. అయితే ప్రతి ఫ్లాప్ నుంచి అంతో ఇంతో నేర్చుకుంటున్న ఈ బ్యూటీ ప్రతి సినిమాలో నటన పరంగా షైన్ అవుతూనే ఉంది. సినిమాలు ఫ్లాపులైనా కానీ, నటిగా ఏనాడూ భాగ్యశ్రీ ఫ్లాప్ కాలేదు. అందుకే ఈ భామకు బ్యాక్ టు బ్యాక్ అవకాశాలు వస్తున్నాయి. మాస్ మహారాజా రవితేజ సరసన -మిస్టర్ బచ్చన్- సినిమాతో డెబ్యూ ఇచ్చిన ఈ బ్యూటీ ఆరంభమే పెద్ద ఫ్లాప్ ని ఎదుర్కొంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన నటించిన -కింగ్ డమ్- మరో పెద్ద నిరాశ. ఇటీవలే విడుదలైన రామ్ పోతినేని -ఆంధ్రా కింగ్ తాలూకా- అయినా తనను గట్టున పడేస్తుందని చాలా ఆశించింది. కానీ మరోసారి నిరాశే ఎదురైంది. ఈ సినిమాకి విమర్శకుల నుంచి ప్రశంసలు వచ్చినా, భాగ్యశ్రీ- రామ్ జంట కెమిస్ట్రీకి మంచి మార్కులే వేసినా కానీ, ఆశించిన స్థాయి విజయం దక్కలేదు. ఇది కేవలం యావరేజ్ గా మాత్రమే మిగిలిపోవడం మరోసారి భాగ్యశ్రీని కుంగదీసింది. వరుస పరాజయాల కెరీర్ లో దుల్కర్ సల్మాన్ సరసన నటించిన కాంత ఫలితం కొంత ఊరట. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద యావరేజ్ విజయం సాధించినా, ఇందులో భాగ్యశ్రీ నట ప్రదర్శనకు క్రిటిక్స్ మంచి మార్కులు వేసారు. భాగ్యశ్రీ ఫ్లాపులు, యావరేజుల్లో నటించినా కానీ తన నటప్రదర్శన విషయంలో నిరాశపరచలేదనే మంచి పేరు తెచ్చుకుంది. అందుకే ఇంకా అవకాశాలొస్తూన్నాయి. ఇప్పటికీ గెలుపుపై పట్టుదలగా కనిపిస్తోంది. హోప్‌ని విడిచిపెట్టలేదు. ప్రస్తుతం అఖిల్ అక్కినేని సరసన -లెనిన్- అనే చిత్రంలో నటిస్తోంది ఈ బ్యూటీ. ఇది విలేజ్ బ్యాక్



డ్రాప్ సినిమా అయినా ఇందులో భాగ్యశ్రీ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉందని తెలుస్తోంది. భాగ్యశ్రీ ప్రస్తుతం సోషల్ మీడియాల్లో స్పీడ్ గానే ఉంది. అయితే ఈ భామ ఎప్పుడూ హద్దు మీరని, డీసెంట్ ఫోటోషూట్లతో అభిమానుల్లో ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. తాజాగా మరోసారి అలాంటి ఒక ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఈసారి పింక్ అండ్ క్రీమ్ కలర్ లెహంగా ధరించి చిరునవ్వులు చిందిస్తూ అదిరిపోయే ఫోజులిచ్చింది భాగ్యశ్రీ. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. భాగ్యం ఎంతో ట్రెడిషనల్ గా కనిపిస్తోందని, నేటితరంలో పద్ధతైన సొగసైన అమ్మాయి! అంటూ ఫ్యాన్స్ కితాబిచ్చేస్తున్నారు. ఇక తన ఫోటోషూట్ కి భాగ్యశ్రీ అందమైన క్యాప్షన్ కూడా ఇచ్చింది. భాగ్యశ్రీ బోర్సే తాజా ఫోటోషూట్ తో ఇక నిగూఢమైన వ్యాఖ్యను షేర్ చేసింది. --నేను పానీ పూరి తిన్నాను కాబట్టి సంతోషంగా తిరుగుతున్నాను-- అని రాసింది. దీని అర్థం తన జీవితంలో ప్రతి చిన్న విషయాన్ని కూడా సెలబ్రేట్ చేసుకుంటానని భాగ్యశ్రీ చెప్పకనే చెబుతోంది. సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా, చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతుక్కుంటూ ఆమె కెరీర్‌పై ఫోకస్ పెడుతున్నానని హింట్ ఇచ్చింది. ప్రస్తుతం భాగ్యశ్రీకి సోషల్ మీడియాలో అసాధారణ ఫాలోయింగ్ ఏర్పడింది. ఈ బ్యూటీకి ప్రేమలేఖలు రాసే కుర్రాళ్లు ఉన్నారు. అన్నట్టు యువహీరో రామ్ పోతినేనితో ప్రేమాయణం ఎంతవరకూ వచ్చిందో భాగ్యశ్రీ కనీసం క్లూ కూడా ఇవ్వడం లేదు. ఆ ఇద్దరూ ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాలో నటించేప్పుడు ప్రేమలో పడ్డారని ప్రచారమైంది. కానీ తాజా అప్‌డేట్ ఏమిటన్నది ఇంకా తెలియరాలేదు. భాగ్యశ్రీ దీనికి సరైన జవాబు చెబుతుందా లేదా? వేచి చూడాలి.


## డార్లింగ్ మళ్లీ ఆ తప్పెందుకు చేస్తాడు?

సినీ ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్లు సెట్ అవుతున్నాయంటే అందరికీ షాకింగ్ గా ఉంటుంది. కొన్ని సార్లు ఊహించని కాంబినేషన్లు ఆడియన్స్ ను ఆశ్చర్యానికి గురి చేస్తే, మరికొన్ని సార్లు డిజాస్టర్ కాంబినేషన్లు ఆశ్చర్యానికి గురి చేస్తాయి.

అలాంటి కాంబినేషన్ ఒకటి ఇప్పుడు టాలీవుడ్ లో సెట్ అవుతుందని గత కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.

**ప్రభాస్, మారుతి కాంబినేషన్ లో వచ్చిన ది రాజా సాబ్...** ఆ కాంబినేషన్ మరెవరిదో కాదు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి. వీరిద్దరి కాంబినేషన్ లో రీసెంట్ గా సంక్రాంతికి ది రాజా సాబ్ రిలీజవగా, ఆ సినిమా అనుకున్న అంచనాలను అందుకోలేక బాక్సాఫీస్ వద్ద ఫెయిల్యూర్ గా నిలిచింది. అలాంటి వీరిద్దరి కలయికలో ఇప్పుడు మరో సినిమా వస్తుందని తెలిసి ఫ్యాన్స్ కంగారు పడుతున్నారు.

**రాజా సాబ్ వద్దని చెప్పిన ప్రభాస్ ఫ్యాన్స్....** వాస్తవానికి ది రాజా సాబ్ సినిమాకు ముందు కూడా మారుతితో సినిమా వద్దని ప్రభాస్



ఫ్యాన్స్ ఎంతో గోల చేశారు. మారుతితో సినిమా వద్దంటే వద్దని ఏకంగా సోషల్ మీడియాలో ట్రెండ్ కూడా చేశారు. అయితే ప్రభాస్ మాత్రం మారుతిపై, కథపై నమ్మకముంచి ది రాజా సాబ్ ను పూర్తి చేశారు. కానీ రాజా సాబ్ రిలీజ్ తర్వాత మాత్రం ప్రభాస్ డెసిషన్ తప్పని తేలింది.

**టెన్షన్ పడుతున్న డార్లింగ్ ఫ్యాన్స్....** మారుతి ఖాతాలో సక్సెస్‌ఫుల్ సినిమాలున్నప్పటికీ, అతను ఇప్పటివరకు పాన్ ఇండియా సినిమాలు చేసింది లేదు. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ ఇప్పటికైనా లోకల్ డైరెక్టర్లకు కాకుండా పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ ఉన్న పెద్ద డైరెక్టర్లతోనే సినిమాలు చేయాలని డార్లింగ్ ఫ్యాన్స్ కోరుకుంటున్న నేపథ్యంలో మారుతితో మరోసారి సినిమా అనేసరికి ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు. ప్రభాస్ హీరోగా, హోంబలే ఫిల్మ్స్ సంస్థలో సినిమా రానుందని వార్తలొస్తున్న నేపథ్యంలో రీసెంట్ గా నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. ఇవన్నీ రూమర్లు మాత్రమేనని వెల్లడించడంతో డార్లింగ్ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇప్పటికే పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ప్రభాస్, కొత్తగా ఎలాంటి సినిమాలనూ ఒప్పుకోలేదని, ఆల్రెడీ ఒప్పుకున్న సినిమాలను పూర్తి చేసే దిశగా డార్లింగ్ వర్క్ చేస్తున్నారని అతని సన్నిహిత వర్గాలంటున్నాయి.




## నో రిలీజ్..కానీ మూడు స్టేట్ అవార్డులు..అదెలా?



తమిళనాడు ప్రభుత్వం ఇటీవల స్టేట్ ఫిల్మ్ అవార్డుల్ని ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే..జనవరి 29న తమిళనాడు ప్రభుత్వం 2016 నుంచి 2022 వరకు రాష్ట్ర చలన చిత్ర అవార్డుల్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రముఖ నటీనటులు, చిత్రాలు, టాప్ టెక్నీషియన్స్‌ని గుర్తించి వారికి అవార్డుల్ని ప్రకటించింది. అయితే ఈ సందర్భంగా -సండక్కారి- అనే చిత్రానికి 2022 సంవత్సరానికి గానూ ఏకంగా మూడు అవార్డుల్ని ప్రకటించడం అందరిని షాక్‌కు గురి చేస్తోంది. దీనిపై తమిళనాట, నెట్టింట విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మూవీ ఇంత వరకు థియేటర్లలో రిలీజ్ కాలేదు. అలాంటప్పుడు దీన్ని అవార్డులకు ఎలా పరిగణిస్తారని, మూడు అవార్డుల్ని ఏ ప్రతిపాదికన ప్రకటించారని నెటిజన్‌లు, కోలీవుడ్ ప్రేక్షకులు, విమర్శకులు ప్రభుత్వంపై ఫైర్ అవుతున్నారు. విచిత్రం ఏంటంటే ఇదొక రీమేక్ సినిమా. రీమేక్‌లకు అవార్డులు ఏ రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ఇవ్వదు, అసలు లెక్కలోకే తీసుకోదు. కానీ విచిత్రంగా ఈ రీమేక్ మూవీకి ఏకంగా జ్యూరీ మెంబర్ మూడు అవార్డులు ప్రకటించడం తీవ్ర చర్చకు తెరలేపింది. ఈ సినిమాకు మూడు ప్రధాన విభాగాల్లో అవార్డులు ప్రకటించారు. ఒకటి ఉత్తమ చిత్రం, రెండు..ఉత్తమ నేపథ్య గాయకుడు, మూడు.. ఉత్తమ కళా దర్శకుడు..దీంతో కోలీవుడ్ మీడియా, విమర్శకులు అవార్డు కమిటీ జ్యూరీపై సెటైర్లు వేస్తున్నారు. తమిళనాడు రాష్ట్ర అవార్డులకు అర్హత సాధించాలంటే అది రీమేక్ అయి ఉండకూడదు. అంతే కాకుండా ఆ సినిమా థియేటర్లలో రిలీజ్ అయి ఉండాలి. ఇవేవీ పట్టించుకోకుండా ఒక మలయాళ రీమేక్ -మై బాస్- ఆధారంగా రూపొందిన ఈ సినిమాకు ఏ ప్రాతిపాదికన మూడు అవార్డులు ఇచ్చారని నెటిజన్‌లు ప్రశ్నిస్తున్నారు. సినిమా గురించి తెలియకుండా, దాన్ని చూడకుండానే జ్యూరీ కమిటీ ఎలా అవార్డులు ప్రకటించిందని, అంతా అవార్డులు ఇవ్వడానికి ఈ సినిమాలో ఏముందని ఇచ్చారని ఆడియన్స్ ఫైర్ అవుతున్నారు. 2012లో -దృశ్యం- డైరెక్టర్ జీతూ జోసెఫ్ రూపొందించిన -మై బాస్- ఆధారంగా దీన్ని రూపొందించారు. దిలీప్, మమతా మోహన్‌దాస్ జంటగా నటించారు. ఇదొక రొమాంటిక్ కామెడీ మూవీ. దీని ఆధారంగా రూపొందిన -సండక్కారి-లో విమల్, శ్రియా శరన్ జంటగా నటించారు. 2022లో రిలీజ్ కావాల్సిన ఈ మూవీ ఇంత వరకు థియేటర్లకు రాలేదు. సినిమాని కూడా హీరో విమల్, శ్రియా కూడా మర్చిపోయారు. దర్శకుడు ఆర్. మాధేశ్ కూడా మర్చిపోయిన ఈ రీమేక్ మూవీకి మూడు రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు దక్కడంతో ఈ సినిమా ఇప్పుడు వార్తల్లో నిలుస్తోంది. ఇదిలా ఉంటే తమిళ నాడు ప్రభుత్వం ప్రకటించిన అవార్డులపై దర్శకుడు పా.రంజిత్ ఇటీవల విమర్శలు చేశారు. తాజా వివాదం నేపథ్యంలో ఆయనకు మద్దతు పెరిగే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి.

## 2027.. హవా మొత్తం టాలీవుడ్‌దే!




2025లో ఎన్నో భారీ సినిమాలొచ్చి అందులో పలు సినిమాలు బ్లాక్ బస్టర్లుగా నిలవగా, పలు సినిమాలు అనుకున్న ఫలితాల్ని సాధించలేకపోయాయి. ఈ ఏడాదిలో కూడా పలు పెద్ద సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఇక రానున్న సంవత్సరంలో అయితే వరల్డ్ సినిమా వద్ద తెలుగు సినిమా సత్తా చాటడానికి రెడీ అవుతోంది. స్టార్ హీరోలు, స్టార్ డైరెక్టర్లతో కలిసి భారీ బడ్జెట్ తో రూపొందుతున్న సినిమాలు 2027లో రిలీజ్ కు రెడీ అవుతున్నాయి.

**ఏప్రిల్ 7న వారణాసి రిలీజ్...** 2027లో తెలుగు సినిమా యొక్క స్థాయి, మార్కెట్.. ప్రపంచ స్థాయిలో విపరీతంగా పెరుగుతుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. నెక్ట్స్ ఇయర్ లో పలు భారీ సినిమాలు రిలీజ్ కానుండగా, అందులో మహేష్ బాబు-రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న వారణాసి ఒకటి. ఈ సినిమా కోసం యావత్ ప్రపంచమే వెయిట్ చేస్తోంది. తెలుగు సినిమా స్థాయిని ఇప్పటికే ప్రపంచానికి తెలియచేసిన రాజమౌళి, ఇప్పుడు వారణాసితో తన గత సినిమాల రికార్డులను చెరిపేయాలని చూస్తున్నారు. వారణాసితో తెలుగు సినిమా స్థాయి ప్రపంచ వ్యాప్తంగా మరింత పెరుగుతుందని అందరూ బలంగా నమ్ముతున్నారు. 2027 ఏప్రిల్ 7న వారణాసి రిలీజ్ కానుంది.

**2027లోనే స్పిరిట్...** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోయే స్పిరిట్ కూడా వచ్చే సంవత్సరంలోనే రిలీజ్ కాబోతుంది. అర్జున్ రెడ్డి, యానిమల్ లాంటి బ్లాక్ బస్టర్ సినిమాల తర్వాత సందీప్ ఇండియాలోనే స్టార్ డైరెక్టర్ గా మారారు. అలాంటి సందీప్ రెడ్డి వంగా, ప్రభాస్ కాంబోలో వస్తున్న పాన్ ఇండియా సినిమా కావడంతో స్పిరిట్ రికార్డులు సృష్టిస్తుందని అందరూ భావిస్తున్నారు.

**భారీ క్రేజ్ తో రూపొందుతున్న అల్లుఅర్జున్- అట్లీ సినిమా....** ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమా కూడా వచ్చే ఏడాదిలోనే రిలీజ్ కాబోతుంది. పుష్ప ఫ్రాంచైజ్ సినిమాలతో అల్లు అర్జున్ కు ఇప్పటికే దేశమంతటా మంచి క్రేజ్ ఏర్పడగా, అట్లీకి కూడా పాన్ ఇండియా స్థాయిలో మంచి డిమాండే ఉంది. అలాంటి వీరిద్దరి కాంబోలో తెరకెక్కుతున్న సినిమా అన్ని వర్గాల ఆడియన్స్ ను అలరిస్తుందని ఆడియన్స్ ఆశిస్తున్నారు. వీటితో పాటూ ఆర్ఆర్ఆర్ తో గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నుంచి కూడా వచ్చే ఏడాది ఓ సినిమా వచ్చే అవకాశముంది. పుష్ప సిరీస్ సినిమాలకు దర్శకత్వం వహించిన సుకుమార్ ఈ సినిమాను దర్శకత్వం చేయనున్నారు. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన రంగస్థలం మంచి హిట్ అవడంతో పాటూ చరణ్, సుకుమార్ ఇద్దరికీ పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు ఉండటంతో ఈ ప్రాజెక్టు కూడా వరల్డ్ సినిమా వద్ద భారీగా పెర్ఫార్మ్ చేస్తుందని భావిస్తున్నారు. పైన చెప్పిన సినిమాలన్నీ అనుకున్న స్థాయి అంచనాలను అందుకుంటే 2027 టాలీవుడ్ కు చాలా మెమొరబుల్ ఇయర్ గా మారడం ఖాయం.

## పబ్లిక్ లో అలాంటి పని చేసిన జాన్వీ.. ఫోటో వైరల్

అతిలోక సుందరి అందాల తార దివంగత నటీమణి వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది జాన్వీ కపూర్. తల్లికి తగ్గ అందంతో అద్భుతమైన నటనతో బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది. అదే క్రేజ్ తో టాలీవుడ్ సినీ రంగంలోకి కూడా అడుగుపెట్టింది ఈ ముద్దుగుమ్మ. అలా తొలిసారి కొరటాల శివ దర్శకత్వంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరో గా వచ్చిన దేవర సినిమా ద్వారా సినీ రంగంలోకి అడుగు పెట్టింది .ముఖ్యంగా శ్రీదేవి చివరి కోరిక కూడా ఇదే కావడం గమనార్హం. ఒకసారి ఎన్టీఆర్ మాట్లాడుతూ.. శ్రీదేవి తన కూతుర్ని నా సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం చేయాలని కలలు కన్నారు. ఎందుకంటే ఆమె మా తాతగారు సీనియర్ ఎన్టీఆర్ గారితో ఎన్నో సినిమాలు చేశారు. అందుకే ఆయన మనవడైన నాతో ఆమె కూతురి తెలుగు ఎంట్రీ కావాలని కోరుకున్నారు అంటూ శ్రీదేవి మాటగా ఎన్టీఆర్ గతంలో కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. అందుకు తగ్గట్టుగానే శ్రీదేవి కోరిక మేరకు జాన్వీ కపూర్ కూడా తన తొలి తెలుగు చిత్రాన్ని స్వర్గీయులు ఎన్టీఆర్ వారసులైన యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో సినిమా చేసి అమ్మ కలను నెరవేర్చింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం



బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. భారీ అంచనాల మధ్య ఈ సినిమా మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా తెలంగాణ ప్రభుత్వం పెట్టిన కొత్త నిబంధనల కారణంగా దసరాకి వాయిదా పడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా సినిమా టికెట్ ధరలను పెంచాలి అంటే మూడు నెలల ముందు అనుమతి తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాతలు ఈ సినిమా ను మరో మూడు నెలలు వాయిదా వేయబోతున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ వలకబోసే ఈ ముద్దుగుమ్మ.. ఈసారి పబ్లిక్ లో చేసిన పనికి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఇదిలా ఉండగా ఇన్స్టాగ్రామ్ వేదికగా ఎప్పటికప్పుడు అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ఈమె తాజాగా మినీ స్కర్ట్ లో షేర్ చేసిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ కలర్ మినీ స్కర్ట్ ధరించిన ఈమె తన అందాలను పబ్లిక్ లో చూపెడుతూ లిఫ్ట్లో సెల్ఫీ ఫోటోలు దిగే ప్రయత్నం చేసింది . అయితే అందులో ఉన్న మిగతా వారు జాన్వి ఫోటోలు తీసుకుంటుండగా ఆమె వైపు తీక్షణంగా చూస్తున్నట్టు జాన్వీ షేర్ చేసిన ఫోటోలలో కనిపిస్తోంది. మొత్తానికైతే ఇది చూసిన కొంతమంది పబ్లిక్ లో ఇలా సెల్ఫీ ఫోటోలతో రెచ్చిపోతుంది అని కామెంట్లు చేస్తుంటే.. మరి కొంత మంది పబ్లిక్ లోకి వచ్చాక కాస్త డీసెంట్గా ఉండడానికి ట్రై చేయండి అంటూ కామెంట్లు చేస్తున్నారు.. ఏది ఏమైనా జాన్వీ కపూర్ మినీ స్కర్ట్ అందాలు మాత్రం అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

## ఈ తెలుగు హీరోలైనా పూజా హెగ్డేను కాపాడుతారా?

వరుస హిట్లతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి, ఫ్యామిలీ ఆడియెన్స్ ఫేవరెట్ విక్టరీ వెంకటేశ్ కలయికలో ఇప్పటికే 'F2, F3' 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్ బస్టర్స్ వచ్చాయి. ఇప్పుడు వీరిద్దరికీ తోడుగా దగ్గుబాటి వారసుడు రానా కూడా జతకట్టడం టాలీవుడ్‌లో అతిపెద్ద హాట్ టాపిక్‌గా మారింది. సంక్రాంతికి సక్సెస్ కొట్టడం అనిల్ రావిపూడికి అలవాటుగా మారింది. వచ్చే ఏడాది సంక్రాంతి పండుగను కూడా తన కామెడీ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కొల్లగొట్టాలని అనిల్ గట్టి ప్లాన్ వేశారు. ఈ క్రేజీ ప్రాజెక్టులో గ్లామర్ అండ్ పర్ఫార్మెన్స్ యాడ్ చేయడానికి పూజా హెగ్డేను హీరోయిన్‌గా పరిశీలిస్తుండటం అంచనాలను మరింత పెంచేస్తోంది.

**అనిల్ సినిమాతోనే మళ్ళీ ఫామ్‌లోకి?:** ఒకప్పుడు టాలీవుడ్ గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న పూజా హెగ్డేకు 2025 సంవత్సరం అంతగా కలిసి రాలేదు. సూర్యతో కలిసి చేసిన 'రెట్రో' ఆశించిన విజయాన్ని అందించకపోగా, రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో కేవలం ఒక సాంగ్‌కే పరిమితమైంది. ఇప్పుడు ఆమెకు ఒక సాలిడ్ హిట్ చాలా అవసరం. అనిల్ రావిపూడి సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు చాలా ఎనర్జిటిక్‌గా, కామెడీ టైమింగ్‌తో ఉంటాయి. గతంలో అనిల్ సినిమాలో ఓ పాట లో మెరిసిన పూజాకు, ఇప్పుడు వెంకీ-రానా వంటి పవర్‌హౌస్



యాక్టర్లతో ఛాన్స్ దొరికితే ఆమె కెరీర్ మళ్ళీ స్పీడ్ అందుకోవడం ఖాయం. ఈ ప్రాజెక్ట్ ఓకే అయితే పూజా మళ్ళీ బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటే అవకాశం ఉంది. ఈ తెలుగు హీరోలైనా పూజా హెగ్డే కు మంచి హిట్ ఇస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.

**సంక్రాంతి రేసులో అనిల్ రావిపూడి:** వెంకటేశ్ క్లాస్ కామెడీ, రానా మాస్ ఇంటెన్సిటీ.. ఈ రెండింటిని అనిల్ రావిపూడి తన స్టైల్ లో ఎలా మిక్స్ చేస్తారో చూడాలని ఫ్యాన్స్ ఆత్రుతగా ఉన్నారు. ఇప్పటికే సంక్రాంతి సెంటిమెంట్ అనిల్ కు బాగా కలిసి వచ్చింది. ఈ సంక్రాంతికి వచ్చిన మన శంకర వరప్రసాద్ గారు 350 కోట్లు పైన కొల్లగొట్టి ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. అనిల్ నెక్స్ట్ తీసే ఈ మల్టీస్టారర్ చిత్రం ద్వారా వినోదాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. పూజా హెగ్డే కూడా ఈ టీమ్‌లో చేరితే, వచ్చే ఏడాది సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద 'దగ్గుబాటి' హీరోల హంగామా మామూలుగా ఉండదు. అధికారిక ప్రకటన వస్తే తప్ప ఈ కాంబినేషన్ పై ఒక క్లారిటీ రాదు, కానీ ప్రస్తుతానికైతే ఈ వార్త సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536